కమ్మటి నిద్ర.. కాసుల పంట!



కంటికి సరిపడా నిద్ర.. కడుపు నిండా తిండికి భారతీయులు నోచుకోవడం లేదు. ఆధునిక జీవనశైలి పేరుతో ప్రశాంతమైన నిద్రకు దూరమవుతున్నారు. 'ద గ్రేట్ ఇండియన్ స్లీప్ స్కోర్‌కార్డ్ - 2024' ఎడిషన్ ప్రకారం.. దాదాపు 50 శాతం మంది భారతీయులు నిద్రలేమితో బాధపడుతున్నారు. ఈ క్రమంలో బెంగళూరుకు చెందిన ఓ మహిళ.. కమ్మటి నిద్రతో రూ.9లక్షల బహుమతిని గెలుచుకొని 'ఔరా!' అనిపించారు. వివరాల్లోకి వెళ్తే.. బెంగళూరుకు చెందిన సాయీశ్వరి పాటిల్.. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా పనిచేస్తున్నారు. 'వేక్‌ఫిట్' సంస్థ ఏటా నిర్వహించే 'స్లీప్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్' మూడో సీజన్‌లో మరో 11మందితో కలిసి పాల్గొన్నారు. ఈ పోటీలో భాగంగా ప్రతి ఒక్కరూ రోజూ ఎనిమిది నుంచి తొమ్మిది గంటల సంపూర్ణ నిద్రను అనుభవించాలి. పగటిపూట కూడా 20 నిమిషాలపాటు కమ్మటి నిద్ర పోవాలి. కొన్ని ప్రత్యేకమైన పరికరాల ద్వారా వీరి నిద్రను నిర్వాహకులు ట్రాక్ చేస్తారు. ఎవరెవరు ఎన్ని గంటలు గాఢంగా నిద్ర పోయారో తెలుసుకుంటారు. అన్ని పరీక్షల్లో నెగ్గినవారికి 'స్లీప్ చాంపియన్' టైటిల్‌తో పాటు రూ.9 లక్షల భారీ మొత్తాన్ని బహుమతిగా అందజేస్తారు. ఈ పోటీలో సాయీశ్వరి పాటిల్ గెలుపొంది.. నగదు బహుమతిని కైవసం చేసుకున్నారు.



సబ్బులో బొమ్మ!

బూచాడమ్మా బూచాడు బుల్లిపెట్టెలో ఉన్నాడని అప్పుడెప్పుడో శ్రీదేవి పాడింది. ఆ ఫోనులో ఏ బూచాడూ లేడు. కానీ, సబ్బు పెట్టెలో మాత్రం.. సూపర్‌మ్యాన్, డోరేమాన్, స్పైడర్‌మ్యాన్, కెప్టెన్ అమెరికా, యూనికార్న్, మిక్కీమౌస్.. అబ్బో లెక్కలేనంత మంది ఉన్నారు! పిల్లలు ఇష్టపడే కామిక్ క్యారెక్టర్లను సబ్బుల్లో పెట్టి చిన్నారుల్ని స్నానానికి సన్నద్ధం చేస్తున్నాయి 'లా సెవో' సబ్బులు. పిల్లలకే కాదు తల్లులకూ ఇవి ఇష్టమైనవే. ఓషధులను రంగరించుకున్న ఈ సబ్బులతో ఎన్నో లాభాలు అంటున్నారు వీటి రూపకర్త అంజుమ్ ఫాతిమా. ఆమె చెబుతున్న టాయ్ సోప్ స్టోరీ తన మాటల్లోనే..

నేను మహారాష్ట్రలో పుట్టి పెరిగాను. ఎంబీఏ చదివిన తర్వాత కేర్ హాస్పిటల్స్ కార్పొరేట్ ఆఫీస్‌లో ఆడిటర్‌గా పనిచేశాను. ఉద్యోగం చేస్తున్నప్పుడే పెండ్లి అయింది. మా అత్తగారిది హైదరాబాద్. మా ఆయన, అత్తయ్య సపోర్ట్‌తో పెండ్లయ్యాక కూడా ఉద్యోగం కొనసాగించాను. అబ్బాయి పుట్టాడు. వాడు అంబాడటం మొదలుపెట్టాక, వాడిని పట్టుకోవడం మా అత్తగారికి కష్టమైంది. మావారు కార్పొరేట్ సంస్థలో పెద్ద ఉద్యోగి. తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తుండేది. దీంతో బాబు కోసం నేను ఉద్యోగం వదులుకోక తప్పలేదు. అబ్బాయి కాస్త పెద్దయ్యాక మళ్లీ ఉద్యోగం చేయాలనుకున్నా! కానీ, మూడేండ్లకు ఇంకో బాబు పుట్టాడు. ఉద్యోగం పోస్ట్‌పోన్ చేశాను. ఎలాగూ ఖాళీగానే ఉంటున్నానని చదువుపై దృష్టిపెట్టాను. బి.ఎడ్‌లో చేరాను. అయిపోయాక, ఇంటి దగ్గరే ఓ కార్పొరేట్ పాఠశాలలో టీచర్‌గా చేరాను. మా పిల్లల్నీ అదే స్కూల్‌లో చేర్పించాను. ఇంతలో హఠాత్తుగా మా అత్తగారు కాలం చేశారు. దాంతో నా ఉద్యోగానికి బ్రేక్ ఇవ్వక తప్పలేదు. పిల్లల్ని చూసుకోవడం, వాళ్లను చదివించడమే బాధ్యతగా మారింది.



కొవిడ్ తర్వాత..

కరోనా సమయం మనిషి దృక్పథాన్ని చాలావరకు మార్చేసింది. ఎన్నడూ లేనంతగా చాలామంది ఆర్గానిక్ ఫుడ్, హైజీన్, కెమికల్ ఫ్రీ ఉత్పత్తుల గురించి ఎక్కువగా చర్చించుకోవడం కనిపించింది. జనానికి ఆరోగ్యం పట్ల అవగాహన పెరిగింది. మంచి ఆహారం గురించి ఆలోచించసాగారు. సేంద్రియ ఉత్పత్తుల గురించి వాకబు చేయడం మొదలైంది. అయితే, కొవిడ్ ఉధృతి తగ్గాక ఆ చైతన్యం తగ్గుముఖం పట్టింది. ముఖ్యంగా కరోనాకు ముందు, తర్వాత కూడా సబ్బులు, షాంపులు, లోషన్లు, క్రీముల విషయంలో అవగాహన లేకుండా వ్యవహరించడం కనిపించింది. ఈ ఉత్పత్తుల్లో ఎలాంటి కెమికల్స్ వాడుతున్నారు, వాటివల్ల ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయి మొదలైన విషయాలేవీ పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించలేదు. ఇది నాకు ఆశ్చర్యం కలిగించింది. నేచురల్ ప్రొడక్ట్స్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నా... వాటికి డిమాండ్ అంతంతమాత్రమే! సౌందర్య ఉత్పత్తుల్లో వినియోగించే కెమికల్స్ వల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన జబ్బులు వస్తాయి. చాలామంది ఈ విషయాన్ని బేఖాతరు చేస్తున్నారు. దీనికి పరిష్కారంగా రసాయన ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా సహజ సిద్ధమైన సౌందర్య సాధనాలు తీసుకురావాలని భావించాను.

చిన్నగదిలో పెద్ద సంకల్పం

మార్కెట్లో ఉన్న రసాయన ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా సహజ ఉత్పత్తుల గురించి తెలుసుకున్నాను. సంప్రదాయ ఉత్పత్తుల గురించి కొంత అధ్యయనం చేశాను. మొదట ఒక ఫార్ములాతో సబ్బులు తయారుచేశాను. బంధువులు, స్నేహితులకు పంపించాను. వాళ్లు బాగున్నాయన్నారు. దాన్ని డెవలప్ చేయాలనే ఆలోచనతో ఎంఎస్ఎంఈలో ఫార్ములేషన్, ఇన్‌గ్రిడేషన్, బ్రాండింగ్, మార్కెటింగ్ శిక్షణ తీసుకున్నాను. సాధారణంగా మార్కెట్లో ఉండే సబ్బుల్లో సల్ఫైట్, పారాబెన్ రసాయనాలు ఉంటాయి. మేం వాటికి ప్రత్యామ్నాయంగా వేపాకు, అలోవెరా, పొప్పడి, పసుపు, బొగ్గుపొడి, ముల్తానీ మట్టిని సబ్బుల తయారీకి ఉపయోగిస్తాం. ఈ సబ్బుల్ని 'లా సెవో' బ్రాండ్ పేరుతో ఒక ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తే మంచి స్పందన వచ్చింది!

సీమంతాలకూ సబ్బే కానుక

రసాయనాలు లేని సబ్బులపై పెద్దలకు అవగాహన ఉండటంతో వాడతారు. కానీ, పిల్లలు.. సబ్బు అంటేనే అమ్మో వద్దంటారు. చేతులు కడుక్కోవడానికి బద్ధకిస్తారు. స్నానానికి మారాం చేస్తారు. బతిమిలాడినా వినరు. బెదిరిస్తే మొండికేస్తారు. అలాంటి చిన్నారులూ సబ్బును ఇష్టంగా చేతిలోకి తీసుకునే ఉపాయం టాయ్ సోప్. పిల్లలు హ్యాపీగా రుద్దుకుంటారు. ఎందుకంటే.. ఆ సబ్బులో ఉన్న బొమ్మ కోసం స్నానం చేయాల్సిందే. సబ్బు అరగదీయాల్సిందే. చేతిలో సబ్బు అరిగిపోతేనే చేతికి పట్టిన మురికి వదిలి, ఇష్టమైన టాయ్ చేతికి చిక్కుతుంది! రసాయనాలు లేని సబ్బుల్లో వాడే టాయ్స్ వల్ల కూడా ఏ హానీ ఉండకూడదనుకున్నాం. ప్రామాణికమైన ప్లాస్టిక్‌తో తయారుచేసిన టాయ్స్‌నే ఎంచుకున్నాం. పిల్లలకు ఇష్టమైన కామిక్ క్యారెక్టర్ సబ్బులు కావాలని పేరెంట్స్ ఆర్డర్ చేస్తున్నారు. నాకు మార్కెటింగ్ చేయడానికి అంతగా ఆర్థిక వనరులు లేవు. కాబట్టి ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ mamretails ద్వారా ఆర్డర్లు తీసుకుంటున్నాను. హైదరాబాద్ నుంచే కాకుండా జిల్లాల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. పుట్టిన రోజు గిఫ్ట్స్ కోసం బల్క్ ఆర్డర్స్ వస్తున్నాయి. వాటిని ఇండియా పోస్ట్ ద్వారా పంపిస్తాను. లోకల్‌గా అయితే రాపిడో ద్వారా డెలివరీ ఇస్తున్నాను. సీమంతానికి కూడా ఈ రసాయనాలు లేని సబ్బులు కావాలని వస్తున్నారు. పిల్లల పాదముద్రల్లా, ఆటబొమ్మల్లా, చంటిబిడ్డలకు పాలు తాగించే పాలసీసా, ఉగ్గు తినిపించే పాత్రల్లా ఉన్న సబ్బులు కావాలని అడుగుతున్నారు. కడుపులో కదిలే బిడ్డను తాకుతూ స్నానం చేసే గర్భిణులు మరింత సంతోషంగా ఆ రోజులు గడిపేందుకు ఈ టాయ్ సోప్స్ ఉపయోగిస్తున్నారు.

> **"హైదరాబాద్, విద్యానగర్‌లోని మా ఇంటిలోనే రెండు గదుల్ని ఈ కుటీర పరిశ్రమ కోసం ఉపయోగిస్తున్నాను. 'మామ్ రిటైల్స్' పేరుతో చిన్న పరిశ్రమను స్థాపించాను. నేను, ఆయన ఉద్యోగాలు చేసి, కూడబెట్టిన డబ్బుతోనే ఈ సబ్బుల తయారీ మొదలుపెట్టాను. ఆరు నెలల తర్వాత ఫేస్‌ప్యాక్, లిప్‌బామ్ తయారుచేశాను. వ్యాపార అభివృద్ధికి ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) ద్వారా కొంత ఆర్థిక సహాయం అందింది. అలా రెండేండ్ల కిందట కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టాను. ఎంఎస్ఎంఈ, సఫా ఇండియా, వి హబ్ సహకారంతో మా వ్యాపారాన్ని అభివృద్ధి బాట పట్టించాను. ఇప్పుడు రసాయనాలు లేని సబ్బులు, క్రీములు, లోషన్లు, షాంపులు తయారు చేస్తున్నాను. మొత్తం ఆరు కేటగిరీల్లో ఉత్పత్తులు మార్కెట్లోకి తీసుకువచ్చాను. కొద్ది పెట్టుబడే అయినా మంచి ఉత్పత్తి కావడంతో నాకు గుర్తింపుతోపాటు మా ఉత్పత్తులకు ఆదరణ వచ్చింది."**

... నాగవర్ధన్ రాయల

📷 గడసంతల శ్రీనివాస్

పాలలో పొడి.. ఇంట్లోనే

పాలలో కలుపుకొనేందుకు బయట రకరకాల పొడులు కొని వాడుతున్నాం. అయితే వాటిలో చక్కెరలు అధికమని ఇటీవలి కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. అంతేకాదు, వాటి ఖరీదు కూడా ఎక్కువే. ఇంట్లోనే ఏవైనా ఆరోగ్యకరమైన పొడులు తయారు చేసుకోవచ్చా?

పాలను సంపూర్ణ పౌష్టికాహారంగా చెబుతారు. ఇవి పిల్లల సమగ్ర ఎదుగుదలకు దోహదపడతాయి. అయితే పిల్లలతో పాలను తాగించేందుకు అందులో రకరకాల ఫ్లేవర్లు వచ్చేలా పొడుల్ని కొని కలుపుతున్నాం. నిజంగానే వీటిలో చక్కెరలు ఎక్కువ. నిల్వ ఉంచేందుకు రసాయనాలూ వాడతారు. వీటికి భిన్నంగా అటు రుచిగా ఉంటూ ఆరోగ్యాన్నిచ్చే పొడులను మనం ఇంట్లోనే చక్కగా తయారు చేసుకోవచ్చు. పిల్లలూ పెద్దలు ఎవరైనా వీటిని తాగొచ్చు. అంతేకాదు, ఎవరి అభిరుచిని బట్టి వాళ్లు ఈ పొడులను తయారు చేసుకునే వీలూ ఉంది. అందులో కొన్ని ఇప్పుడు చూద్దాం.



మయూరి ఆవుల
న్యూట్రిషనిస్ట్
Mayuri.trudiet@gmail.com

డ్రై ఫ్రూట్ పొడి



కావాల్సిన పదార్థాలు

బాదం పప్పు: 100 గ్రా
జీడిపప్పు: 25గ్రా
వాల్‌నట్స్: 50 గ్రా
పిస్తా: 25 గ్రా
బెల్లం పొడి: 100-150 గ్రా
డార్క్ కొకోవా పొడి: 25 గ్రా

డ్రైఫ్రూట్లన్నిటితోపాటు బెల్లంపొడిని మిక్సీలో వేసి తిప్పి, కొకోవా పొడినీ జోడించాలి. వీటన్నిటినీ బాగా కలిపి గాలి చొరబడని సీసాలో పోసి ఉంచుకోవాలి. డ్రైఫ్రూట్ ఫ్లేవర్ ఇష్టం ఉన్నవాళ్లు దీన్ని హాయిగా ఆస్వాదించొచ్చు.





రాగి చాక్లెట్ పొడి

కావాల్సిన పదార్థాలు

రాగిపొడి: 100 గ్రా
కొకోవా పొడి (తీపి కలపనిది): 50 గ్రా
బెల్లం పొడి: 100 గ్రా

అన్నిటినీ బాగా కలుపుకొంటే, చాక్లెట్ రుచితో పాలలో కలుపుకొనే పొడి తయారవుతుంది.

గింజలతో..

కావాల్సిన పదార్థాలు

బాదం: 50 గ్రా.
గుమ్మడి గింజలు: 20గ్రా.
పొద్దుతిరుగుడు గింజలు: 20గ్రా.
చియా గింజలు: 20 గ్రా.
ఓట్స్: 20 గ్రా.
పాలపొడి: 50గ్రా.
బెల్లం పొడి: 50 గ్రా.

గింజలన్నిటితోపాటు ఓట్స్, బాదంను కూడా కలిపి మెత్తటి పొడిలా మిక్సీ పట్టుకోవాలి. తర్వాత పాలపొడి, బెల్లం పొడులను ఈ మిశ్రమానికి జోడించాలి. గాలి చొరబడని డబ్బాలో పోసి ఉంచుకోవాలి. గ్లాసు పాలకు ఒక టేబుల్ స్పూన్ పొడి కలుపుకొంటే చక్కటి రుచితో పాలు తాగొచ్చు.



ఈ పొడులలో ప్రిజర్వేటివ్‌లు (నిల్వకోసం వాడే రసాయనాలు), అధిక చక్కెరలు, ఆర్టిఫీషియల్ ఫ్లేవర్లు, రుచిని పెంచేందుకు వాడే టేస్ట్ ఎన్‌హ్యాన్సర్లు ఉండవు. కాబట్టి శక్తినిచ్చేందుకు ఇవి చక్కటి ప్రత్యామ్నాయాలు. నిజానికి స్టోర్ల నుంచి మనం కొనే పొడుల్లోని అధిక చక్కెరలు పిల్లలను అత్యుత్సాహపరుస్తాయి. ఇంట్లో చేసుకునే పొడులతో పోలిస్తే పోషక విలువలూ చాలా తక్కువ. వీటిలో ఉండే గింజల్లో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్, లో శాచురేటెడ్ ఫ్యాట్‌లు మంచి కొవ్వుల్ని దేహానికి అందిస్తాయి. అంతేకాదు, చక్కటి ప్రొటీన్, పీచులు కూడా వీటిలో ఉంటాయి. డ్రైఫ్రూట్లు, గింజల్లో యాంటి ఆక్సిడెంట్లూ ఎక్కువగా దొరుకుతాయి. ఇవి జీవక్రియల వేగాన్ని పెంచుతాయి. ఈ పొడుల్లో విటమిన్ ఇ, బి6, నియాసిన్, ఫోలేట్, మినరల్స్, మెగ్నీషియం, జింక్, పొటాషియంలాంటి ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. బెల్లంలో శరీరానికి అత్యవసరమైన ఐరన్ లభిస్తుంది. ఇది పిల్లల్ని చురుకుగా ఉంచుతుంది. ఇక, పిల్లల ఎముకలు, పళ్లను రాగిలో ఉండే కాల్షియం దృఢంగా తయారుచేస్తుంది. మోస్తరు మోతాదుల్లో తీసుకొనే కొకోవా... పొడికి మంచి రుచిని ఇవ్వడమే కాకుండా, చక్కటి భావోద్వేగాలు, సృజనాత్మక ఆలోచనల పెంపునకు సాయపడుతుంది. మొత్తానికి ఈ పొడులు పోషకాల విషయంలో పాలకు సాటిమేటీ అన్నమాట. బయట కొనే వాటితో పోలిస్తే మంచి ఆరోగ్యాన్నిచ్చి, తక్కువ ఖర్చుతో అయిపోయే ఇవి అమ్మల బెస్ట్ చాయిస్ అని చెప్పొచ్చు.

వాంతొస్తే.. వస్తున్నాదా?!

కొందరికి ప్రయాణాలంటే చచ్చేంత భయం! బండి రోడ్డెక్కిందో లేదో.. భళ్లున వాంతి కావడమే అందుకు కారణం. 'మోషన్ సిక్‌నెస్'గా పిలిచే ఈ సమస్య.. రెండేళ్ల నుంచి 12 ఏళ్లలోపు వారిలోనూ, ఆడవాళ్లలోనూ ఎక్కువగా కనిపిస్తుంది. ప్రతి ముగ్గురిలో ఒకరిని ఈ ఇబ్బంది వేధిస్తుంది. ఆటో, కారు, బస్సు, రైలు, విమానం అనేకాదు.. ఓడల్లో ప్రయాణం చేసినా.. ఇట్టే వాంతి అవుతుంది. ఈ సమస్యకు కారణాలు అనేకం.

చెవిలో ఉండే 'లాబ్రింథైస్' అనే భాగానికి ఇబ్బంది కలగడం వల్లే ప్రయాణాల్లో తల తిరగడం, వాంతులు వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ భాగం పరిశుభ్రంగా లేకపోయినా, ఇన్ఫెక్షన్ వల్ల చీముపట్టినా 'లాబ్రింథైస్' దెబ్బతింటుంది. ప్రయాణంలో ముందుకూ - వెనక్కీ ఊగడం, పైకీ - కిందికీ ఎగరడం వల్ల చెవిలోని 'లాబ్రింథైస్' వ్యవస్థపై ప్రభావం పడుతుంది. ఇది మోషన్ సిక్‌నెస్‌కు కారణమవుతుంది. అలాంటప్పుడు బాధితుల చెవులు మూయడం వల్ల కాస్త ఉపశమనం లభిస్తుంది. చెవుల్లోకి గాలి వెళ్లనీయకుండా చేసి 'లాబ్రింథైస్'పై ఒత్తిడి తగ్గిస్తే.. వాంతులు రాకుండా చూసుకోవచ్చు. ఇక నిమ్మకాయ, అల్లం రుచి చూడటం వల్ల కూడా వాంతులు రాకుండా అడ్డుకోవచ్చు. నిమ్మకాయలో ఉండే ఎసిడిక్ ఆమ్లాలు వాంతులను నిరోధిస్తాయి. అల్లం.. వికారాలను తగ్గిస్తుంది. అందుకే, ప్రయాణాల్లో తరచుగా వాంతులు చేసుకునే వాళ్లు నిమ్మకాయ, అల్లం ముక్క పట్టుకుని వెళ్లడం మంచిది. అలాగే, మోషన్



సిక్‌నెస్ ఉన్నవాళ్లు వాహనం ప్రయాణిస్తున్న దిశకు వ్యతిరేక దిశలో కూర్చోవద్దు. ప్రయాణాల్లో పుస్తకాలు చదవడం, ఫోన్ చూడటం మానేయాలి. అన్నిటికంటే ముఖ్యంగా.. ప్రయాణంలో వాంతులు వస్తాయనే విషయాన్ని మెదడులోకి రానీయకూడదు. ఇలాంటి చిట్కాలు పాటిస్తే.. ప్రయాణాలను సాఫీగా సాగించొచ్చు.

పరిశుభ్రం.. ఆరోగ్యకరం!

నేటితరం మహిళలు నవ్యతకు పెద్దపీట వేస్తున్నారు. కాలి చెప్పులు మొదలుకొని.. కళ్ల కాటుక వరకూ అన్నీ ఆధునికంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఆధునిక వస్తువులతో అనేక ప్రయోజనాలు పొందుతున్నా.. కొన్ని విషయాల్లో మాత్రం పాతకాలపు పద్ధతులనే పాటిస్తున్నారు. ముఖ్యంగా, నెలసరి సమయంలో ఉపయోగించే 'మెన్‌స్ట్రువల్ కప్' విషయంలో.. భారతీయ మహిళలు ఇప్పటికీ అపనమ్మకంతోనే ఉన్నారట. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) లక్నో.. ఇటీవల నిర్వహించిన ఒక అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ క్రమంలో ఆరోగ్యంతోపాటు పర్యావరణానికీ అనుకూలంగా ఉండే 'మెన్‌స్ట్రువల్ కప్' వాడకం పెంచేలా మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదని గైనకాలజిస్టులు చెబుతున్నారు. పునర్వినియోగించే అవకాశమున్న ఈ సిలికాన్ కప్‌లను.. సాధారణ ప్యాడ్‌ల కన్నా ఎక్కువ సమయంపాటు ఉపయోగించొచ్చు. రోజూ ఆరు నుంచి ఎనిమిది గంటల వరకూ వాడుకోవచ్చు. రక్తస్రావం తక్కువగా ఉన్నట్టయితే.. 12 గంటల వరకూ మార్చుకున్నా ఫర్వాలేదని గైనకాలజిస్టులు అంటున్నారు. దీర్ఘకాలంలో వాడే సాధారణ ప్యాడ్‌లకన్నా.. ఇది ఎంతో చవకైనది కూడా. వీటిని తరచుగా మార్చాల్సిన అవసరం ఉండదు. అంతేకాకుండా.. ప్యాడ్ వల్ల వచ్చే అలర్జీలు, ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. అయితే, ఈ 'మెన్‌స్ట్రువల్ కప్' మొదటిసారి ఉపయోగించేవారికి కాస్త అసౌకర్యంగా ఉంటుంది. వాటిని శుభ్రం చేయడం కూడా చిరాకుగా అనిపిస్తుంది. కానీ, ఇవి మహిళల ఆరోగ్యానికి, పరిశుభ్రతకు ఎంతో ఉపయోగపడతాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి. అయితే.. 'మెన్‌స్ట్రువల్ కప్' ఎంచుకునే విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళలకు సరిపడే రకాలనే ఎంచుకోవాలి. వాటిని సురక్షితంగా అమర్చుకోవడం కూడా చాలా ముఖ్యమైన విషయం.



పటికతో దగ్గరగా రా!



శరీర దుర్వాసన... కొంత మందిని ఇబ్బంది పెట్టే సమస్య. జీవిత భాగస్వామి దగ్గరే కాదు, ఆఫీసులు కాలేజీల్లోనూ ఎవరైనా సమీపానికి వస్తేనే కంగారు పడే పరిస్థితి ఉంటుంది. అలాంటి వాళ్లకు చక్కటి పరిష్కారం పటిక. ఇంగ్లీషులో ఆలమ్ అని పిలిచే ఇది క్రిస్టల్ రూపంలోనూ, పొడి రూపంలోనూ దొరుకుతుంది. పటిక ముక్కను తీసుకుని కొద్ది నీళ్లతో తడపాలి. ఆ ముక్కను చంకలు, ఇతర దుర్వాసన వచ్చే భాగాల్లో రుద్దాలి. కాసేపు అలా వదిలేసి దుస్తులు ధరిస్తే సరి. పొడిరూపంలో ఉన్నదైతే... ఎసెన్షియల్ ఆయిల్‌తో కలిపి దుర్వాసన వచ్చే భాగాల్లో రాయాలి. ఇందులోని యాంటీబ్యాక్టీరియల్ గుణాలు చెమటనూ, బ్యాక్టీరియానూ అరికట్టి దుర్వాసనను దూరం చేస్తాయి. ఇంకేం, దగ్గరగా రా... దగ్గరగా... అని పాడొచ్చు!



మూసీలో భారీ స్కామ్

- సుందరీకరణ పేరిట కుంభకోణం
- పాకిస్థానీ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం
- అన్ని వివరాలు త్వరలో వెల్లడి
- జీహెచ్‌ఎంసీలో మొత్తం 31 ఎస్టీపీలు మేమే నిర్మించాం
- సీఎం చేయాల్సిందల్లా గ్యారెంటీల అమలే
- కూకట్‌పల్లిలో మురుగునీటి శుద్ధి కేంద్రం, ఖాజాకుంట ఎస్టీపీని పరిశీలించిన కేటీఆర్
- 11.86 ఎకరాల్లో 171.57 కోట్ల నిధులతో బీఆర్‌ఎస్ హయాంలోనే నిర్మాణం



కూకట్‌పల్లి ఫతేనగర్‌లోని ఎస్టీపీ వద్ద శుద్ధి చేసిన నీటిని చూపుతున్న కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): మూసీ నది సుందరీకరణ పేరుతో రూ.వేల కోట్ల కుంభకోణం జరుగుతున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆరోపించారు. మూసీ సుందరీకరణ పనులను పాకిస్థాన్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, బ్లాక్‌లిస్టులో ఉన్న కంపెనీకి అప్పగించాలని చూస్తున్నారని మండిపడ్డారు. త్వరలోనే అన్ని వివరాలు బయటపెడతానని హెచ్చరించారు. బుధవారం ఆయన కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఎల్బీఎస్‌నగర్‌లో జలమండలి నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రం, కూకట్‌పల్లి ఖాజాకుంటలో నిర్మించిన మరో ఎస్టీపీని పరిశీలించారు. బీఆర్‌ఎస్ హయాంలో 11.86 ఎకరాల స్థలంలో రూ.171.57 కోట్ల నిధులతో 133 ఎంఎల్‌డీ సామర్థ్యంతో జలమండలి ఆధ్వర్యంలో ఈ మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం చేపట్టడం విశేషం. కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్‌అలీ, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జలమండలి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన ఎస్టీపీలను వినియోగించుకుంటే సరిపోతుందని స్పష్టంచేశారు. తమ ప్రభుత్వం రూ.4 వేల కోట్లతో జీహెచ్‌ఎంసీ పరిధిలో 31 ఎస్టీపీలు నిర్మించిందని చెప్పారు. మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి, మంత్రుల మాటలకు పొంతన లేదని దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ కోసం 1.50 కోట్లు ఖర్చు పెడుతున్నట్టు ఒకసారి, రూ.50 వేల కోట్లు అని మరోసారి, రూ.75 వేల కోట్లు అని ఇంకోసారి ఇలా రకరకాలుగా మంత్రులు పొంతనలేని ప్రకటనలు చేయడం వెనుక అస లు ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. మంత్రుల మాటలు చూస్తుంటే పలు అనుమానాలు తలెత్తున్నాయని చెప్పారు. మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అసలు ఉద్దేశం వేరే ఉన్నదా? అనే అనుమానం ప్రజల్లో కలుగుతున్నదని పేర్కొన్నారు. ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీరు మూసీలోకి వెళ్తుందని, 94% స్వచ్ఛమైన నీరు వెళ్తున్నప్పుడు మూసీ శుద్ధి ఎందుకు? అని ప్రశ్నించారు. కొత్తగా శుద్ధి చేసేదేమీలేదని తెలిపారు. మూసీ నిర్వాసితులకు ముందుగానే నష్టపరిహారం చెల్లించాలని, డబుల్ బెడ్‌రూం ఇంటి తాళాలు అప్పగించి కూల్చివేతలు చేపట్టాలని, లేనిపక్షంలో మూసీ వద్ద కూల్చివేతలను బీఆర్‌ఎస్ అడ్డుకుంటుందని హెచ్చరించారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గ్యారెంటీలు అమలు పరిచేదాకా ప్రజల పక్షాన నిలబడతామని స్పష్టంచేశారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా హామీ ఇచ్చిన రూ.4 వేల పింఛన్, తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2,500 వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలుచేయాలని, వానకాలం రైతుభరోసాను రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. పబ్లిసిటీ స్టంట్ల మాయ ఎక్కువ రోజులు పని చేయదని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన శ్మశానవాటికలు, లింక్‌రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, లైబ్రరీలు, కమ్యూనిటీ హాల్స్, పార్కులు, మురుగునీరు శుద్ధి కేంద్రాలను చూసి ప్రజలు ప్రశంసలు కురిపించారని తెలిపారు. కూకట్‌పల్లిలో ఎస్టీపీల నిర్మాణం కోసం రూ.300 కోట్లు కేటాయించగా నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇండ్ల కూల్చివేతల విషయంలో ముఖ్యమంత్రి అన్నదమ్ములకు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయమా? అని కేటీఆర్ ప్రశ్నించారు. పేదల ఇండ్లు కూల్చడానికి బుల్డోజర్లు పెడతరు కానీ, పెద్దలకు పెట్టరా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. బుల్డోజర్ల బాధితులకు వెంటనే రెడీగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధం

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన నాలుగు ప్రాజెక్టులు పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని కేటీఆర్ తెలిపారు. పనులు పూర్తి చేసుకున్న ఫతేనగర్ ఎస్టీపీని ప్రారంభించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నదని మండిపడ్డారు. ఫతేనగర్ బ్రిడ్జి కోసం రూ.60 కోట్లు కేటాయించి పనులు చేపట్టినా నిధులు విడుదల చేయని కారణంగా ఆ పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. తాము 14 వేల ఎకరాల స్థలాన్ని ఫార్మాసిటీకి కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దానిని రద్దు చేసి, ఫ్యూచర్ సిటీ ఏర్పాటుచేస్తామనడం శోచనీయమని పేర్కొన్నారు.

బహుజన అస్తిత్వ పతాక 'ఐలమ్మ'

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నివాళి



హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతాంగ పోరాట యోధ, ఆత్మగౌరవ ప్రతీక, వీరనారి చిట్యాల ఐలమ్మ అందించిన పోరాట స్ఫూర్తిని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. గురువారం ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె పోరాట స్ఫూర్తిని కేసీఆర్ నెమరువేసుకున్నారు. అణచివేతకు గురైన బలహీన వర్గాల తిరుగుబాటు తత్వానికి, ప్రతిఘటనా పోరాటానికి ఐలమ్మ స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఐలమ్మ ఆకాంక్షలకు అనుగుణంగానే పదేండ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల కోసం సంక్షేమ, ప్రగతి కార్యాచరణను అమలు చేసిందని గుర్తుచేశారు. దేశంలో మరెక్కడాలేని విధంగా తెలంగాణ సబ్బండవర్గాలకు వేల కోట్లతో పలు పథకాలను అమలు చేసి వారిని గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిపిందని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక పాలనపై ధిక్కారాన్ని ప్రకటించిన ఐలమ్మ ప్రతిఘటనాతత్వం ఎల్లవేళలా ఆదర్శమని కేసీఆర్ తెలిపారు. ఐలమ్మ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించే దిశగా నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించి అమలు చేసిందన్నారు. బలహీన వర్గాలు, పేదల అభ్యున్నతే లక్ష్యంగా పని చేయటమే ఐలమ్మకు మనం అర్పించే ఘన నివాళి అని తెలిపారు.

నేడు పాడి రైతుల మహా ధర్నా

- ఇందిరాపార్క్ వద్ద భారీ ఆందోళనకు పిలుపు
- జిల్లాల నుంచి తరలిరానున్న వందల మంది పాడి రైతులు
- 150 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 25(నమస్తే తెలంగాణ): పాల బిల్లులు చెల్లించాలనే ప్రధాన డిమాండ్‌తో విజయ డెయిరీ పాడి రైతులు గురువారం హైదరాబాద్‌లో మహాధర్నాకు పిలుపునిచ్చారు. విజయ పాడి రైతుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఇందిరాపార్క్ వద్ద ఈ భారీ ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి పాడి రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నది. ఇప్పటికే ఆయా జిల్లాల్లో రైతులు సన్నాహక సమావేశాలను కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికే పాడి రైతుల ధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వడంతో పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చే అవకాశం ఉన్నది. అయితే ధర్నాకు వచ్చే పాడి రైతుల గురించి పోలీసులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఏ గ్రామం నుంచి ఎంతమంది వెళ్తన్నారు, ఎవరెవరు వెళ్తున్నారు? వంటి వివరాలను తెలుసుకుంటున్నట్టు తెలిసింది. విజయ డెయిరీ పాడి రైతులకు సుమారు మూడు నెలలుగా పాల బిల్లులు చెల్లించడం లేదు. ఇప్పటివరకు సుమారు రూ.150 కోట్ల వరకు పెండింగ్ బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. దీంతో బకాయిలు చెల్లించాలంటూ పాడి రైతులు రాష్ట్రవ్యాప్తంగా రోడెక్కారు. రోడ్లపై పాలు పారబోసి నిరసనలకు దిగారు. ప్రభుత్వ అధికారులకు, మంత్రులకు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేశారు. కానీ ప్రభుత్వం నుంచి బకాయిల చెల్లింపుపై కనీస స్పందన రాలేదు. ఈ విధంగా ఓవైపు ప్రభుత్వం పట్టించుకోకపోవడం, మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో పాడి రైతులు చివరి పోరాటానికి సిద్ధమయ్యారు.

బకాయిల విడుదల డ్రామా

పాడిరైతులు మహాధర్నాకు పిలుపునివ్వడంతో ప్రభుత్వంలో కాస్త కదలిక వచ్చింది. రూ.50 కోట్ల బకాయిలు విడుదల చేసినట్టు విజయ డెయిరీ ప్రకటించింది. ఈ బిల్లులు మంగళవారం రైతుల ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. బుధవారం కొందరికి రెండు బిల్లులు, ఇంకొందరికి ఒకే బిల్లు జమ చేయగా మరికొంత మందికి నయా పైసా ఇవ్వలేదు. అయితే ఇదంతా తమ ఆందోళనను ఆపేందుకు ప్రభుత్వం చేస్తున్న డ్రామాగా పాడి రైతులు అనుమానిస్తున్నారు. మొత్తం బకాయిలు చెల్లించేవరకు తమ పోరాటం ఆగదని, గురువారం నాటి ధర్నా యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేస్తున్నారు.

కులవృత్తి మెడపై రేవంత్ సర్కార్ కత్తి

రాష్ట్రంలో కులవృత్తులపై రేవంత్‌రెడ్డి సర్కార్ కత్తికట్టిందని కేటీఆర్ విమర్శించారు. మత్తడి దుంకే చెరువుల్లో మత్స్య సంపద సృష్టించిన నీలి విప్లవాన్ని నీరుగారుస్తున్నారని విమర్శించారు. ఇప్పటిదాకా చేప పిల్లల పంపిణీ మొదలు కాలేదని, టెండర్ల దశ దాటనే లేదని, ఆ ప్రక్రియ ఉంటుందో, లేదో ఎవరికీ తెలియని గందరగోళం నెలకొన్నదని పేర్కొన్నారు.

కాంగ్రెస్ సర్కారువి బోగస్ మాటలు: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పాడి రైతులను కాంగ్రెస్ సర్కార్ పడావుపెట్టేలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తమ పాల బిల్లులు ఇవ్వాలని రైతులు రోడ్డెక్కి నిరసన చేస్తే భయపడిన ప్రభుత్వం రూ .150 కోట్ల బకాయిల్లో కేవలం రూ. 50 కోట్లే విడుదల చేసి చేతులు దులుపుకొన్నదని మండిపడ్డారు. ఎత్తు కుర్చీల్లో కూర్చోవడం కాదని, కన్నెత్తి రైతుల గోస కూడా చూడాలని కోరారు. మాఫీ కానీ రుణమాఫీ, పత్తాలేని పాల బిల్లులు, భరోసాలేని రైతు భరోసా, బోనస్ పేరుతో బోగస్ మాటలు అని దుయ్యబట్టారు. బోగస్ హామీలతో రైతుల గొంతు నొక్కి గద్దెనెక్కి రాచరిక దర్పాన్ని ప్రదర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

మంత్రుల అరాచకాలను ఎండగడతం

- అహంకారంతో విచ్చలవిడిగా అవినీతి
- నల్లగొండ పార్టీ నేతలతో కేటీఆర్ సమావేశం
- జగదీశ్‌రెడ్డి నివాసంలో కొనసాగిన భేటీ
- పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రుల అవినీతి, అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హెచ్చరించారు. అధికారం ఉందన్న అహంకారంతో జిల్లా మంత్రులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా ముఖ్య నేతలతో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాసంలో కేటీఆర్ సమావేశమయ్యారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయటంతోపాటు కార్యకర్తలకు భరోసా ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు, కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లగొండ జిల్లాలో మళ్లీ ఫ్లోరోసిస్ భూతం తెరపైకి వస్తున్నదంటూ పార్టీ నేతలు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ నేతల అరాచకాలు, అవినీతికి అడ్డు అదుపు లేకుండా పో యిందని వివరించారు. మంత్రుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఏవిధంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారో నియోజకవర్గాలవారీగా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్ని అంశా ల్లో అడ్డగోలుగా వ్యవహరిస్తుండటంతో వారిపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని చెప్పారు.

స్థానిక సమస్యలపై పోరాడుదాం

రాష్ట్ర రాజకీయాలతోపాటు నల్లగొండ జిల్లాకు సంబంధించిన స్థానిక అంశాలపై కూడా మరింత చురుగ్గా ప్రజాక్షేత్రంలోకి వెళ్లి పోరాడుదామని జిల్లా నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. జిల్లాలో లేవనెత్తాల్సిన సమస్యలను వారికి వివరించారు. త్వరలో జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పర్యటించి కాంగ్రెస్ నేతల అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో జగదీశ్‌రెడ్డితోపాటు మాజీ ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్, గొంగిడి సునితా మహేందర్‌రెడ్డి, నోముల భగత్, రవీంద్రకుమార్, ఎన్ భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్య, బిక్షమయ్యగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, జడ్పీ మాజీ చైర్మన్లు సందీప్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పలువురు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.




బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా ముఖ్యనేతలతో చర్చిస్తున్న కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ చైర్మన్లు

దాడులు చేస్తూ కేసులు పెడితే సహించం

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ నియోజకవర్గం మరుపల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్తలైన నవీన్, ప్రవీణ్ అనే ఇద్దరు దళితులపై స్థానిక ఎస్సై, పోలీసులు దాడి చేసిన ఘటనపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నేతలపై దాడులు చేస్తున్నవారిని, అక్రమ కేసులు బనాయిస్తున్నవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. మరుపల్లిలో దాడికి గురైన దళితులతో కలిసి బుధవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పిన కేటీఆర్.. పార్టీ అండగా ఉంటుందని, లీగల్‌సెల్ ద్వారా న్యాయసాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తాను కూడా వికారాబాద్‌కు వచ్చి ఆందోళన చేస్తానని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు, హ్యూమన్ రైట్స్ కమిషన్‌కూ ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎస్సైలు, సీఐలు ఎక్స్‌ట్రాలు వేస్తే వారిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. మన మీద దాడులు చేస్తూ, తప్పుడు కేసులు బనాయిస్తున్నవారి పేర్లు రాసి పెట్టుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక వారికి శంకరగిరి మాన్యాలు పటిస్తామని చెప్పారు.

స్పీకర్ స్పందించాలె...

తన సొంత నియోజకవర్గంలోనే దళిత బిడ్డలను పోలీసులు కొడుతుంటే స్పీకర్ పట్టించుకోకపోవటం విచారకరమని కేటీఆర్ పేర్కొన్నారు. దాడికి పాల్పడిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని స్పీకర్, డీజీపీతో మాట్లాడుతానని చెప్పారు. సమావేశంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద పటేల్, మరుపల్లి మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మధుకర్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు భట్టు రమేశ్, అట్లూరి ఆశోక్, రాచన్న, కౌన్సిలర్ గోపాల్, అనంతరెడ్డి, వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, యువత అధ్యక్షుడు మధుకర్, నాయబ్‌గౌడ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మరుపల్లిలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా అరాచకాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రే గూండా లెక్క మాట్లాడుతున్నారని, ఆయనను చూసి కాంగ్రెస్ కార్యకర్తలు కూడా గూండాల మాదిరిగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. కొంతమంది గూండాలను ఎస్కార్ట్ పెట్టి కౌశిక్‌రెడ్డి ఇంటిపైకి దాడికి పంపారని దుయ్యబట్టారు.



తెలంగాణ భవన్‌లో హనుమకొండ నియోజకవర్గ నేతలతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు వినయ్‌భాస్కర్, యాదవరెడ్డి, కేతిరెడ్డి తదితరులు

పదిచోట్లా ఉప ఎన్నికలొస్తయ్

- ప్రజలే బుద్ధి చెప్తారు
- రేవంత్‌కి బీజేపీ రక్షణ కవచం
- చిట్టినాయుడు, బ్రదర్స్ రాష్ట్రాన్ని దోచేస్తున్నారు
- హనుమకొండ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులు జరిగిన పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో బరాబర్ ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పునరుద్ఘాటించారు. ఆయా నియోజకవర్గాల్లో ఫిరాయింపుదారులకు ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ పార్టీని మోసం చేసినవారికి బుద్ధిచెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని, మళ్లీ నాలుగేండ్లలో కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణభవన్‌లో బుధవారం హనుమకొండ నియోజకవర్గ కార్యకర్తలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో పెద్దపదవులు అనుభవించిన కొందరు సిగ్గులేకుండా పార్టీని వీడిపోయారని, హైకోర్టు ఆర్డర్‌తో వారిలో భయం మొదలైందని పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉపఎన్నిక వస్తదని, అక్కడ బీఆర్‌ఎస్ గెలుస్తదని, అక్కడి నుంచి రాజయ్యను ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు.

రేవంత్‌కు రక్షణ కవచంగా బీజేపీ

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ నేతలు రక్షణకవచంగా, అండగా నిలుస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ టెండర్లలో అవినీతి జరిగితే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నోరు మెదపడంలేదని, మరో మంత్రి బండి సంజయ్ గబ్బుగబ్బు మాట్లాడుతున్నారని, ఆ పార్టీ ఎంపీలు, నేతలు రేవంత్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని నడుపుడంటే పంచ్ డైలాగులు కొట్టినంత ఈజీ కాదనే విషయం రేవంత్‌కు ఇప్పుడు అర్థమవుతున్నట్టు ఉన్నదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రేవంత్ పరిపాలన చూసిన తరువాత కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ వివరించారు. ముఖ్యమంత్రి అమెరికా పర్యటనలో ఆయన సోదరుడే రూ.వెయ్యి కోట్ల ఒప్పందం కుదుర్చుకున్నాడని, ఆ వెయ్యికోట్లు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. చిట్టినాయుడు, ఆయన అన్నదమ్ములు రాష్ట్రాని దోచుకుంటున్నారని, మంత్రులు ఎక్కడికక్కడ దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వరంగల్‌కు చేసింది చెప్పుకోలేకపోయాం. బీఆర్‌ఎస్ హయాంలో వరంగల్ నగరానికి రూ.వేల కోట్ల కేటాయించగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా అభివృద్ధి పనులను రద్దు చేస్తున్నదని కేటీఆర్ ధ్వజమెత్తారు. వరంగల్‌కు తెలంగాణలోనే అతి పెద్ద దవాఖాన, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఐటీ కంపెనీలను తీసుకొచ్చినా గత ఎన్నికల్లో సరిగ్గా చెప్పుకోలేకపోయామని పేర్కొన్నారు. ఎంజీఎం దవాఖాన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, దీనిపై ఆందోళన చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. వరంగల్‌ను ఐటీ హబ్ చేస్తామంటున్న కాంగ్రెస్ నేతలు దానిని గబ్బు చేయకుంటే చాలని ఎద్దేవా చేశారు. హైడ్రా డ్రామా వరంగల్‌లో కూడా మొదలవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హామీల అమలు కోసం కమిటీలు వేసుకుందామని, ఆ బృందం షాడో గవర్నమెంట్ మాదిరిగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పనిచేస్తుందని కేటీఆర్ వివరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ కే వాసుదేవరెడ్డి, డిప్యూటీ మేయర్ మసూద్, సుంచు కృష్ణ, వీరేందర్, నయీం, రాంబాబు, సారంగపాణి తదితరులుపాల్గొన్నారు.

వినయ్ భాస్కర్ మంత్రి అయితడు

దాస్యం వినయ్‌భాస్కర్ నిబద్ధత కలిగిన, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడని కేటీఆర్ కొనియాడారు. వినయ్‌భాస్కర్ భవిష్యత్‌లో తప్పకుండా మంత్రి అయితడని చెప్పారు. రాష్ట్రంలో చాలామంది బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని, ఇంకో వందేండ్లు ఉండేవిధంగా పార్టీని బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. పార్టీ నిర్మాణంపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. శాసనమండలిలో ప్రధాన ప్రతిపక్ష నేత ఎస్ మధుసూదనాచారి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన మాకొద్దు అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పతనం హనుమకొండ నుంచే ప్రారంభంకావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ మాట్లాడుతూ అన్ని వర్గాలను అతి తక్కువ సమయంలోనే మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందని పేర్కొన్నారు.



అమ్మమ్మ -తాతయ్యకు కేటీఆర్ ప్రేమతో..

జోగినపల్లి లక్ష్మి-కేశవరావు జ్ఞాపకార్థం స్కూల్ భవనం.. సొంత ఖర్చులతో నిర్మాణం.. నేడు ప్రారంభోత్సవం

బోయినపల్లి, సెప్టెంబర్ 25: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని జడ్పీ పాఠశాలలో ప్రైమరీ స్కూల్ కొనసాగేది. పక్కా భవనం లేకపోవడంతో ప్రాథమిక పాఠశాలలోని రెండు గదుల్లో అరకొర సౌకర్యాలతో విద్యాబోధన జరిగేది. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులను స్థానిక నాయకులు.. రెండేండ్ల క్రితం కొదురుపాక పాఠశాలకు వచ్చిన అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి తన అమ్మమ్మ, తాతయ్య జోగినపల్లి లక్ష్మి-కేశవరావు జ్ఞాపకార్థం సొంత ఖర్చులతో నూతన భవనం నిర్మిస్తానని హామీ ఇచ్చారు. 2022 జనవరి 10న ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కేటీఆర్ సూచన మేరకు కార్పొరేట్‌కు దీటుగా అధునాతన సౌకర్యాలు కల్పించి రెండు ఫ్లోర్లలో 18 తగరతి గదుల నిర్మాణం చేపట్టారు. వంట గదితోపాటు డైనింగ్‌హాల్, కంప్యూటర్ గదులు, ప్రహరీ నిర్మాణాలు పూర్తి చేశారు. గురువారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతులమీదుగా పాఠశాల భవనాన్ని ప్రారంభించనున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి స త్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత జోగినపల్లి శ్రీనివాస్ హాజరుకానున్నారు.

పండుగలకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): దసరా, దీపావళి వరుస పండుగల నేపథ్యంలో ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్టు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. రాజ్‌కోట్-మహబూబ్‌నగర్, భువనేశ్వర్-యశ్వంత్‌పూర్, షాలీమార్-చెన్నై స్టేషన్ల మధ్య అక్టోబర్ 7 నుంచి నవంబర్ 20 వరకు ప్రత్యేక రైళ్లు రాకపోకలు కొనసాగిస్తాయని పేర్కొన్నారు. హుబ్లీ-హైదరాబాద్, విజయపుర-హైదరాబాద్ స్టేషన్ల మధ్య పలు రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

- గోల్డ్ ఆల్‌టైమ్ హై.. 77,800కు చేరిన ధర
- అమెరికాలో ఉద్యోగ సంక్షోభం.. రోడ్లపై విద్యార్థులు
- ఒకే ఇన్నింగ్స్‌లో 498 పరుగులు చేసిన క్రికెటర్
- 15 గంటలు ప్రశ్నిస్తే వీరత్వమా? ఈడీకి కోర్ట్ చురక
- వరుస అల్పపీడనాలతో అసాధారణ వాతావరణం

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA



కమలా హారిస్ ప్రచార ఆఫీస్‌పై కాల్పులు › 7

గురువారం THURSDAY 26.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 112 ‖ వెల (Price) రూ.6.50 | నవమి

గురువారం, సూర్యోదయం: 6-05, సూర్యాస్తమయం: 6-09. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: నవమి పగలు 12-26 వరకు. నక్షత్రం: పునర్వసు రాత్రి 11-33 వరకు. వర్జ్యం: ఉదయం 10-59 నుంచి పగలు 12-40 వరకు. రాహు కాలం: పగలు 1-37 నుంచి పగలు 3-07 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-06 నుంచి పగలు 10-55 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 2-55 నుంచి పగలు 3-43 వరకు. అమృతకాలం: రాత్రి 9-02 నుంచి రాత్రి 10-43 వరకు. హస్త కార్తె రాత్రి 1-10 గంటలకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

లంచానికి దసరా డిస్కౌంట్

- రైస్ మిల్లర్లకు ధాన్యం బిడ్డర్ల ఆఫర్
- మొన్నటివరకు ప్రతి క్వింటాలుపై రూ.230 అదనంగా వసూలు
- అందులో ఇప్పుడు రూ.30 తగ్గింపు
- ధాన్యం ఇస్తామన్నా వద్దంటున్న బిడ్డర్లు
- తమకు డబ్బులే ఇవ్వాలని డిమాండ్
- మొత్తం డబ్బులు 15 రోజుల్లో వసూలు చేయాలని టార్గెట్ › 5

దసరాకు ఇందిరమ్మ కమిటీలు

- రెండ్రోజుల్లో విధివిధానాలు
- త్వరలో స్వగృహ ఇండ్ల వేలం
- రేవంత్‌రెడ్డి వెల్లడి › 6

సిద్ధరామయ్యపై విచారణ జరపండి

- ముడా కేసులో సీఎంపై కేసు నమోదు చేయండి › 7
- లోకాయుక్త పోలీసులకు ప్రత్యేక కోర్టు ఆదేశం



మైనింగ్ కోరల్లో మహా శిల్ప శిఖరం

చారిత్రక రామప్ప ఆలయానికి ఓపెన్ కాస్ట్ ముప్పు

- ములుగు జిల్లా వెంకటాపూర్ వద్ద ఓపెన్ గని
- బొగ్గు తవ్వకాలకు కాంగ్రెస్ సర్కార్ అనుమతి!
- పేలుళ్లతో కదలనున్న ఆలయ పునాదులు
- 5 కిలోమీటర్ల వరకు తవ్వకాలు వద్దన్న సుప్రీం
- క్వారీ నుంచి 4.5 కి.మీ దూరంలోనే ఆలయం
- విధ్వంసక గనికి మహనీయుడు పీవీ పేరు!
- 2012లో అడ్డుకున్న నమస్తే తెలంగాణ, పర్యావరణ ప్రేమికులు, పురావస్తు నిపుణులు › 2
- కాంగ్రెస్ సర్కారు మళ్లీ రాగానే కదిలిన ఫైలు

భారతీయ శిల్పకళకు శిఖరాయమాన ప్రతీక రామప్ప. చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ సంపదకు ఉత్కృష్ట ఉదాహరణ రామప్ప. 'వరల్డ్ హెరిటేజ్' కిరీటాన్ని ధరించిన 800 ఏండ్ల ఆలయం.. ఇప్పుడు మైనింగ్ కోరల్లో చిక్కుకున్నది. గతంలో పలుమార్లు ప్రయత్నించి భంగపడిన కాంగ్రెస్ సర్కార్.. మళ్లీ ఇప్పుడు విధ్వంసక ఓపెన్‌కాస్ట్ గనికి అనుమతులిచ్చింది. 4.5 కిలోమీటర్ల దూరంలోనే జరిపే గని పేలుళ్లతో ఆలయం ప్రమాదంలో పడనున్నది.

మూసీలో భారీ స్కామ్

- సుందరీకరణ పేరిట వేల కోట్ల కుంభకోణం
- పాకిస్థానీ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం
- అన్ని వివరాలు త్వరలో బయటపెడతాం
- మంత్రుల తలో మాట వెనుక మర్మమేమిటి?
- మూసీ శుద్ధికి కొత్తగా చేయాల్సిందేమీ లేదు
- జీహెచ్‌ఎంసీలో 31 ఎస్టీపీలు నిర్మించాం
- సీఎం చేయాల్సిందల్లా గ్యారెంటీల అమలే
- కూకట్‌పల్లిలో మురుగునీటి శుద్ధి కేంద్రం, ఖాజాకుంట ఎస్టీపీని పరిశీలించిన కేటీఆర్
- 11.86 ఎకరాల్లో 171.57 కోట్ల నిధులతో బీఆర్‌ఎస్ హయాంలోనే నిర్మాణం



"మూసీ ప్రాజెక్టుపై సీఎం, మంత్రుల మాటలకు పొంతన లేదు. మూసీ సుందరీకరణ కోసం 1.50 లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నట్టు ఒకసారి, రూ.50 వేల కోట్లు అని మరోసారి, రూ.75 వేల కోట్లు అని ఇంకోసారి ఇలా రకరకాలుగా పొంతనలేని ప్రకటనలు చేయడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? త్వరలోనే అన్ని వివరాలు బయటపెడతాం. - కేటీఆర్ › 3

పదిచోట్లా ఉప ఎన్నికలే

- ఫిరాయింపుదారులకు ప్రజలే బుద్ధి చెప్తారు
- సర్కార్ నడుపుడంటే డైలాగ్‌లు చెప్పుడు కాదు
- సీఎం రేవంత్‌రెడ్డికి రక్షణ కవచంలా బీజేపీ
- చిట్టినాయుడు, బ్రదర్స్ రాష్ట్రాన్ని దోచేస్తున్నారు
- రేవంత్ .. మీ అన్నకు వేయి కోట్లు ఎక్కడివి?
- కాంగ్రెస్ హామీల అమలుపై కమిటీలతో ఒత్తిడి
- దాస్యం వినయ్ భాస్కర్ మంత్రి అయితడు
- హనుమకొండ కార్యకర్తల భేటీలో కేటీఆర్ › 3

మంత్రుల అరాచకాలను ఎండగడతాం

- విచ్చలవిడిగా కాంగ్రెస్ నేతల అవినీతి
- నల్లగొండ బీఆర్‌ఎస్ సమావేశంలో కేటీఆర్
- స్థానిక అంశాలపై పోరాడుతామని వెల్లడి
- జగదీశ్‌రెడ్డి నివాసంలో కొనసాగిన భేటీ
- పార్టీ బలోపేతంపై నేతలకు దిశానిర్దేశం › 3

రుణమాఫీ అడిగిన రైతులపై సీఐ రుబాబు

- రుణమాఫీ కోసం నిరసన చేస్తరా?
- కేసు పెడితే లక్ష ఖర్చయ్యే దాకా తిరుగుతరు.. మీకు మాఫీ కావాల్నా? › 5
- కోదాడ రూరల్ సీఐ బెదిరింపులు

మంత్రులకు నిరసన సెగ

- అడ్డుకున్న ఉద్దండాపూర్ నిర్వాసితులు
- కలవకుండానే వెనుదిరిగిన మంత్రులు
- మునిగిన వట్టెం పంప్‌హౌస్‌ చూడలె
- హెలికాప్టర్ టైమ్ అయిపోతున్నదంటూ వెళ్లిపోయిన ఉత్తమ్, జూపల్లి › 6

చెదిరిపోతున్న డాలర్ డ్రీమ్స్!

- అమెరికాలో కొలువుల కోతలు.. రోడ్లపై విద్యార్థులు
- రెండున్నర దశాబ్దాల్లో ఎన్నడూ చూడని సంక్షోభం
- ఏడాది వ్యవధిలో 98% పెరిగిన ఉద్యోగుల ఊస్టింగ్
- జాబ్స్ దొరక్కపోవడంతో భారత విద్యార్థుల అవస్థలు
- హోటల్స్, పెట్రోల్ బంకుల్లో తక్కువ జీతానికి విధులు

తెలంగాణకు చెందిన వెంకట్ ఆరేండ్ల కిందట ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. హెచ్1బీ వీసా రావడం, అమెరికాలో ఎమ్మెస్ పూర్తి చేయడంతో ఓ పెద్ద టెక్ కంపెనీలో అతనికి మంచి ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. అయితే, వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా ఆ కంపెనీ అతన్ని ఏడాదిన్నర పూర్తి కాకుండానే తొలగించింది. ఎక్కడా ఉద్యోగం దొరక్కపోవడంతో న్యూజెర్సీలోని ఓ రెస్టారెంట్‌లో అతడు ఏడాది పాటు వెయిటర్‌గా పని చేయాల్సి వచ్చింది.

వరంగల్‌కు చెందిన అజయ్ హైదరాబాద్‌లోని ఓ దిగ్గజ కంపెనీలో ఐదేండ్లు పనిచేసి అమెరికా వెళ్లాడు. అక్కడే ఎమ్మెస్ పూర్తి చేశాడు. పని అనుభవం, ఉన్నత చదువు ఉన్నప్పటికీ ఇంకా అతనికి ఉద్యోగం రాలేదు. ఎన్ని కంపెనీలకు దరఖాస్తు చేసినా ఇంటర్వ్యూ పిలుపు రానే రావట్లేదు. హైదరాబాద్‌లో రూ.40 లక్షల ప్యాకేజీని కాదనుకొని అమెరికాకు వెళ్లిన మరో విద్యార్థికి ఇప్పటికీ అక్కడ ఉద్యోగం దొరకలేదు. దీంతో పెట్రోల్ బంకులో పని చేయాల్సి వచ్చింది.

భారతీయ విద్యార్థుల డాలర్ డ్రీమ్స్ కనుమరుగవుతున్నాయి. అమెరికా వెళ్లాలి.. చేతి నిండా డాలర్లు సంపాదించాలి. ఉన్నత స్థానానికి చేరుకోవాలి అనుకునే సగటు భారతీయుడి ఆశలపై అక్కడి తాజా పరిస్థితులు నీళ్లు చల్లుతున్నాయి.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): గడిచిన రెండున్నర దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా అమెరికా జాబ్ మార్కెట్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఉపాధి కోసం అమెరికా వెళ్దామనుకునేవారి సంగతి అటుంచితే.. ఎప్పుడు తమ ఉద్యోగాలు ఊడుతాయో అని అమెరికాలోని భారతీయ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఉద్యోగ భయం వారిని వెంటాడుతున్నది. దీంతో అక్కడే ఉండాలా.. స్వదేశానికి తిరిగి రావాలా అని అలోచనలో పడ్డారు.



భారీగా ఉద్యోగాల కోత..

పెరుగుతున్న ద్రవ్యోల్బణం, మాంద్యం భయాలు, కంపెనీలకు వస్తున్న ప్రాజెక్టుల్లో క్షీణత, రానున్న అధ్యక్ష ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ వెరసి అమెరికాలోని పలు కంపెనీలు తమ ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నాయి. ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకొన్నట్టు చెప్తున్నాయి. అమెజాన్, మెటా, సేల్స్‌ఫోర్స్, ఎక్స్, ఉబర్ వంటి దిగ్గజ సంస్థలు సైతం ఉద్యోగాలకు కోత పెడుతున్నాయి. ఇలా జాబ్‌లు కోల్పోయిన వారిలో చాలామంది కొత్త ఉద్యోగాలు వెతుక్కోవడం కష్టంగా మారింది. లేఆఫ్‌లు మరింతగా పెరుగుతుండటంతో హెచ్1బీలకు సైతం ఉద్యోగాలు దొరక్కపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొవిడ్ అనంతర కాలంలో కూడా పారిశ్రామిక రంగం పెద్దగా పుంజుకోలేదు. దీనికితోడు అమెరికా ప్రభుత్వం ప్యాకేజీలను ఆపేసింది. లాక్‌డౌన్ సమయంలో వివిధ సంస్థలు, వ్యక్తులకు ఇచ్చిన రుణాలు తిరిగి వసూలు కాకపోవడంతో బ్యాంకులు నష్టాల బాటలో పయనిస్తున్నాయి. ఫలితంగా కొత్త రుణాలివ్వడం నిలిపేశాయి. దీని ప్రభావం పారిశ్రామిక రంగంపై పడింది. వెరసి ఇది అగ్రరాజ్యంలో ఉద్యోగాల కోతకు దారి తీస్తున్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగానూ..

ఒక్క అమెరికాలోనే కాదు జర్మనీ, స్వీడన్, యూకే, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లోనూ ఉద్యోగ సంక్షోభం ఉన్నదని లేఆఫ్-ఫై వెబ్‌సైట్ సహా మరో రెండు సంస్థల నివేదికలు వెల్లడించాయి. ప్రపంచంలోని ప్రతి పది ఉద్యోగ కోతల్లో మూడు ఉద్యోగాల ఊస్టింగ్ ఈ దేశాల్లోనే జరుగుతున్నట్టు వివరించాయి.

14 ఏండ్ల పని అనుభవమూ పనిచేయట్లే

అమెరికాలో 30 ఏండ్లుగా ఉంటున్నా. గడిచిన 28 ఏండ్లలో ఇలాంటి ఉద్యోగ సంక్షోభం ఎన్నడూ చూడలేదు. 14 ఏండ్ల పని అనుభవం ఉన్నవారికి కూడా ఇప్పుడు ఉద్యోగం దొరకట్లే. ఈ పరిస్థితి ఐటీలో మరింత ఎక్కువగా ఉన్నది.

– ఐతరాజు శ్రీకాంత్, అమెరికాలో ఓ కన్సల్టెన్సీ నిర్వాహకుడు.

'అమ్మో'రికానే

లే ఆఫ్-ఫై వెబ్‌సైట్ ప్రకారం నిరుడు ప్రపంచవ్యాప్తంగా టెక్ ఉద్యోగులు కోల్పోయిన మొత్తం ఉద్యోగాల్లో 70 శాతం వాటా అమెరికాదేనని తేలింది. ఎడ్‌టెక్, ఫుడ్, ఆర్థికం, రిటైల్, కన్స్యూమర్, ఆరోగ్య రక్షణ రంగాలకు చెందిన 7,21,677 మంది ఉద్యోగాలకు దూరమైనట్టు గణాంకాలు చెప్తున్నాయి. అమెరికాలో ఏడాది వ్యవధిలో ఉద్యోగాల తొలగింపులు 98 శాతం పెరిగాయని ఛాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్ సంస్థ తాజా నివేదికలో వెల్లడించింది. అమెజాన్, మెటా వంటి టెక్ కంపెనీలే గత ఏడాది 1.68 లక్షల మందికి ఉద్వాసన పలికాయని పేర్కొన్నది. ఈ ఏడాది పరిస్థితులు మరింత అధ్వాన్నంగా ఉండనున్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు.

చేసేదేమీ లేక..

అమెరికాలో ఉద్యోగాన్ని కోల్పోతే 60 రోజుల్లోగా కొత్త ఉద్యోగాన్ని వెతుక్కోవాల్సి ఉంటుంది. లేదంటే దేశాన్ని వీడక తప్పదు. ఇక, అగ్రరాజ్యంలో ఎమ్మెస్ పూర్తి చేసిన వెంటనే సంబంధిత యూనివర్సిటీ విద్యార్థి పేరిట ఓపీటీ ఐ20 (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్)ని విడుదల చేస్తుంది. దీని ద్వారా మూడు నెలల్లో ఏదో ఒక ఉద్యోగం చేయాలి. లేదంటే ఆ దేశాన్ని విడిచిపెట్టాలి. దీంతో దేశాన్ని వీడాల్సి వస్తుందన్న భయంతో కన్సల్టెన్సీల సాయంతో ఏదో ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరినట్టు ధ్రువీకరణ పత్రాలు తీసుకొంటున్నారు. పొట్టకూటి కోసం తక్కువ జీతానికి రెస్టారెంట్లు, పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్నారు. ఉన్నత చదువుల కోసం తీసుకొన్న ఎడ్యుకేషన్ లోన్ ఎలా తీర్చాలని మరికొందరు భయపడుతున్నారు. తన తండ్రి సుమారు 40 లక్షలు అప్పు చేసి తనను అమెరికా పంపాడని, ఇప్పుడు చదువు పూర్తయినా ఉద్యోగం దొరక్క పార్ట్‌టైం జాబ్ చేస్తున్నానని, ఉద్యోగం దొరికే ఆశ కనుచూపు మేర కన్పించడం లేదని, ఏం చేయాలో అర్థం కావడం లేదని తెలంగాణ నుంచి యూఎస్ వెళ్లిన ఒక విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు.

సిద్ధరామయ్యపై విచారణ జరపండి

- ముడా కేసులో సీఎంపై కేసు నమోదు చేయండి
- లోకాయుక్త పోలీసులకు ప్రత్యేక కోర్టు ఆదేశం



బెంగళూరు, సెప్టెంబర్ 25: ముడా భూముల కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై విచారణ జరపాలని లోకాయుక్త పోలీసులను ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ ఫిర్యాదు మేరకు సిద్ధరామయ్యపై విచారణ ప్రారంభించాలని పేర్కొన్నది. ఆయనపై సీఆర్పీసీ సెక్షన్ 156(3) కింద కేసు నమోదు చేయాలని ఆదేశించింది. డిసెంబర్ 24 లోగా విచారణ నివేదికను కోర్టుకు అందజేయాలని పోలీసులకు సూచించింది. కాగా, ముడా కుంభకోణంలో సిద్ధరామయ్యపై విచారణకు ఆగస్టు 16న గవర్నర్ అనుమతించిన సంగతి తెలిసిందే. ఈ అనుమతిని సవాల్ చేస్తూ సిద్ధరామయ్య హైకోర్టును ఆశ్రయించగా.. ఆయన పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు కొట్టేసింది. సిద్ధరామయ్యపై విచారణ జరపొచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి ముడా కేటాయించిన 14 స్థలాల్లో అవకతవకల ఆరోపణలపై లోకాయుక్త పోలీసులు విచారణ ప్రారంభించనున్నారు.

దేనికి భయపడ: సిద్ధరామయ్య

తనపై విచారణ జరపాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. తాను పోరాడతానని, దేనికీ భయపడనని పేర్కొన్నారు. విచారణను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, న్యాయపరంగానే తాను పోరాడతానని స్పష్టం చేశారు. కాగా, సిద్ధరామయ్యపై ఫిర్యాదు చేసిన స్నేహమయి కృష్ణ మాత్రం లోకాయుక్త పోలీసుల విచారణ పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కేసును సీబీఐ ద్వారానే విచారణ జరిపించాలని, ఇందుకోసం తాము హైకోర్టునుఆశ్రయిస్తామని ఆయన పేర్కొన్నారు. కాగా, సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ, జేడీఎస్ డిమాండ్ చేశాయి. గురువారం విధానసౌధ ముం దు ఆందోళన చేపట్టాలని నిర్ణయించాయి.

ఆలయాల నిర్వహణ గురువులకు అప్పగించాలి

- తిరుపతి లడ్డూ కల్తీ బాధ్యులను కఠినంగా శిక్షించాలి
- 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకులు శ్రీ శ్రీ రవిశంకర్



హైదరాబాద్: హిందూ దేవాలయాల నిర్వహణ బాధ్యతలను హిందూ ఆధ్యాత్మిక గురువులు, భక్తులకు అప్పగించాలని 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ అన్నారు. టీటీడీ లడ్డూ మహా ప్రసాదంలో కల్తీ జరిగినట్లు వార్తలు రావడంతో ప్రపంచవ్యాప్తంగా హిందువులు గుండె పగిలి తల్లడిల్లుతున్నారని ఆయన అన్నారు. ఈ సంఘటన 1857నాటి సిపాయిల తిరుగుబాటు జ్ఞాపకాలను తిరగదోడిందన్నారు. ప్రసాదం కల్తీకి బాధ్యులైనవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, దేవాలయాల నిర్వహణ బాధ్యతలను హిందూ సాధువులు, ఆధ్యాత్మిక గురువులు, భక్తులకు అప్పగించాలని కోరారు. హిందూ దేవాలయాల నిర్వహణను పర్యవేక్షించడానికి, వాటి పవిత్రతను కాపాడటానికి ఉత్తర, దక్షిణ భారతావనికి చెందిన ఆధ్యాత్మిక వేత్తలు, గురువులతో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని, వివాదాలు తలెత్తినపుడు జోక్యం చేసుకునేందుకు ప్రభుత్వ ప్రతినిధి ఒకరు ఈ కమిటీలో ఉండవచ్చునని చెప్పారు. అయితే ప్రధాన నిర్ణయాలన్నింటినీ మతపరమైన బోర్డులు మాత్రమే తీసుకోవాలని తెలిపారు.

త్వరలో తగ్గనున్న పెట్రో ధరలు!

న్యూఢిల్లీ: పెట్రోలు, డీజిల్ ధరలు త్వరలో తగ్గవచ్చు! ఎన్డీయే కూటమికి అత్యంత కీలకమైన మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూలు వచ్చే నెలలోనే ప్రకటించే అవకాశం కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో సీఎల్ఎస్ఏ అంచనా ప్రకారం, వచ్చే నెల 5 తర్వాత పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించే అవకాశం ఉంది. పెట్రోలియం, సహజ వాయువు శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ గత నెలలో ఈ మేరకు సంకేతాలు ఇచ్చారు. అంతర్జాతీయ క్రూడాయిల్ ధరలు నిలకడగా కొనసాగితే ధరలను తగ్గించే అంశాన్ని ఆయిల్ కంపెనీలు పరిశీలించవచ్చునని ఆయన చెప్పారు.

బెంగళూరు హత్య కేసులో అనుమానితుడి ఆత్మహత్య!

వివాహేతర సంబంధంపై అభ్యంతరం తెలిపింది ఇతనే

బెంగళూరు: అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసిన మహాలక్ష్మి (29) హత్య కేసులో ప్రధాన అనుమానితుడు ముక్తి రంజన్ రాయ్ ఒడిశాలో మరణించాడు. విశ్వసనీయ వర్గాల వివరాల ప్రకారం.. బుధవారం భద్రక్ జిల్లాలో ఓ చెట్టుకు అతడు వేలాడుతూ కనిపించాడు. ఆయన ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని భావిస్తున్నారు. మహాలక్ష్మి ముఖ్య స్నేహితుల్లో ముక్తి ఒకడు. మహాలక్ష్మి వేరొక వ్యక్తితో సన్నిహితంగా ఉండటం పట్ల ముక్తి అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఇటీవల మహాలక్ష్మిని విడిచిపెట్టిన ఆమె భర్త హేమంత్ దాస్‌ను ఉటంకిస్తూ వెలువడిన కథనాల ప్రకారం, ఉత్తరాఖండ్‌కు చెందిన అష్రఫ్ కొంతకాలం క్రితం మహాలక్ష్మితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమె హత్యలో అష్రఫ్‌కు ప్రమేయం ఉందని దాస్ ఆరోపించారు. ముక్తి కోసం ఒడిశా-పశ్చిమ బెంగాల్ సరిహద్దులకు బెంగళూరు పోలీసు బృందాలు వెళ్లాయి. అయితే ముక్తి మరణించినట్లు ఒడిశా పోలీసులు వెల్లడించారు.

జమ్ము కశ్మీర్‌లో 56.05% ఓటింగ్

శ్రీనగర్: జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. గందేర్‌బల్, శ్రీనగర్, బుద్గాం జిల్లాలతో పాటు జమ్ము ప్రాంతంలోని రియాసి, రాజౌరి, పూంచ్ జిల్లాల పరిధిలోని 26 అసెంబ్లీ స్థానాలకు ఓటింగ్ జరగగా, సాయంత్రం 6 గంటల సమయానికి 56.05 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా రియాసి జిల్లాలో 71.81 శాతం ఓటింగ్ నమోదు కాగా, అత్యల్పంగా శ్రీనగర్ జిల్లాలో 27.31 శాతం మాత్రమే జరిగింది.

మిగతా రెండు తూటాలు ఏమయ్యాయి?

బద్లాపూర్ ఎన్‌కౌంటర్‌పై బాంబే హైకోర్టు ప్రశ్న

ముంబై: పోలీసుల చేతిలో ఎన్‌కౌంటర్ అయిన బద్లాపూర్ లైంగిక దాడి నిందితుడు అక్షయ్ షిండే (24) మరణానికి దారి తీసిన పరిస్థితులపై బాంబే హైకోర్టు పలు ప్రశ్నలను సంధించింది. నిందితుడు పోలీసుల నుంచి తుపాకీ లాక్కుని మూడు రౌండ్లు కాల్పులు జరిపాడని పోలీసులు ఆరోపించారని, ఒక బుల్లెట్టే పోలీస్‌కు తగిలిందని, మిగిలిన రెండు తుపాకీ గుళ్లు ఏమయ్యాయని జస్టిస్‌లు రేవతి మెహితే దేరే, పృథ్వీరాజ్ చౌహాన్‌లతో కూడిన ధర్మాసనం ప్రాసిక్యూషన్‌ను ప్రశ్నించింది. పరిస్థితిని చక్కదిద్దడంతో పోలీస్ శాఖ విఫలమైందని, నిందితుడిని మోకాలి కింద కాల్చి ఉండాల్సిందని పేర్కొంది.

360 డిగ్రీల రక్షణతో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: సాయుధ బలగాలకు 360 డిగ్రీల రక్షణ కల్పించే తేలికపాటి బులెట్ ప్రూఫ్ జాకెట్లను డీఆర్‌డీఓ, ఐఐటీ ఢిల్లీ కలిసి అభివృద్ధి చేశాయి. అడ్వాన్స్‌డ్ బాలిస్టిక్స్ ఫర్ హై ఎనర్జీ డిఫీట్(ఏబీహెచ్ఈడీ) పేరుతో డీఆర్‌డీఓకు చెందిన ఇండస్ట్రీ అకాడమియా సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్, ఐఐడీ ఢిల్లీ ఈ జాకెట్లను తయారు చేశాయి. పాలిమర్లు, స్వదేశీ బోరన్ కార్బైడ్ సెరామిక్‌ను వీటికి ఉపయోగించారు. ఈ జాకెట్ బరువు 8.2 కిలోల నుంచి 9.5 కిలోల వరకు ఉంటుందని డీఆర్‌డీఓ తెలిపింది. వీటిని ధరించిన వారికి అన్ని వైపుల నుంచి రక్షణ ఉంటుందని పేర్కొన్నది.

15 గంటలు ప్రశ్నించడం వీరత్వం కాదు

న్యాయమైన విచారణ విధానాన్ని పాటించాలి

ఈడీకి పంజాబ్-హర్యానా హైకోర్టు చురక

చండీగఢ్: ఒక కేసులో అనుమానితుడిని ఏకబిగిన 15 గంటల పాటు ప్రశ్నించడం వీరత్వం కాదని ఈడీపై పంజాబ్, హర్యానా హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇది మనిషి గౌరవానికి తీవ్ర వ్యతిరేకమని పేర్కొంది. నిందితులను అన్ని గంటల పాటు వేధించడం కన్నా వారిని ప్రశ్నించేందుకు సహేతుకమైన సమయాన్ని నిర్దేశించుకోవాలని, న్యాయమైన విచారణ విధానాన్ని అవలంబించాలని ఈడీ అధికారులకు సూచించింది. ఈ సందర్భంగా త్వరలో హర్యానా ఎన్నికలు జరగనున్న క్రమంలో ఈడీ అరెస్ట్ చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేందర్ పవార్‌ను విడిచిపెట్టాలని ఆదేశించింది. పన్వర్ అక్రమ మైనింగ్ కేసులో ఆయనను జూలై 19న ఈడీ ఏకబిగిన 14 గంటల 40 నిమిషాల పాటు ప్రశ్నించింది.

కమలా హారిస్ ప్రచార ఆఫీస్‌పై కాల్పులు

అరిజోనా: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులపై కాల్పుల ఘటనలు కలకలం సృష్టిస్తున్నాయి. తాజాగా అరిజోనాలో అమెరికా ఉపాధ్యక్షురాలు, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ ప్రచార కార్యాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ఈ ఘటనపై ఆ కార్యాలయంలోని సిబ్బంది అందించిన సమాచారం మేరకు పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. దుండగులు కమలా హారిస్ ప్రచార కార్యాలయం కిటికీల వద్ద నుంచి కాల్పులు జరిపినట్టు తెలుస్తున్నదని, దీంతో ఆ కార్యాలయంలోని కిటికీలు, ఫర్నిచర్ ధ్వంసమయ్యాయని వివరించారు. కాల్పులు జరిగినప్పుడు కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని తెలిపారు. కానీ, ఈ ఘటన వల్ల ఆ కార్యాలయ సిబ్బందితోపాటు ఆ చుట్టుపక్కల నివసిస్తున్నవారి భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ర్యాన్ కుక్ చెప్పారు.

దాడులు ఉగ్ర రూపం

- మొస్సాద్ ఆఫీసుపై హెజ్బొల్లా దాడి
- ఇజ్రాయెల్ దాడిలో 51 మంది మృతి
- హెజ్బొల్లాను తరిమి కొడతాం: ఐడీఎఫ్



బీరుట్: ఇజ్రాయెల్-హెజ్బొల్లా పరస్పర దాడులు బుధవారం మరింత ఉద్ధృతంగా మారాయి. హెజ్బొల్లా ఉగ్రవాదులు డజన్ల కొద్దీ రాకెట్లను ఇజ్రాయెల్ పైకి ప్రయోగించారు. టెల్ అవీవ్ సమీపంలోని ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ ప్రధాన కార్యాలయం పైకి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించామని హెజ్బొల్లా ప్రకటించింది. దీనిని అడ్డుకున్నట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. హెజ్బొల్లా ప్రయోగించిన వందలాది ప్రొజెక్టైల్స్ వల్ల ఇజ్రాయెల్‌లోని అనేక భవనాలు, ఇండ్లు ధ్వంసమైనట్లు, అనేక మంది ప్రజలు గాయపడినట్లు తెలుస్తున్నది. ఇజ్రాయెల్ బుధవారం జరిపిన దాడుల్లో 51 మంది మరణించారని, 223 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రి తెలిపారు. తాత్కాలిక శిబిరాల్లో 27 వేల మందికి ఆశ్రయం కల్పించినట్లు లెబనాన్ అధికారులు చెప్పారు.

హెజ్బొల్లా టాప్ కమాండర్ ఇబ్రహీం మృతి

హెజ్బొల్లా రాకెట్-మిస్సైల్ విభాగాధిపతి కమాండర్ ఇబ్రహీం ఖబాయిసి ఇజ్రాయెల్ వైమానిక దాడిలో మరణించాడు. ఇబ్రహీంతోపాటు ఇద్దరు హెజ్బొల్లా హై ర్యాంక్ కమాండర్లు మరణించారని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది.

నిర్వాసితులు 90 వేల మందికిపైనే

లెబనాన్‌పై ఇజ్రాయెల్ ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న దాడుల వల్ల 90 వేల మందికి పైగా ప్రజలు నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి తెలిపింది. ఏడాదిలో సుమారు 2 లక్షల మంది నిర్వాసితులయ్యారని చెప్పింది.

ఇజ్రాయెల్ రిజర్వు దళాలు సమాయత్తం

హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థతో ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో రిజర్వు దళాలను సమాయత్తం చేస్తున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. దీంతో లెబనాన్‌పై మరింత భీకరంగా ఇజ్రాయెల్ దాడి చేయబోతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి.


వీటి ఖర్చులు భరించలేం..

చైనాకు పాండాలను తిరిగి ఇచ్చేస్తామన్న ఫిన్లాండ్

న్యూఢిల్లీ: చైనా నుంచి తీసుకొచ్చిన రెండు పాండాల నిర్వహణ ఖర్చు ఫిన్లాండ్‌కు తలనొప్పిగా మారింది. 2018లో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఫిన్లాండ్ పర్యటన సందర్భంగా రెండు పాండాలను ఇక్కడి ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన 'జూ'కు అప్పగించారు. 15 ఏండ్ల పాటు పాండాలను ఈ జూలో ఉంచేందుకు చైనాతో ఫిన్లాండ్ ఒప్పందం చేసుకుంది. జూలో వాటి సంరక్షణ కోసం రూ.74 కోట్లు వెచ్చించింది. అయితే కోవిడ్ సంక్షోభం తర్వాత పర్యాటకుల తాకిడి తగ్గటంతో, జూపై ఆర్థిక భారం పెరిగింది. దీంతో పాండాల నిర్వహణ ఖర్చులు భరించలేమంటూ కంపెనీ చేతులెత్తేసింది. చైనాకు ఆ రెండు పాండాలను తిరిగి ఇచ్చేందుకు సిద్ధమైంది. మరికొద్ది రోజుల్లో పాండాలు చైనాకు చేరుకోనున్నాయి.

భూ భ్రమణంపై 'త్రీ గోర్జెస్' ప్రభావం

2 సెం.మీ పక్కకు ధ్రువాల స్థానం



బీజింగ్: చైనాలోని యాంగ్జీ నదిపై నిర్మించిన త్రీ గోర్జెస్ డ్యామ్ ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు. ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్. అయితే ఈ భారీ డ్యామ్ కారణంగా భూ పరిభ్రమణ వేగం 0.06 మైక్రో సెకండ్లు తగ్గిందని నాసా సైంటిస్టులు గుర్తించారు. అంతేకాదు ఈ భారీ డ్యామ్ వల్ల భూమి ధ్రువాల స్థానం కూడా రెండు సెంటీమీటర్ల మేర పక్కకు జరిగిందని సైంటిస్టులు చెబుతున్నారు. 'ఐఎఫ్ఎల్ సైన్స్' తాజా కథనం ప్రకారం, గుండ్రంగా తిరిగే వస్తువు ఏదైనా దానిలోని కణాలన్నీ సమానంగా పరుచుకుంటాయి. ఒక్కచోట ఏదైనా భారీ బరువు చేరితే..'ఇనెర్షియా'వల్ల సదరు వస్తువు తిరిగే వేగం తగ్గుతుంది. దీనినే 'మూమెంట్ ఆఫ్ ఇనెర్షియా' అంటారు. త్రీగోర్జెస్ డ్యామ్‌తో భూమిపై ఇలాంటి ప్రభావమే పడి భ్రమణ వేగం తగ్గినట్టు సైంటిస్టులు చెబుతున్నారు. ఈ డ్యామ్‌లో నీటి నిల్వ కారణంగా 'మూమెంట్ ఆఫ్ ఇనెర్షియా' ప్రభావం ఏర్పడుతుందని వెల్లడించారు.



ఎంబీఏలో హైదరాబాద్ ఐఎస్‌బీ సత్తా

- టాప్ 100 ప్రపంచ సంస్థల్లో స్థానం

మన దేశపు 3 ఐఐఎంలకూ చోటు

హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) అరుదైన ఘనతను సాధించింది. ప్రపంచంలో ఎంబీఏ కోర్సులు అందించే అత్యుత్తమ 100 సంస్థల్లో ఐఎస్‌బీకి స్థానం లభించింది. బుధవారం ప్రకటించిన క్యూఎస్ ర్యాంకింగ్స్ ప్రకారం దీనితో పాటు ఐఐఎం-బెంగళూరు, ఐఐఎం-అహ్మదాబాద్, ఐఐఎం-కలకత్తా కూడా టాప్ 100లో నిలిచాయి. ఈ మూడు ఐఐఎంలు ఉపాధి కల్పన విషయంలో టాప్ 50లో నిలిచాయి. అమెరికాకు చెందిన స్టాన్‌ఫోర్డ్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వరుసగా ఐదో ఏడాది అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. క్యూఎస్ గ్లోబల్ ఎంబీఏ, బిజినెస్ మాస్టర్స్ ర్యాంకింగ్ 2025 కింద 58 దేశాలకు చెందిన విద్యాసంస్థలు టాప్ 100లో నిలిచాయి. మనదేశం నుంచి ఈ నాలుగు సంస్థలను ఎంపిక చేశారు. ఈ ర్యాకింగ్స్‌లో 2025కు భారత్‌లోని 14 ఫుల్‌టైమ్ ఎంబీఏ ప్రోగ్రామ్‌లను పరిగణనలోకి తీసుకున్నట్టు క్యూఎస్ సీఈవో జెస్సికా తెలిపారు.

జడ్జి మనసు, ఆత్మ నిష్పాక్షికంగా ఉండాలి

దేశంలో ఏ భాగాన్నీ 'పాకిస్థాన్' అని అనకూడదు

కర్ణాటక జడ్జి వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు మందలింపు



న్యూఢిల్లీ: న్యాయాన్ని నిర్ణయించి చెప్పేవారి హృదయం, ఆత్మ నిష్పాక్షికంగా, న్యాయంగా ఉండాలని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీషానంద ఇటీవల చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై సీజేఐ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం స్వీయ విచారణ జరిపింది. జస్టిస్ శ్రీషానంద ఇటీవల ఓ మహిళా న్యాయవాదిని మందలించినట్లు, బెంగళూరులోని ముస్లిం మెజారిటీ ప్రాంతాన్ని పాకిస్థాన్ అని అభివర్ణించినట్లు వచ్చిన ఫిర్యాదుపై సుప్రీంకోర్టు స్పందించి, నివేదిక సమర్పించాలని కర్ణాటక హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది. ఈ నివేదికపై బుధవారం ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపి, కేసును ముగించింది. ఈ సందర్భంగా సీజేఐ చంద్రచూడ్ మాట్లాడుతూ, రాజ్యాంగంలో పేర్కొన్న విలువలు మాత్రమే న్యాయ నిర్ణయానికి మార్గదర్శకం కావాలన్న విషయం ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి న్యాయమూర్తి తన సొంత వైఖరుల గురించి పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. న్యాయాన్ని నిర్ణయించి చెప్పేవారి హృదయం, ఆత్మ నిష్పాక్షికంగా, న్యాయంగా ఉండటం అవసరమని తెలిపారు. స్త్రీ ద్వేషంగా పరిగణించడానికి అవకాశం ఇచ్చే వ్యాఖ్యలు చేయరాదని కోర్టులను ఈ ధర్మాసనం హెచ్చరించింది. స్త్రీ లేదా పురుషుడు లేదా మరొక వర్గాన్ని ఉద్దేశించి ఎటువంటి వ్యాఖ్యలు చేయవద్దని చెప్పింది. భారత్‌లోని ఏ ప్రాంతానైనా 'పాకిస్థాన్' అని పిలవకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ శ్రీషానంద ఈ నెల 21న బహిరంగంగా క్షమాపణ చెప్పినందు వల్ల ఈ కేసు విచారణను ముగిస్తున్నట్లు చెప్పింది.

'యోగ నిద్ర' పని చేస్తున్నది

న్యూఢిల్లీ: యోగ నిద్ర చేస్తే మెదడులో అనేక సానుకూల మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఇందులో ఎంత అనుభవం ఉంటే అంత మెరుగైన ఫలితాలు పొందొచ్చని ఓ అధ్యయనంలో తేలింది. ఐఐటీ ఢిల్లీ, ఎయిమ్స్ ఢిల్లీ, మహాజన్ ఇమేజింగ్‌కు చెందిన పరిశోధకులు కలిసి యోగ నిద్రపై అధ్యయనం జరిపారు. ఈ వివరాలు సైంటిఫిక్ రిపోర్ట్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. యోగ నిద్ర చేస్తున్న వారి మెదడులో వస్తున్న మార్పులను ఎఫ్ఎంఆర్ఐ ద్వారా గుర్తించారు. యోగ నిద్రతో మెదడులో భావోద్వేగాలను, మనస్సు సంచారాన్ని నియంత్రించడం, జాగృతంగా ఉంటూనే లోతైన విశ్రాంతిలోకి వెళ్లడం వంటి మార్పులు వచ్చినట్టు పరిశోధకులు గమనించారు. యోగాలో అనుభవం లేని వారితో పోలిస్తే అనుభవం ఉన్న వారిలో ఈ మార్పులు ఎక్కువ ఉన్నట్టు తేల్చారు.

జేసీబీలే ప్రచార రథాలు

- హర్యానా ఎన్నికల్లో కొత్త ట్రెండ్
- వాటిపైనే క్రేజ్..ఓటర్లలోనూ ఆసక్తి
- అనూహ్యంగా పెరిగిన డిమాండ్



చండీగఢ్, సెప్టెంబర్ 25: ఎన్నికల వేళ హర్యానాలో జేసీబీలకు అనూహ్య డిమాండ్ ఏర్పడింది. వచ్చే నెలలో జరిగే ఎన్నికల ప్రచారానికి ఇంతవరకు కార్లు, వ్యాన్‌లు వంటి సంప్రదాయ వాహనాలు వాడిన రాజకీయ పార్టీలు ఇప్పుడు కొత్తగా జేసీబీలపై ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. వచ్చే నెల 5న జరిగే అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని ఇప్పుడు వాటినే ప్రచార రథాలుగా వినియోగిస్తున్నారు. జేసీబీల ముందున్న బకెట్లలో నేతలు, కార్యకర్తలు జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ, పూలు జల్లుతూ, నృత్యాలు చేస్తూ కనిపిస్తున్నారు. ప్రజలు కూడా ఈ ప్రచారాన్ని చూడటానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో గురుగ్రామ్, ఫరీదాబాద్, నూహ్, మహేంద్రబాగ్ తదితర ప్రాంతాల్లోని రియాల్టీ సెక్టార్‌పై దీని ప్రభావం పడింది. ఇప్పటివరకు జేసీబీకి గంటకు రూ.1000 నుంచి 1500 వసూలు చేశామని, ఈ ఎన్నికల పుణ్యమా అని రాజకీయ పార్టీలు గంటకు రూ.5 వేలు చెల్లిస్తున్నాయని గురుగ్రామ్‌కు చెందిన జేసీబీ యజమాని ఒకరు తెలిపారు.

బుల్డోజర్ క్రేజ్.. నిలిచిన అభివృద్ధి పనులు

దేశమంతా ఇటీవల కాలంగా బుల్డోజర్ క్రేజ్ పెరిగింది. తొలుత యూపీలో మొదలైన ఈ బుల్డోజర్ సంస్కృతి ఇప్పుడు దేశంలోని పలు రాష్ట్రాలకు పాకింది. దీంతో బుల్డోజర్లకు ప్రతీకగా ఉండే జేసీబీల వెంట రాజకీయ నేతలు పడుతున్నారు. వాటిని చూడటానికి జనాలు ఎగబడుతున్నారు. బహిరంగ సభలు ముగిసిన తర్వాత అక్కడ పార్కు చేసి ఉన్న జేసీబీల వద్ద సెల్ఫీల కోసం జనం వేలం వెర్రిగా క్యూలు కడుతున్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. కోటి చెక్కును బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తున్న కిమ్స్ హాస్పిటల్ ఎండీ భాస్కర్ రావు

ఏటా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసినా రాష్ట్రంలో నిరుద్యోగం పోదు

- వచ్చే ఏడాది నుంచి ఇంజినీరింగ్‌లో ఇంటర్న్‌షిప్
- బీటెక్ విద్యార్థులు గంజాయి అమ్ముతున్నారు
- బీఎఫ్ఐఎస్ కోర్సు ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏటా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసినా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పోదని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాము 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలను భర్తీచేశామని, రెండుమూడు రోజుల్లో మరో 35 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీచేయనున్నట్టు చెప్పారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీని కూడా ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు. మాసాబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ వర్సిటీ ఆడిటోరియంలో బుధవారం బ్యాకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) కోర్సును సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిశ్రమ అవసరాలను తీర్చడం, ఉద్యోగావకాశాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా బీఎఫ్ఎస్ఐ కోర్సును ప్రారంభించినట్టు తెలిపారు. స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ ఆఫ్ క్యాంపస్‌లను రాష్ట్రంలో ప్రారంభించాలని ఆయా సంస్థలను కోరినట్టు చెప్పారు. వచ్చే ఏడాది నుంచి ఇంజినీరింగ్‌లోనూ ఇంటర్న్‌షిప్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఇంజినీరింగ్ పట్టాలు అందుకుంటున్న లక్షలాది విద్యార్థులకు బేసిక్ నాలెడ్జ్ కూడా ఉండడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. టీచింగ్ స్టాఫ్‌లో సరైన నైపుణ్యాలు లేవని, ఇలా ప్రమాణాలు లేని కాలేజీల గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. బీటెక్ చదివిన వారు కూడా డ్రగ్స్ వలలో చిక్కుకుంటున్నారని ఆం దోళన వ్యక్తం చేశారు. గంజాయి తాగడం నుం చి దానిని విక్రయించే దశకు బీటెక్ విద్యార్థులు చేరుకోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు.

10 వేలమందికి ఉచితంగా ప్రవేశాలు

బీఎఫ్ఎస్ఐ కోర్సును రాష్ట్రంలోని 10 వేల మంది ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉచితంగా అందిస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ కోర్సు నిర్వహణకు ఎక్విప్ సంస్థ రూ. 2.5 కోట్లు అందజేసిందని పేర్కొన్నారు. మొదటి 10వేల మందికి ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. కోర్సులో చేరిన వారికి డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఆరు నెలల పాటు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తామని తెలిపారు.

మూసీ నిర్వాసితులకు 'డబుల్' ఇండ్లు

జీహెచ్ఎంసీ పరిధిలో మూసీనది ఒడ్డున, బఫర్ జోన్ పరిధిలో నివసిస్తున్న వారికి గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లను కేటాయించనున్నట్టు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగంగా నది ఒడ్డున, బఫర్‌జోన్ పరిధిలో సుమారు 15,000మంది నివసిస్తున్నట్టు గుర్తించారు. వారిని అక్కడి నుంచి తొలగించి డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో పునరావాసం కల్పించనున్నట్టు తెలిపారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ, జీహెచ్ఎంసీ కమిషనర్, కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దసరాకు ఇందిరమ్మ కమిటీలు

- రాజీవ్ స్వగృహ ఇండ్లకు వేలం : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 25(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం దసరా పండుగనాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గ్రామ, వార్డు, మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు విధివిధానాలను ఒకట్రెండు రోజుల్లో రూపొందించాలని సూచించారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు దక్కాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సచివాలయంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నుంచి ఇతర రాష్ట్రాలు లక్షల సంఖ్యలో గృహాలు మంజూరు చేయించుకుంటే తెలంగాణ వెనుకబడిందని, ఈ దఫా కేంద్రం మంజూరు చేసే గృహాల్లో గరిష్ఠంగా రాష్ట్రానికి ఇండ్లు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీఎంఏవై కింద రాష్ట్రానికి రావాల్సిన బకాయిలను రాబట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో డాటాను ఎప్ప టికప్పుడు అప్‌డేట్ చేయాలని చెప్పారు. పెద్ద సంఖ్యలో ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తే ఇంజినీరింగ్ సిబ్బంది సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని అధికారులు తెలపగా అవసరమైతే ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియామకాలు చేపట్టాలని సూచించారు. రాజీవ్ స్వగృహలో నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లు, ఇండ్లను వేలం వేయాలని తెలిపారు. డబుల్ బెడ్రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా ఎందుకు అప్పగించ లేదని ప్రశ్నించారు. వెంటనే అర్హులకు ఇండ్లను అప్పగించాలని చెప్పారు. హైదరాబాద్ నగరంలో నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి, అర్హులైనవారికి అప్పగించాలని సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం ప్రిన్సిపల్ కార్యదర్శి వీ శేషాద్రి, సీఎం కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్, తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ పాల్గొన్నారు.

'317'పై కసరత్తు పూర్తి?

- సీఎం రేవంత్ రెడ్డి దగ్గరికి చేరిన ఫైల్
- రెండుమూడు రోజుల్లో ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): జీవో-317 ప్రభావిత ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వం తుది నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. ఈ అంశంపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలోని క్యాబినెట్ సబ్ కమిటీ కసరత్తు పూర్తి చేసింది. నివేదికను రూపొందించి, మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరికి పంపినట్టు సచివాలయ వర్గాలు తెలిపాయి. మంగళవారం సబ్ కమిటీ సీఎంతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారని పేర్కొన్నాయి. నివేదికను సీఎం ఆమోదిస్తే రెండుమూడు రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉన్నదని పేర్కొన్నాయి. జీవో 317, జీవో 46పై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఫిబ్రవరిలో మంత్రి దామోదర అధ్యక్షతన మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో సబ్ కమిటీని నియమించింది. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించారు. స్థానికత, భార్యాభర్తలు (స్పౌజ్), మెడికల్, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించిన కమిటీ.. సానుకూలంగా నిర్ణయం తీసుకున్నది. స్పౌజ్, మెడికల్, మ్యూచువల్ బదిలీలకు పచ్చజెండా ఊపిందని తెలిసింది. వారి బదిలీలకు సంబంధించి ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నాయి. ఇక స్థానికతపై ఏం చేయాలనేదానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. దీనిపై మరింత అధ్యయనం అవసరమని కమిటీ భావిస్తున్నట్టు తెలిసింది.

తెలంగాణ అభివృద్ధిలో భాగం కావాలి

- అమెరికన్ కంపెనీలకు భట్టి పిలుపు
- లాస్‌వేగాస్ మైన్‌ఎక్స్‌పో సందర్శన

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో, ఫోర్త్ సిటీ నిర్మాణంలో అమెరికన్ పరిశ్రమలు, వ్యాపార సంస్థలు భాగస్వామ్యం పంచుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క కోరారు. అమెరికాలోని లాస్‌వేగాస్‌లో మంగళవారం ప్రారంభమైన అంతర్జాతీయ మైన్స్ ఎక్స్‌పో-2024లో పాల్గొన్న ఆయన అనంతరం పలు అమెరికన్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడులకు, వ్యాపారాలకు హైదరాబాద్ అత్యంత అనువైన ప్రాంతమని, తెలంగాణలో ఖనిజ పరిశ్రమాభివృద్ధికి దోహదపడాలని, అందుకు అవసరమైన అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఈ ఎక్స్‌పోలో 1900 యంత్ర ఉత్పత్తి సంస్థలు స్టాల్స్ ఏర్పాటు చేశాయి. 121 దేశాల నుంచి 44 వేల మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయండి

- మంత్రి పొన్నంకు లబ్ధిదారుల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): దళితబంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేశ్, రాష్ట్ర కన్వీనర్ చిట్టి మల్ల సమ్మయ్య డిమాండ్ చేశారు. సచివాలయంలో బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రెండో విడత దళితబంధు నిధులు విడుదలైనా కలెక్టర్ల అకౌంట్లలోనే ఉన్నాయని వెల్లడించారు. నిధుల విడుదలకు 9 నెలలుగా అనేక కార్యక్రమాలు చేపట్టినా ఎలాంటి స్పందన లేదని వాపోయారు. ఇప్పటికైనా నిధుల విడుదలకు చొరవ చూపాలని పొన్నంను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ మడికొండ రమేశ్, ఉపాధ్యక్షుడు బోనగిరి శ్రీనివాస్, సలహాదారులు దర్శనాల సంజీవ, కావేరి చిన్నికృష్ణ, బాల నర్సు, కమిటీ నేతలు కొలుగూరి సురే శ్, నరేశ్, భిక్షపతి, కుమార్, శ్రీనివాస్, రాజేశ్, మధు, దేవదాసు, రజనీకాంత్ ఉన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళితబంధు సాధన సమితి నేతలు

ఆదాయాన్ని పెంచడంపై దృష్టి పెట్టాలి

విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలల స్థాయిలోనే ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేలా కరికులం ఉండేలా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో రోడ్డు-భద్రత, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రవాణా శాఖ ఆదాయం పెంచడానికి తీసుకోవల్సిన చర్యలపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన సూచనలపై చర్చించారు. స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై విషయంలో కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఆటోలలో విద్యార్థులను ఓవర్ లోడ్‌తో తీసుకెళ్తున్న వారిపై తనిఖీలు నిర్వహించాలని సూచించారు. తెలంగాణలో ప్రతి రోజూ 20 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిబంధనల మేరకే కాళేశ్వరం బిల్లుల చెల్లింపు

- జస్టిస్ ఘోష్ కమిషన్ ఎదుట కార్పొరేషన్ అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): రుణాలు, బిల్లుల చెల్లింపు మొత్తం కూడా నిబంధనల మేరకే కొనసాగిందని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు కాళేశ్వరం కార్పొరేషన్ అధికారులు నివేదించారు. కమిషన్ బుధవారం నిర్వహించిన బహిరంగ విచారణకు కాళేశ్వరం కార్పొరేషన్, జనరల్ అకౌంట్స్ అధికారులైన వెంకట అప్పారావు, పద్మావతి, మణిభూషన్ శర్మ హాజరయ్యారు. కాళేశ్వరం నిర్మాణానికి నిధుల సేకరణ, బిల్లుల చెల్లింపులు, కార్పొరేషన్ ఆదాయ, వ్యయాలు, కాగ్ నివేదికలోని పలు అంశాలపై వారిని కమిషన్ ప్రశ్నించింది. ప్రాజెక్టు పూర్తయితే అవి కార్పొరేషన్‌కు ఆస్తులుగా బదలాయిస్తారని అధికారులు వెల్లడించారు. గురువారం కూడా కమిషన్ విచారణ కొనసాగనున్నది.

బీసీ ఉద్యమ బలోపేతానికే రాజీనామా

- రాజకీయ పార్టీ ఏర్పాటుపై త్వరలో నిర్ణయం
- జాట్ల తరహాలో తెలంగాణలో బీసీల ఉద్యమం
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య
- కాంగ్రెస్‌లోకి ఆహ్వానించిన మల్లు రవి, తీన్మార్ మల్లన్న



బీసీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రాజకీయాలకు అతీతంగా బీసీల ఉద్యమం బలోపేతానికే రాజ్యసభ సభ్యత్వానికి తాను రాజీనామా చేశానని బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య వెల్లడించారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల తరపున చట్టసభల్లో ప్రశ్నించినా సమాధానం రావడం లేదని, దీంతో ప్రజా ఉద్యమమే శరణ్యమని భావించి ఇంకా నాలుగేండ్ల గడువున్నా రాజీనామా చేశానని తెలిపారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధనే తన జీవిత ధ్యేయమని, ఆ దిశగా పోరాటాలను ఉధృతం చేస్తానని చెప్పారు. రాజకీయ పార్టీ పెట్టాలని బీసీ బిడ్డల నుంచి వస్తున్న ఒత్తిడిపై కూలంకషంగా చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ఈ పోరాటాల్లోకి రాజకీయాలకతీతంగా బీసీలంతా కదలిరావాలని కోరారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆర్ కృష్ణయ్యతో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి బుధవారం ఉదయం భేటీ అయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సైతం ఆర్ కృష్ణయ్యను కలిసి ఇదే విషయమై చర్చలు జరిపారు. సమావేశంలో బీసీ సంఘాల నేతల గుజ్జ కృష్ణ, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ వర్గాలన్నీ ఏకతాటిపైకి రావాలి

- కులగణన, రిజర్వేషన్లు పెంచేవరకు వదిలేది లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలి
- మాజీ ఎంపీ కృష్ణయ్య, బీఆర్ఎస్ నేత ఎల్ రమణ



ఖైరతాబాద్, సెప్టెంబర్ 25: కులగణన, బీసీ రిజర్వేషన్ల పెంపు సాధనే ఎజెండాగా పెట్టుకొని బీసీల్లోని అన్నివర్గాలు ఏకతాటిపైకి రావాలని మాజీ ఎంపీ కృష్ణయ్య, బీఆర్ఎస్ నేత ఎల్ రమణ పిలుపునిచ్చారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం బీసీ జాతీయ సంక్షేమ సంఘం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'సమగ్ర కులగణన-సామాజిక న్యాయం' అన్న అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో వారు మాట్లాడారు. సమగ్ర కులగణన, రిజర్వేషన్లు అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదలిపెట్టేది లేదని, ప్రభుత్వం వెంటనే స్పష్టమైన విధానం ప్రకటించాలని కోరారు. కేవలం బీసీ గణన జరిపి చేతులు దులుపుకోవాలని చూస్తున్నదని, కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సమగ్ర కులగణన చేసి, రిజర్వేషన్లు పెంచాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఓ వైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కోరుతుంటుంటే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. సమావేశంలో బీసీ జాతీయ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, సెక్రటరీ జనరల్ రాపోలు జ్ఞానేశ్వర్, ఎర్ర సత్యనారాయణ, లాల్‌కృష్ణ, కేవీ రావు, రవి కుమార్, నరసింహ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు'ను ఎండబెట్టారు.. కాళేశ్వరాన్ని పండబెట్టారు

- మంత్రులు ప్రాజెక్టులను సందర్శించడంపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం



వనపర్తి, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కార్ ఉమ్మడి పాలమూరులోని సాగునీటి ప్రాజెక్టులను ఎండబెట్టి.. కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిగా పండబెట్టిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పలు ప్రాజెక్టులను పరిశీలించడంపై స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టి ఆంధ్రా, రాయలసీమ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల కింద కనీసం 4 టీఎంసీల రిజర్వాయర్లను కూడా ఏర్పాటు చేయకుండా, ఆంధ్రాలో మాత్రం 400 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లను నిర్మించింది కాంగ్రెస్ కాదా? అని ప్ర శ్నించారు. కేసీఆర్ తలపెట్టిన పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకుంటూ వందలాది కేసులు వేయించిన కాం గ్రెస్, ఇటీవలే వట్టెం పంప్‌హౌస్‌ను నిర్లక్ష్యంతో ముంచిందని విమర్శించారు. నెల రోజులైనా నీటి ని ఎత్తిపోయలేదని, పాలమూరు జిల్లాపై ఉన్న నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనమని అన్నారు. పది నెలల నుంచి పాలమూరు ప్రాజెక్టుల వైపు మంత్రులు కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. ఉదండాపూర్ నుంచి గ్రావిటీతో కొడంగల్, నారాయణపేటకు నీళ్లిచ్చే అవకాశం ఉన్నా భేషజాలకు పోయి సీఎం రేవంత్‌రెడ్డి 6 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న జూరాలపై అదనపు భారం మోపుతున్నారని పేర్కొన్నా రు. మంత్రుల పర్యటనతో పాలమూరుకు ఒరిగేది ఏమీలేదని, బీఆర్ఎస్ ప్రశ్నలకు భయపడి హడావిడిగా ఏ ప్రణాళికలు లేకుండానే పర్యటన పెట్టుకున్నారని విమర్శించారు. ట్రయల్ రన్ పూర్తయిన పంపుల ద్వారా నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్లను నీటితో నింపాలని, విద్యుత్తు కనెక్షన్లకు సంబంధించిన పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

సీఎంతో బీసీ కమిషన్ చైర్మన్ భేటీ

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రాష్ట్రంలో బీసీ కులగణనకు అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించారు. బీసీ కులగణన ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని, ఇతర రాష్ట్రాల్లోని విధానాలను తెలుసుకోవాలని కమిషన్‌కు సీఎం సూచించారు. వెంటనే బీసీ కులగణనకు కార్యాచరణ ప్రారంభించాలని ఆదేశించారు.

మంత్రులను కలవనియ్యరా?

- ఎంపీ, ఎమ్మెల్యేతో భూనిర్వాసితుల వాగ్వాదం
- ఒకే రిజర్వాయర్‌కు రెండు ప్యాకేజీలా?
- పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్
- లేదంటే పనులను అడ్డుకుంటామని హెచ్చరిక



ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, జూపల్లి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు, చిన్నారెడ్డి



ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవితో వాగ్వాదానికి దిగిన భూనిర్వాసితులు

జడ్చర్ల, సెప్టెంబర్ 25 : మంత్రులు, ఎమ్మెల్యేలకు నిరసన సెగ తగిలింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఉదండాపూర్ వద్ద పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను పరిశీలించేందుకు బుధవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వచ్చారు. మంత్రులను కలిసేందుకు అనుమతించకపోవడంతో ఉదండాపూర్ భూనిర్వాసితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వారి వద్దకు ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రావడంతో భూనిర్వాసితులు వాగ్వాదానికి దిగారు. మంత్రులకు తమగోడు వినిపిస్తామంటే ఎందుకు వెళ్లనివ్వడం లేదని నిలదీశారు. రైతు ప్రభుత్వమని చెప్పే కాంగ్రెస్.. కర్షకులను అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. పది రోజుల కిందట పునరావాసం కింద పరిహారం పెంచి ఒక్కొక్కరికి రూ.25 లక్షలు ఇస్తామని చెప్పిన ఎమ్మెల్యే.. ఇప్పుడు మాట మార్చి రూ.16 లక్షలు మాత్రమే ఖాతాల్లో వేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిహారం పెంచకపోతే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఒకే రిజర్వాయర్‌లో రెండు రకాల ప్యాకేజీలు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. పోలేపల్లి శివా రు రైతులకు ఎకరాకు రూ.12.50 లక్షలు ఇచ్చారని, అదే శివారుకు ఇవతల ఉన్న భూములకు రూ.5.50 లక్షలు మాత్రమే ఎలా ఇస్తారని నిలదీశారు. తమకు కూడా పోలేపల్లి రైతులకు ఇచ్చిన విధంగా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

న్యాయపరంగా పునరావాసం : ఉత్తమ్

ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి రూ.45 కోట్లను విడుదల చేసినట్టు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఉదండాపూర్‌తోపాటు ఇతర రిజర్వాయర్లలో ముంపునకు గురైన నిర్వాసితులకు న్యాయపరంగా పునరావాసం కల్పిస్తామని చెప్పారు.

'వట్టెం' చూడకుండానే వెనుదిరిగిన మంత్రి

- పంప్‌హౌస్ పరిశీలనకు మంత్రి ఉత్తమ్
- హెలికాప్టర్‌కు సమయం లేదని వెనక్కి
- సమీక్ష లేకుండానే హైదరాబాద్‌కు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆర్భాటంగా వెళ్లిన మంత్రి ఉత్తమ్, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం అది పూర్తిచేయకుండానే వెనక్కి వచ్చింది. హెలికాప్టర్ టేకాఫ్‌కు టైం అయిపోతున్నదని చెప్పి ప్రాజెక్టులపై ఎలాంటి సమీక్ష లేకుండానే, వట్టెం రిజర్వాయర్‌ను పరిశీలించకుండానే వెనుదిరగడం చర్చనీయాంశమైంది. భారీ వర్షాలకు నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం శివారులోని నాగనూలు చెరువు, కుమ్మెర చెరువులు ఉప్పొంగడంతో ఆ బ్యాక్ వాటర్ కారణంగా వట్టెం పంప్‌హౌస్ నీటమునిగింది. 16 కిలోమీటర్ల పొడవు, 9 మీటర్ల వ్యాసంతో ఉన్న 2 సొరంగాలు పూర్తిగా నీటితో నిండిపోయా యి. పంప్‌హౌస్ సైతం మునిగిపోయింది. మొత్తంగా 34 లక్షల క్యూబిక్‌మీటర్ల నీరు చేరిందని అధికారులు ప్రాథమికంగా అం చనా వేశారు. నీటి తోడివేత పనులు ఇప్పటికీ మందకొడిగా కొనసాగుతుండడంపై బీఆర్ఎస్ నేతలు, స్థానికుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును మంత్రి ఉత్తమ్ బృందం సందర్శించింది.

ఇంజినీరింగ్ విద్యార్థులకు సీఎం క్షమాపణ చెప్పాలి

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ విద్యార్థులు గంజాయికి అలవాటు పడుతున్నారని వాళ్లకు కనీసం జ్ఞానం ఉండటం లేదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొనటాన్ని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఖండించారు. కొంతమంది విద్యార్థులు వారి వ్యక్తిగత బలహీనతలు, పరిస్థితుల ప్రభావం, చెడు సావాసాల వల్ల తప్పుదారి పడితే మొత్తం విద్యార్థులనే నిందించటం సీఎం అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిఘా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని స్వయంగా సీఎమ్మే అంగీకరిస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ఇంజినీరింగ్ విద్యార్థులకు, ఐటీ ఉద్యోగులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

- మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 25(నమస్తే తెలంగాణ): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అలంపూర్‌లోని శ్రీ జోగులాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి దేవస్థానంలో అక్టోబర్ 3 నుంచి 12వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ బుధవారం మంత్రి సురేఖను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికను అందించారు.

హైడ్రాకు కొత్తగా 169 పోస్టులు

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ విపత్తు నిర్వహణ-ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ సంస్థ(హైడ్రా)కు 169 మంది సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా కేటాయించింది. ఈ పోస్టులను వివిధ విభాగాల్లో డిప్యూటేషన్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు అనుమతిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నలుగురు అదనపు కమిషనర్లు, ఐదుగురు డీసీపీలు, 16 మంది సీఐలు, 16 మంది ఎస్ఐలు, 60 మంది పోలీస్‌కానిస్టేబుళ్లు, 12 మంది స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, 10 మంది అసిస్టెంట్ ఇంజినీర్లతో పాటు మొత్తం 169 పోస్టులు హైడ్రాకు కేటాయించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించండి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలలో సొంత భవనాలు నిర్మించి, వసతి సౌకర్యాలు మెరుగుపరుచాలని సీఎస్ శాంతికుమారికి టీఎస్ యూటీఎఫ్, గురుకులాల సంఘాల జేఏసీ తరపున ఎమ్మెల్సీ నర్సిరెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఐదు రకాల సొసైటీల పరిధిలో 1022 గురుకులాలు కొనసాగుతున్నాయని, వాటిలో 700 గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు.

సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులివ్వాలి

- బీజేపీ ఎంపీ ఈటల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): సర్పంచ్‌లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అడ్డదారులు తొక్కి అధికారంలోకి వచ్చిందని, పాలనలో విఫలమైందని ధ్వజమెత్తారు. సర్పంచ్‌లు దవాఖానల్లో ఉండి, డబ్బులు లేక ఏడుస్తున్నారని పేర్కొంటూ.. బాకీ ఉన్న నిధులన్నీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆందోల్ నియోజకవర్గంలో 48 చెరువుల అభివృద్ధి

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలోని 48 చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.10.18కోట్లతో పరిపాలన అనుమతులను మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పుల్కల్‌లో 23 చెరువుల అభివృద్ధికి రూ.4.96 కోట్లు, చౌట్కూర్‌లో 25 చెరువుల అభివృద్ధికి రూ.5.21 కోట్లను మంజూరు చేసింది.

28న తిరుమలకు జగన్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఏపీ మాజీ సీఎం జగన్ ఈ నెల 28న కాలినడకన తిరుమలకు వెళ్లనున్నారు. తిరుమల లడ్డూ పవిత్రతను, స్వామి వారి ప్రసాదం విశిష్టతను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన ఏపీ సీఎం చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు 28న అన్ని దేవాలయాల్లో పూజలు నిర్వహించాలని వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వేంకటేశ్వరస్వామి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, లడ్డూ పవిత్రతపై రాజకీయ దుర్బుద్ధితో కావాలని అబద్ధాలాడుతున్నారని దుయ్యబట్టారు.

ప్రైవేటు భవనానికి సర్కారీ సోకులు!

- శంషాబాద్ డబ్ల్యూటీసీ భవనంలో ఏఐ ఫెసిలిటీ సెంటర్
- అసంపూర్తి నిర్మాణంలో తాత్కాలిక కేంద్రం
- ట్రై సిటీల్లో అందుబాటులో సర్కారీ భవనాలు
- కపిల్ గ్రూపుతో ఐటీశాఖ ఒప్పందంపై ఆరోపణలు

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

ప్రత్యేక కథనం - 8

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్.. ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఏఐ సిటీ నిర్మాణ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేస్తున్న సెంటర్. అంటే తాత్కాలిక కేంద్రమన్న మాట. ప్రభుత్వ పరంగా టీ-హబ్, టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల చదరపు అడుగుల్లో విశాలమైన , అద్భుతమైన భవనాలు అందుబాటులో ఉండగా అసంపూర్తి అద్దె భవనంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి రానున్న రోజుల్లో ఎంతో ప్రాధాన్యం ఉండనుందని కేసీఆర్ ప్రభుత్వం ఆదిలోనే గుర్తించింది. అందుకే హైదరాబాద్ వేదికగా ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024 నిర్వహించేందుకు గతంలోనే చొరవ తీసుకుంది. కొన్నిరోజుల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏఐ ప్రాధాన్యత దృష్ట్యా 'ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024'ను నిర్వహించింది. ఈ క్రమంలోనే ఏఐ సిటీని ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు, పురోగతి, ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించేందుకు ఒక కేంద్రం కావాలి. అదే ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్. దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు సమ్మిట్ వేదికగానే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. కాకపోతే ఆ కేంద్రాన్ని శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్)లోని రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే అందరినీ విస్మయానికి గురి చేసింది.

ఇంతకీ ఏమిటీ డబ్ల్యూటీసీ?

దేశంలోనే అతిపెద్ద వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామంటూ జూన్ 2022 నగరానికి చెందిన కపిల్ గ్రూపు ఆర్భాటంగా ప్రకటించింది. శంషాబాద్ విమానాశ్రయం తూర్పు ముఖం దగ్గర శ్రీశైలం హైవేను అనుకొని 50-60 ఎకరాల్లో 12 అంతస్తులతో కూడిన భవనాన్ని నిర్మిస్తామని చెప్పింది. ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లను పెట్టుబడిగా పెడుతున్నట్టు ప్రకటించింది. కారణాలు ఏవైనా ఆ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాలేదు. కేవలం గ్రౌండ్ ఫ్లోర్ సహా మూడు అంతస్తులతో కూడిన రెండు టవర్ల నిర్మాణం మాత్రమే ఇప్పటికీ పురోగతిలో ఉంది. అంటే మూడేండ్ల కిందట మొదలుపెట్టిన ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం వేగంగా పనులు కొనసాగించినా ప్రాజెక్టు పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. ఇలాంటి అసంపూర్తి భవనాల్లో ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఒప్పందంలోని షరతులేమిటో?

శంషాబాద్ విమానాశ్రయం తూర్పు వైపు నిర్మిస్తున్న డబ్ల్యూటీసీ శంషాబాద్ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతుందని కంపెనీ చెప్తున్నది. అలాంటప్పుడు ఏడాది తర్వాత పూర్తయ్యే భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఆ మేరకు ఒప్పందం కూడా పూర్తయినట్టు తెలుస్తున్నది. అయితే, ఆ ఒప్పందంలో ఏముందనేది మాత్రం బయటికి రావడం లేదు.

ఈ భూమాయకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి

91827 77711

ఏడాదికి గాని పూర్తికాని భవనంలో తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయాలనుకోవడం ఒక ఎత్తయితే, ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం తరఫున సదరు గ్రూపునకు ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు ఏమిటన్నవి తెలియరాలేదు. భవనం పూర్తయ్యాక సెంటర్ ఏర్పాటు చేస్తారా? లేదంటే భవనం పూర్తికి ప్రభుత్వ పరంగా ఆర్థికంగా చేయూత అందిస్తారా? అసలు ఆ భవనాన్ని ఎంచుకోవడానికి కారణం ఏమిటి? ఇలా అనేక సందేహాలు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

టీ హబ్ కేంద్రంగా 60కి పైగా ఏఐ స్టార్టప్‌లు

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ-హబ్ దేశంలోనే కాకుండా అంతర్జాతీయస్థాయిలో టెక్నాలజీ స్టార్టప్‌లకు కేంద్రంగా మారింది. ఐటీ కారిడార్‌లో అత్యంత విశాలమైన ప్రాంగణంలో ఉన్న టీ-హబ్‌లో రకరకాల టెక్నాలజీ స్టార్టప్‌లు ఉన్నాయి. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కి సంబంధించిన టెక్నాలజీ స్టార్టప్‌లే 60కి పైగా ఉన్నాయి. ఇక్కడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏఐ స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రత్యేకంగా వ్యవస్థలు కూడా ఏర్పాటయ్యాయి. స్టార్టప్‌లకు, ఐటీ కంపెనీలకు ఎంతో అనుకూలంగా ఉండే ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పైగా ఐటీ శాఖకే చెందిన భవనం కావడంతో పైసా ఖర్చు లేకుండా ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటవుతుంది. ఇదే కాకుండా టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో అనేక భవనాలు కూడా ఉన్నాయి. సర్కారు మనసు పెడితే రెండు లక్షల చదరపు అడుగులు అనేది అత్యంత సులువైన ప్రక్రియ. కానీ వీటిని కాదని ప్రైవేటు సంస్థకు చెందిన భవనంలోనే ఏర్పాటు చేయడం వెనక మర్మమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఇంకో ఆసక్తికర అంశమేమంటే, ఏఐ సిటీ 200 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ప్రస్తుతం నిర్మాణ రంగంలోని పరిజ్ఞానం, వనరుల దృష్ట్యా రెండు లక్షల చదరపు అడుగుల్లో ఒక భవనాన్ని నిర్మించడమనేది అత్యంత సులువైన ప్రక్రియ. ఈ క్రమంలో అక్కడే ఒక తాత్కాలిక భవనాన్ని నిర్మించుకునే వెసులుబాటు కూడా ఉంది. ఏఐ సిటీ పూర్తయిన తర్వాత ఈ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసిన భవనాన్ని కూడా వినియోగించుకోవచ్చు. అయినప్పటికీ అసంపూర్తి, ప్రైవేటు భవనాన్ని ఎంచుకోవడం వెనక అసలు ఉద్దేశం వేరే ఉందన్న చర్చ జరుగుతున్నది.

అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగుల ఆందోళనబాట

- ఫైన్‌ఆర్ట్స్ వర్సిటీకి స్థల కేటాయింపుపై వ్యతిరేకత
- నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్
- జేఏసీగా ఏర్పడిన యూనివర్సిటీ ఉద్యోగులు
- ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిక



వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం(బీఆర్‌ఏవోయూ)లో పదెకరాల స్థలాన్ని ప్రభుత్వం జేఎన్‌ఎఫ్‌ఏయూకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ వర్సిటీ ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడిన ఉద్యోగ సంఘాలు బుధవారం వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ పల్లవి కాబడే, కన్వీనర్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ జీ మహేశ్వర్‌గౌడ్ మాట్లాడారు. తమ వర్సిటీ స్థలాన్ని ప్రభుత్వాలు ధారాదత్తం చేయడం తగదని వారు హితవు పలికారు. వర్సిటీకి కేటాయించిన 53 ఎకరాల్లో టీశాట్‌కు 5, కేబుల్ బ్రిడ్జికి 4 ఎకరాల చొప్పున కేటాయించారని, మరో 5 ఎకరాల స్థలం దుర్గం చెరువు నీట మునిగిందని తెలిపారు. వర్సిటీలో ఇంకా మల్టీమీడియా, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ లెర్నింగ్ సెంటర్ భవనాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను నిర్మించాల్సి ఉన్నదని చెప్పారు. సరైన వసతులు లేక అధ్యాపకులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, ఈ దశలో పదెకరాల స్థలాన్ని జేఎన్‌ఎఫ్‌ఏయూకు కేటాయించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. స్థల కేటాయింపు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే వచ్చేరోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో జేఏసీ నాయకులు రవీంద్రనాథ్, వెంకటేశ్వర్లు, నారాయణరావు, బానోత్ ధర్మ, ఎం రేషేంద్రమని, పుష్పా చక్రపాణి, మాధురి, మేరి సునంద, పీ వెంకటరమణ, ఎల్వీకే రెడ్డి, హబీబుద్దీన్, కాంతం ప్రేమ్‌కుమార్, యాకేష్ దైద, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయండి

- 'ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు'లను రెగ్యులర్ చేయాలి: మారం జగదీశ్వర్

వేములవాడ, సెప్టెంబర్ 25: దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261 జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్‌ఆర్‌ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు.

విమానాల పొగతో భూమిపై ఉష్ణోగ్రతల పెరుగుదల

లండన్: విమానాల నుంచి వెలువడే పొగ మేఘాలు ఆకాశంలో దుప్పటి మాదిరిగా పని చేస్తాయని, ఫలితంగా భూమిపై ఉష్ణోగ్రతలు పెరుగుతాయని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు హెచ్చరించారు. ఈ మేఘాలను తగ్గిస్తే, భూమి వేడెక్కడంలో వైమానిక రంగం చూపే ప్రభావం 40 శాతం తగ్గుతుందని చెప్పారు. చల్లని, తేమ గల గగనతలంలో విమానాలు ప్రయాణించినపుడు నిరంతరాయమైన మేఘం కమ్ముకుంటుందన్నారు. దీనిని నివారించడం కోసం విమానాలు తమ మార్గాలను మార్చుకోవాలని సలహా ఇచ్చారు. ఐదేండ్లలో చేపట్టాల్సిన చర్యలను తాము సిఫారసు చేశామని, వీటి ప్రభావాన్ని పరీక్షించడం కోసం వైమానిక పరిశ్రమ కృషి చేయాలనిపరిశోధకుల సంయుక్త నివేదిక కోరింది.

మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఒంగోలు మాజీ ఎంపీ, దివంగత మాగుంట సుబ్బరామిరెడ్డి సతీమణి, కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ (78) అనారోగ్యంతో కన్నుమూశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఆమె చెన్నైలోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. మాగుంట పార్వతమ్మ 1996లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఒంగోలు నుంచి ఎంపీగా గెలుపొందారు. 2004లో కావలి శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2012లో ఒంగోలు అసెంబ్లీ నుంచి పోటీచేసి ఓటమి చెందారు. పార్వతమ్మ మృతిపై సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు.

రైతులకు కంగన క్షమాపణ

రైతు చట్టాలపై వ్యాఖ్యలు వెనక్కి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: తన దురుసు వ్యాఖ్యలతో నోరు పారేసుకున్న నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ రైతులకు క్షమాపణ చెప్పారు. 2021లో కేంద్రం రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలంటూ ఆమె ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద రైతు చట్టాలపై తాను చేసిన వ్యాఖ్యలు చాలామందిని అసంతృప్తి, బాధకు గురి చేశాయని, దీనికి తనను క్షమించాలని ఆమె కోరారు. 'కొద్ది రోజుల క్రితం రైతు చట్టాలపై మీడియా నన్ను కొన్ని ప్రశ్నలు వేసింది. గతంలో రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలని నేను ప్రధాని మోదీని కోరుతానని చెప్పా. అయితే నేను చేసిన ఈ ప్రకటన చాలామందిని బాధించింది. నేను నా ప్రకటనను వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెబుతున్నా. నేనొక బీజేపీ కార్యకర్తను. నేను చేసే ప్రకటనలు పార్టీ అభిప్రాయాన్ని ప్రతిబింబించేవిగా ఉండాలి తప్ప, వ్యక్తిగతంగా ఉండకూడదు' అని ఆమె ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కాగా, కంగనా చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమైనవని, వాటికి పార్టీతో సంబంధం లేదని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అంతకు ముందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్థిక శాఖలో అక్రమ ప్రమోషన్

- వెంటనే ఉప సంహరించుకోవాలి
- చీఫ్ సెక్రటరీకి ట్రెజరీ ఉద్యోగుల ఫిర్యాదు



ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు వినతిపత్రం సమర్పిస్తున్న 'తెలంగాణ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీస్ అసోసియేషన్' నాయకులు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఆర్థిక శాఖలో ఓ అధికారికి అక్రమంగా ప్రమోషన్ ఇచ్చారంటూ 'తెలంగాణ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీస్ అసోసియేషన్' ఆరోపించింది. ఆ ప్రమోషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఫైనాన్స్ విభాగంలో పనిచేస్తున్న ఎన్ మంగమ్మ అనే సెక్షన్ ఆఫీసర్‌ను హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా (సీఏవో) నియమిస్తూ ఈ నెల 23న ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రమోషన్‌పై ఉద్యోగులు అభ్యంతరం చెప్తున్నారు. సర్వీస్ నిబంధనల ప్రకారం సెక్షన్ ఆఫీసర్‌ను బదిలీ లేదా ఉద్యోగోన్నతిపై పంపితే అకౌంట్స్ ఆఫీసర్ లేదా అసిస్టెంట్ డైరెక్టర్ లేదా జిల్లా ట్రెజరీ అధికారిగా పంపాల్సి ఉంటుందని, అంతేగానీ సీఏవో/డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించేందుకు అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు. సీనియార్టీని పరిగణనలోకి తీసుకొని డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ నుంచి వచ్చిన సిఫారసుల మేరకే పదోన్నతులు కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నిబంధనలను బేఖాతరు చేస్తూ మంగమ్మకు సెక్షన్ ఆఫీసర్ నుంచి ఏకంగా సీఏవోగా ప్రమోషన్ కల్పించారని పేర్కొన్నారు. ఇది అన్యాయమని, ఈ చర్యతో సీనియార్టీ జాబితాలో ఉన్న ఏవోలు, ఏడీలు, డీటీవోలు తీవ్ర ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని ఈ ప్రమోషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి పరశురాం, వైస్ ప్రెసిడెంట్ శిరీష, కోశాధికారి జగన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'గట్టి' సిఫారసు?

ఆర్థిక శాఖలో సంచలనంగా మారిన అక్రమ పదోన్నతి వెనుక 'గట్టి' సిఫారసు ఉన్నట్టు సచివాలయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి వివిధ కారణాలతో ఈ శాఖలో నాలుగేండ్లుగా ఎలాంటి పదోన్నతులు కల్పించడం లేదని ఉద్యోగులు చెప్తున్నారు. సర్వీస్ నిబంధనలు, ఇతర కారణాలు అంటూ సాకులు చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎంతో సీనియార్టీ ఉన్న ఉద్యోగులు సైతం పదోన్నతులు లేకుండా ఏవోలుగా, ఏడీలుగా, డీటీవోలుగా పదవీ విరమణ చేయాల్సి వచ్చిందని చెప్తున్నారు. కానీ.. మంగమ్మ విషయంలో నిబంధనలన్నీ తుంగలో తొక్కారని.. డీపీసీ సిఫారసులు లేకుండానే, సీనియార్టీకి మించి పదోన్నతి ఇచ్చారని మండిపడుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని తొమ్మిది నెలల్లో నాలుగైదు సార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని వాపోతున్నారు.

• ఆరోగ్య ప్రదాత కేసీఆర్



ఇటీవల విడుదలైన ఫలితాల్లో సింగరేణి వైద్య కళాశాల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించడంపై రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హర్షం వ్యక్తంచేశారు. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆరోగ్య ప్రదాత కేసీఆర్ అని కొనియాడారు. - గోదావరిఖని

రామంతపూర్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారించండి

- *6 నెలల్లోగా పూర్తిచేయాలని లేక్ ప్రొటెక్షన్ కమిటీకి ఆదేశం*

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): రామంతపూర్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్)ను నిర్ధారించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 6 నెలల్లోగా ఆ ప్రక్రియను పూర్తిచేసి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నది. ఈ ప్రక్రియకు ముందు అక్కడి నివాసితులతోపాటు ఇంప్లీడ్ పిటిషనర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని, ఆ తర్వాతే ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలని లేక్ ప్రొటెక్షన్ కమిటీకి స్పష్టం చేసింది. ఆ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం బుధవారం తుది ఉత్తర్వులు జారీ చేస్తూ.. రామాంతపూర్ పెద్దచెరువుపై 2005లో దాఖలైన పిటిషన్‌పై విచారణ ముగిసినట్టు ప్రకటించింది.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సినీనటి జయసుధ, డాక్టర్ ప్రీతిరెడ్డి తదితరులు

'మల్లారెడ్డి నారాయణ' లో రోబోటిక్ సర్జరీ సేవలు

ప్రారంభించిన సినీ నటి జయసుధ

దుండిగల్,సెప్టెంబర్ 25: సూరారంలోని మల్లారెడ్డి నారాయణ వైద్యశాలలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలను బుధవారం సినీనటి జయసుధ ప్రారంభించారు. ఈ సందర్భంగా జయసుధ మాట్లాడుతూ అతితక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో క్రిటికల్ స్టేజ్‌లో ఉన్న పేషంట్లకు మెరుగైనచికిత్స అందించడమే లక్ష్యంగా రోబోటిక్ సర్జరీని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. మల్లారెడ్డి నారాయణ, మల్లారెడ్డి హెల్త్‌సిటీ వైద్యశాలల చైర్మన్ సీహెచ్ భద్రారెడ్డి, వైస్ చైర్మన్ సీహెచ్ ప్రీతిరెడ్డి మాట్లాడుతూ మల్లారెడ్డి రోబోటిక్ శస్త్ర చికిత్సలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సేవలను వినియోగిస్తున్నట్టు తెలిపారు. సీనియర్ కన్సల్టెంట్, ఆర్థోపెడిక్ సర్జన్ అంజనికుమార్ మాట్లాడుతూ రోబోటిక్ యంత్రాల ద్వారా సూక్ష్మమైన, సంక్లిష్టమైన అంశాలను గుర్తించవచ్చని పేర్కొన్నారు.

పెన్షనర్ల సౌకర్యాలను కుదించొద్దు

పెన్షనర్స్ సంఘం నేత నారాయణరెడ్డి


సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 25: పెన్షనర్ల సౌకర్యాలు కుదించే విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ నారాయణరెడ్డి కోరారు. నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు కోఠిలోని కేంద్రీయ సదన్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. 8వ పే కమిషన్ ఏర్పాటు, ఆరోగ్య పథకాలను మెరుగుపర్చడంతో పాటు పెండింగ్ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. సీనియర్ నాయకులు ఎంఎస్ రెడ్డి, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్ జాతీయ చైర్మన్, టాప్రా కార్యదర్శి వీ కృష్ణమోహన్, నాయకులు ఎన్ సోమయ్య, నాయకులు రామచంద్రుడు, అరుణ, వెంకయ్య, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 23వరకు బీటెక్ అడ్మిషన్ల గడువు

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ ఫస్టియర్ అడ్మిషన్లను అక్టోబర్ 23లోపు పూర్తిచేసుకోవచ్చని అఖిల భారత సాంకేతిక విద్యామండలి స్పష్టంచేసింది. మిగులు సీట్లను ఆయా తేదీల్లోపు భర్తీచేసుకునే అవకాశమిచ్చింది. గతంలో జారీచేసిన 2024-25 విద్యాసంవత్సరం అకడమిక్ క్యాలెండర్‌ను ఏఐసీటీఈ సవరించింది. అక్టోబర్ 23లోపు ఫస్టియర్ క్లాసులను ప్రారంభించాలని వెల్లడించింది. ల్యాట్రల్ ఎంట్రీ ద్వారా బీటెక్ సెకండియర్‌లో ప్రవేశాల గడువును సైతం అక్టోబర్ 23గానే ఖరారుచేసింది.

27, 28న యూఏఈలో ఉద్యోగాలకు డ్రైవ్

హైదరాబాద్, సెప్టెంబర్ 25(నమస్తే తెలంగాణ): గల్ఫ్ దేశాల్లో మెకానికల్, ఎలక్ట్రికల్, బీఎంఎస్ ఆపరేటర్, ఎంఈపీ టెక్నీషియన్, ఎంఈపీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో 27, 28వ తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్టు టామ్‌కామ్ ప్రకటనలో తెలిపింది. ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులై, కనీసం 2నుంచి 4 ఏండ్ల అనుభవం, 20-45 ఏండ్ల మధ్య వయస్సు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల గల వారు www. tomcom.telangana. gov.in కి రెజ్యూమ్ పంపాలని కోరారు.



8 శతాబ్దాలుగా చెక్కు చెదరని నిర్మాణం..

కాకతీయ చక్రవర్తి గణపతిదేవుడి వద్ద సేనాధిపతిగా పనిచేసిన రేచర్ల రుద్రుడు 1213లో రామప్ప ఆలయాన్ని నిర్మించాడు. చారిత్రక సంపదలో కాకతీయులది ప్రత్యేక శైలి. వీరు నిర్మించిన ఆలయాల్లో ఎక్కువగా త్రికూటాలయాలే ఉన్నాయి. రామప్ప ఆలయాన్ని ఈ శైలిలోనే నిర్మించారు. ఇక్కడ రుద్రేశ్వర, కాటేశ్వర, కామేశ్వర స్వాములు కొలువై ఉంటారు. మూడు వైపులా ప్రవేశ ద్వారాలు, ఆలయం మధ్యలో పెద్ద మండపం ఉంటుంది. దేశంలోనే అరుదైన నిర్మాణ శైలి దీని సొంతం. రామప్ప ఆలయానికి వినియోగించిన రాళ్లు, ఇటుకలు ప్రత్యేకమైనవి. ఇటుకలు లేత ఎరుపు రంగులో ఉంటాయి. సాధారణ ఇటుకలతో పోల్చితే తక్కువ సాంద్రతతో వీటిని తయారు చేశారు. రామప్పకు ఉపయోగించిన ఇటుకలు నీటిలో తేలుతాయి. ఆలయం గోపురంపైన బరువు ఉండకుండా వీటిని వినియోగించారు. ఏండ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేందుకు వీలుగా ఈ ఇటుకలతో కప్పు వేసేందుకు ప్రత్యేక మట్టితోపాటు ఏనుగు లద్దె, అడవి మొక్కల జిగురు, ఊకపొట్టు వంటి పదార్థాలతో చేసిన మిశ్రమాన్ని వినియోగించారు. ప్రత్యేకశైలిలో నిర్మించడం వల్లనే వందల ఏండ్లయినా రామప్ప ఆలయం కళా సంపద చెక్కు చెదరకుండా ఉన్నది. రాతి కట్టడం కావడంతో బరువు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో తేలికగా ఉండే గ్రానైట్, డోలరైట్, బ్లాక్ గ్రానైట్లను వినియోగించారు. డోలరైట్ రాయిపై ఉన్న శిల్పాలు రామప్ప ఆలయానికి ప్రత్యేక శోభను తెచ్చాయి. సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాలు లేని రోజుల్లోనే సన్నని దారం ఒక వైపు నుంచి మరోవైపు వెళ్లేంత నైపుణ్యంతో ఇక్కడి శిల్పాలను చెక్కారు. ఇవీ అరుదైనవిగా కనిపిస్తాయి. భూకంపాలు, తుఫాన్లు, వరదలు వంటి విపత్తులకు చెక్కు చెదరకుండా ఇసుక పునాది (శాండ్ బాక్స్ టెక్నాలజీ)తో ఆలయాన్ని నిర్మించారు. 15 అడుగుల లోతులో ఇసుక నింపి అక్కడి నుంచి రాతితో పునాది నిర్మించారు. అందుకే వందల ఏండ్లయినా రాతి బరువుకు కిందికి కుంగిపోకుండా ఉంటున్నది. రామప్ప ఆలయంలో రామలింగేశ్వరుడు కొలువై ఉన్నాడు.

పేలుళ్లతో పునాదులకు ప్రమాదం

రామప్ప ఆలయానికి సమీపంలో 40.43 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలున్నట్టు సింగరేణి గుర్తించింది. రాష్ట్రంలోని గోదావరి తీరం వెంట విస్తారంగా బొగ్గు నిల్వలు ఉన్నా రామప్ప ఆలయం పక్కనే తవ్వకాలు జరిపేందుకు సర్వేలు పూర్తిచేసింది. ఇక్కడ ఏకధాటిగా 19 ఏండ్ల పాటు బొగ్గు తవ్వకాలు జరిపేందుకు అనుమతులు తీసుకుంటున్నది. 785 ఎకరాల అటవీ భూములు, 3,700 ఎకరాల వ్యవసాయ, ప్రభుత్వ అసైన్డ్‌భూములను సేకరించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చింది. సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్ ప్రక్రియలో వినియోగించే పేలుడు వల్ల రామప్ప ఆలయ పునాదులు దెబ్బతినే ప్రమాదం ఉన్నదని నిపుణులు, చరిత్రకారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

మైనింగ్ కోరల్లో మహా శిల్ప శిఖరం



తెలంగాణకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు తెచ్చిన మహనీయుడు పీవీ నర్సింహారావు. ఆయన రామనందతీర్థ శిష్యుడు. వారసత్వ సంపద అయిన రామప్ప ఉన్న ప్రాంతంలో సాహిత్య, సాంస్కృతిక ఔన్నత్యానికి గుర్తింపుగా నిలిచిన పీవీ నర్సింహారావు పేరుతో సింగరేణి సంస్థ ఇక్కడ ఓపెన్ కాస్ట్ మైనింగ్ చేపడుతున్నది. పీవీ నర్సింహారావు ప్రతిష్ఠను పెంచేలా చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం, చారిత్రక ప్రాంతంలో విధ్వంసం సృష్టించే ప్రాజెక్టుకు ఆయన పేరు పెడుతుండడంపై సాహిత్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీవీ పేరిట వారసత్వ సంపద విధ్వంసం జరిగే పనులు సరికాదని హితవుపలుకుతున్నారు.



- ములుగు జిల్లా వెంకటాపూర్ వద్ద ఓపెన్ గని
- బొగ్గు తవ్వకాలకు కాంగ్రెస్ సర్కార్ అనుమతి!
- పేలుళ్లతో కదలనున్న ఆలయ పునాదులు
- 5 కిలోమీటర్ల వరకు తవ్వకాలు వద్దన్న సుప్రీం
- 2012లో తవ్వకాలను అడ్డుకున్న నమస్తే తెలంగాణ, పర్యావరణ ప్రేమికులు, పురావస్తు నిపుణులు
- కాంగ్రెస్ సర్కారు మళ్లీ రాగానే కదిలిన ఫైలు
- విధ్వంసక గనికి మహనీయుడు పీవీ పేరు!

ఎనిమిది వందల ఏండ్ల నాటి శిల్పకళా శిఖరం.. నీటి విశిష్టతను తెలిపే.. నీరే నాగరికతకు పునాది అని చాటే వారసత్వపు జాడ.. సకల చరాచర సజీవ శిల్పాలతో జీవ వైవిధ్య ప్రాముఖ్యాన్ని వివరించే సాంస్కృతిక పూదోట.. పేరిణి తాండవం, కోలాటం, ప్రేంఖణం, చిందు నృత్యాలను దాచుకున్న దృశ్యపేటిక.. కాకతీయుల రాజకీయ, సామాజిక, సాంస్కృతిక కేంద్రంగా ప్రసిద్ధి పొంది, తెలంగాణ వారసత్వ సంపదగా విశ్వఖ్యాతి గడించిన గొప్ప కట్టడం.. తెలుగు రాష్ట్రాల్లో ప్రపంచ (యునెస్కో) గుర్తింపు పొందిన ఏకైక చారిత్రక, సాంకేతిక అద్భుతం..

మానవ జీవన పరిణామానికి సాక్షిగా.. కీలకమైన ఘట్టంగా నిలిచింది మన రామప్ప! ఎన్నో దండయాత్రలు, విపత్తులను తట్టుకొని నేటికీ సజీవ శిల్పకళా కోశంగా అలరారుతున్న రామప్ప ఆలయానికి 'ఓపెన్ కాస్ట్' రూపంలో మళ్లీ ముప్పు ముంచుకొస్తున్నది.

వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్‌లో 1,088 ఎకరాల విస్తీర్ణంలో 300 మీటర్ల లోతులో బొగ్గు తవ్వకాలకు సింగరేణి డీపీఆర్ సిద్ధం చేసింది. తవ్విన బొగ్గును మరో 737 ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్ చేయనున్నది. దీన్ని 120 మీటర్ల ఎత్తులో గుట్టలుగా పోయనున్నది. ఇదే జరిగితే ఈ పచ్చని ప్రాంతమంతా కాలుష్యకాసారంగా మారుతుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 2012లోనూ ఈ ప్రాంతంలో ఓపెన్ కాస్ట్ మైనింగ్ కోసం సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసింది. చరిత్రకారులు, ప్రజల నిరసనలు, ఆందోళనలతో వెనక్కి తగ్గింది. రాష్ట్రంలో ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ రాగానే రామప్ప ఆలయాన్ని ముప్పు ముంగిట నిలబెట్టింది.

వారసత్వ కట్టడానికి ఐదు కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి తవ్వకాలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. కానీ ఉద్దేశపూర్వకంగా దూరాన్ని రికార్డు చేసిన అధికారులు, మైనింగ్‌కు ఈ ప్రాంతం అనుకూలమని పేర్కొంటున్నారు.

ఎయిర్ రూట్, రోడ్ రూట్‌లో వేర్వేరు దూరాన్ని అనుకూలంగా మార్చుతున్నారు. మైనింగ్ ప్రాంతం నుంచి రామప్ప ఆలయం 4.5 కిలోమీటర్లే ఉన్నది. అనుమతుల కోసం అధికారులు దీన్ని 5.5 కిలో మీటర్లుగా చూపిస్తున్నారు.

తెలంగాణ ఔన్నత్యానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మహనీయుడు పీవీ నర్సింహారావు పేరుతో సింగరేణి సంస్థ ఇక్కడ చారిత్రక విధ్వంసానికి కారణమయ్యే ఓపెన్ కాస్ట్ మైనింగ్ చేపట్టనుండడం మరింత విషాదం..

(పిన్నింటి గోపాల్)

వరంగల్, సెప్టెంబరు 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పచ్చని అడవులు, పక్కన చెరువు.. బంగారం, మట్టి కలగలిపిన రంగులో అలరారే అద్భుత అందాల రామప్ప ఆలయం.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ తలపెట్టిన 'మైనింగ్ విపత్తు'తో విధ్వంసమయ్యే ప్రమాదం పొంచిఉన్నది. సామాన్యులు మెచ్చేలా పరిపాలన సాగించిన కాకతీయుల అద్భుత కట్టడంగా నిలిచి.. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప పక్కనే సింగరేణి ఆధ్వర్యంలో ఓపెన్ కాస్ట్ మైనింగ్‌కు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 2012లోనూ ఈ ప్రాంతంలో ఓపెన్ కాస్ట్ మైనింగ్ కోసం సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసింది. చరిత్రకారులు, ప్రజల నిరసనలు, ఆందోళనలతో వెనక్కి తగ్గింది. ఆ తర్వాత వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం చారిత్రక రామప్ప ఆలయ పరిరక్షణకు కృషి చేసింది. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్, కల్చరల్ ఆర్గనైజేషన్(యునెస్కో) గుర్తింపును తెచ్చింది. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రామప్ప ఆలయాన్ని ప్రమాదం అంచున నిలబెట్టింది.

పచ్చని అడవి.. కాలుష్యకాసారంగా..

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలో రామప్ప రుద్రేశ్వర ఆలయాన్ని కాకతీయులు అద్భుత శిల్పాకళా శైలితో నిర్మించారు. ప్రపంచంలోనే గొప్ప కట్టడాల్లో ఒకటిగా దీనికి మూడేండ్ల క్రితం యునెస్కో గుర్తింపు వచ్చింది. ఇలాంటి కట్టడం గురించి ప్రపంచానికి చాటి చెప్పుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, దాని ఉనికినే ప్రమాదంలో పడేసే చర్యలు మొదలుపెట్టింది. రామప్ప పక్కనే బొగ్గు ఓపెన్ కాస్టు మైనింగ్‌కు అనుమతులిస్తున్నది. భూపాలపల్లిలో ప్రస్తుతం ఉన్న బొగ్గు గనుల ప్రాజెక్టు విస్తరణలో భాగంగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రామప్ప ప్రాంతంలోనూ తవ్వకాలకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. భూపాలపల్లిలో ప్రస్తుతం ఉన్న ఓపెన్ కాస్ట్ (కేటీకే 3) నుంచి 13.6 కిలో మీటర్ల దూరంలో వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టును చేపట్టేందుకు సింగరేణి ఏర్పాట్లు చేస్తున్నది. 1,088 ఎకరాల విస్తీర్ణంలో 300 మీటర్ల లోతులో బొగ్గు తవ్వకాలు జరిపేలా సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును రూపొందించింది. ఇక్కడ తవ్విన బొగ్గును మరో 737 ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్ చేయనున్నారు. దీన్ని 120 మీటర్ల ఎత్తులో గుట్టలుగా పోస్తారు. ఇదే జరిగితే ఈ పచ్చని ప్రాంతమంతా కాలుష్యకాసారంగా మారుతుంది. అటవీ ప్రాంతమంతా నల్లటి బూడిద, పొగతో నిండిపోతుంది. సమీపంలోనే ఉన్న రామప్పను బొగ్గు, బూడిద, పొగ ముంచెత్తుతాయి. భక్తులు, పర్యాటకులతో కళకళలాడాల్సిన రామప్ప ప్రాంతం, మట్టికొట్టుకుపోయే ప్రమాదమున్నది. ఓపెన్ కాస్ట్ మైనింగ్ కారణంగా ఇక్కడికి పర్యాటకులు రావాలన్నా ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందని పురావస్తు నిపుణులు చెప్తున్నారు.

ఉమ్మడి పాలనలో నిర్లక్ష్యం.. పరిరక్షణకు కేసీఆర్ కృషి..

రామప్పకు గుర్తింపు విషయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. తెలంగాణ ఏర్పాటుతోనే రామప్పకు గుర్తింపు కోసం అడుగులు పడ్డాయి. ఆలయానికి యునెస్కో గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం 2015 నుంచి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. కేంద్ర పురావస్తు శాఖ పరిధిలో ఉన్న రామప్పకు యునెస్కో గుర్తింపు కోసం చేయాల్సిన పనులపై నిత్యం సంప్రదింపులు జరిపింది. కావాల్సిన నివేదికలను రూపొందిస్తూ వచ్చింది.




కేంద్ర పురావస్తు శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ నివేదికలోని అంశాలతో యునెస్కో స్పందించింది. దీని అనుబంధ సంస్థ అయిన ఇంటర్నేషనల్ కౌన్సెల్ ఆన్ మాన్యుమెంట్ అండ్ సైట్స్ (ఐకోమాస్)తో రామప్పపై అధ్యయనం చేయించింది. వాసుపోశానందన నేతృత్వంలోని ఐకోమాస్ ప్రతినిధి బృందంతో 2019లో రామప్పను సందర్శించింది. రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ హోదా రావడానికి కావాల్సిన అన్ని అర్హతలున్నాయని కితాబునిచ్చారు. ఆ తర్వాత రామప్పకు యునెస్కో గుర్తింపు ప్రక్రియ వేగంగా కదిలింది. ప్రపంచ వారసత్వ నిర్మాణాల గుర్తింపుపై యునెస్కో సమావేశాలు 2020 ఫిబ్రవరిలో చైనాలో జరగాల్సి ఉండగా కరోనా కారణంగా వాయిదా పడ్డాయి. అప్పటి నుంచి రామప్ప గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి నిత్యం విజ్ఞప్తులు వెళ్లాయి. యునెస్కో గుర్తింపు కోసం రామప్పను ప్రతిపాదించాలని 2021 జూన్ 23న రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, వీ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎంపీలు, ఉన్నతాధికారులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి ప్రహ్లాద్ సింగ్ పాటిల్‌ను కోరారు. యునెస్కో సమావేశాలు చైనాలో 2021 జూలై 16 నుంచి మొదలయ్యాయి. వీటికి ముందు దేశం తరపున ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించేందుకు ప్రతిపాదనలను యునెస్కో ఆహ్వానించింది. కేంద్ర ప్రభుత్వం రామప్పను యునెస్కో గుర్తింపు కోసం నామినేట్ చేసింది. సమావేశాల్లో పాల్గొన్న దేశాల ఏకాభిప్రాయంతో రామప్పకు ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు దక్కింది.

మైనింగ్‌కు అనుకూలంగా నివేదికలు

2016లో భూపాలపల్లి జిల్లా భీంగణపురం నుంచి రామప్ప వరకు దేవాదుల నీటిని తరలించేందుకు సొరంగం తవ్వాలని భావించారు. పనుల్లో భాగంగా బ్లాస్టింగ్ చేయాల్సిన అవసరం ఉండటంతో రామప్ప ఆలయానికి ప్రమాదం ఉంటుందన్న కేంద్ర పురావస్తు శాఖ సూచన మేరకు అప్పటి ప్రభుత్వం పైపులైన్ నిర్మాణంతో దేవాదుల పనులు చేసింది. చారిత్రక కట్టడాల సమీపంలో మైనింగ్‌పై కేంద్ర ప్రభుత్వ నిబంధనలు, సుప్రీం కోర్టు మార్గదర్శకాలు ఉన్నాయి. కానీ రామప్ప సమీపంలో మైనింగ్ కోసం రిపోర్టులను అనుకూలంగా తీర్చిదిద్దుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం రామప్ప కట్టడానికి మైనింగ్ ప్రాంతం ఎంత దూరం ఉండాలో అంతే ఉన్నట్టుగా నివేదికలను అధికార వర్గాలు చూపిస్తున్నారని నిపుణులు చెప్తున్నారు. పాలంపేటకు ప్రత్యేక అభివృద్ధి అథారిటీ ఉన్నది. ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(ఈపీటీఆర్ఐ), నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అనుమతులు వచ్చినట్టు సింగరేణి ఉన్నతాధికారులు చెబుతున్నారు. వీటిని ఆధారంగా చూపి జిల్లా స్థాయిలోని మైనింగ్ కమిటీ ఆమోదం కోసం ఒత్తిడి తెస్తున్నారు. రామప్ప సమీపంలో మైనింగ్ అనుమతి కోసం ములుగు కలెక్టర్ ఆధ్వర్యంలో ఇప్పటికే సమావేశం నిర్వహించారు. తర్వాత మీటింగ్‌లో తుదిదశ అనుమతులు ఇచ్చే అవకాశం ఉన్నదని తెలిసింది.

యునెస్కో గుర్తింపునకూ ముప్పు

ప్రపంచవ్యాప్తంగా చారిత్రక కట్టడాల గుర్తింపుతో పాటు అవసరమైన మేరకు పరిరక్షణ చర్యలు చేపట్టపోతే ఆ గుర్తింపును రద్దు చేసేలా యునెస్కో నిబంధనలున్నాయి. రామప్ప ప్రాంతంలో మైనింగ్ జరిగితే భవిష్యత్తులో యునెస్కో తీవ్రమైన నిర్ణయం తీసుకునే ప్రమాదం ఉన్నదని పురావస్తు నిపుణులు ఆందోళన చెందుతున్నారు. రామప్ప ప్రాంతం ఇప్పుడు అడవిని తలపించేలా ఉంటుంది. ఈ ప్రాం తంలో బొగ్గు తవ్వకాలు మొదలైతే చెట్లు, పరిసరాలు, ఆలయ గోడలు దుబ్బ, మసిగొట్టుకుపోతా యి. పర్యాటకులకు బూడిద కుప్పలే దర్శనమిస్తాయి. ఇలాంటి పరిస్థితి వస్తే యునెస్కో మార్గదర్శాల ప్రకారం రామప్ప ప్రాంతం ఉండదు. అప్పుడు రామప్పకు ఉన్న ప్రపంచ స్థాయి గుర్తింపునకే ప్రమాదం ఏర్పడుతుందని పురావస్తు నిపుణులు చెప్తున్నారు.



రాజస్థాన్‌లోని ప్రఖ్యాత చిత్తోడ్‌గఢ్ కోట దగ్గర లైమ్‌స్టోన్ మైనింగ్ విషయంలోనూ రామప్ప తరహా పరిస్థితి వచ్చింది. ఈ చారిత్రక కట్టడం విషయంలో రాజస్థాన్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. కట్టడానికి 10 కిలో మీటర్ల పరిధిలో ఎలాంటి మైనింగ్ చేయవద్దని ఆదేశించింది. ఆ తర్వాత సుప్రీం కోర్టుకు వెళ్లడంతో కట్టడానికి ఐదు కిలో మీటర్ల పరిధిలో ఎలాంటి తవ్వకాలు వద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. అది కోట కాగా ఇది ఆలయం.. పైగా వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా యునెస్కో గుర్తింపు పొందిన కట్టడం.. ఒక కోటకు వర్తించిన సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన చారిత్రక ఆలయానికి వర్తించవా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చూసినా రామప్ప సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల తవ్వకంతో ప్రమాదం పొంచి ఉన్నది. అధికారులు ఉద్దేశపూర్వకంగా మైనింగ్‌కు అనుగుణంగా దూరాన్ని రూపొందిస్తున్నారు. ఎయిర్ రూట్, రోడ్ రూట్‌లో వేర్వేరు దూరాన్ని నమోదు చేస్తున్నారు. మైనింగ్ ప్రాంతం నుంచి రామప్ప ఆలయం 4.5 కిలో మీటర్లే ఉన్నది. అనుమతుల కోసం అధికారులు దీన్ని 5.5 కిలో మీటర్లుగా చూపిస్తున్నారు. అర కిలో మీటరును అనుకూలంగా చేసుకొని రామప్ప వద్ద విధ్వంసం చేసే పనులు చేపట్టడం ఎందుకని చరిత్రకారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పేలుళ్లతో 5 కిలో మీటర్లదాకా ప్రభావం ఉంటుందని పరిశోధన సంస్థలు సైతం తేల్చిచెప్తున్నాయి.

కోర్టు మార్గదర్శకాలు ఇలా..

'రామప్ప'ను వెంటాడుతున్న కాంగ్రెస్!

- నాడు దేవాదుల సొరంగం కోసం పేలుళ్లు
- 'నమస్తే' వరుస కథనాలతో వెనక్కి
- ఇప్పుడు మైనింగ్‌తో మట్టికొట్టే యత్నం


హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): నిరసనలు, తిరుగుబాట్లు, అడ్డగింతలతో దేవాదుల సొరంగాల పేలుళ్ల నుంచి బయటపడిన రామప్పను, ఇప్పుడు మైనింగ్ భూతం వణికిస్తున్నది. నాడు ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టు కోసం ఆలయ సమీపం నుంచి సొరంగం తవ్వేందుకు చేసిన యత్నాలను 'నమస్తే తెలంగాణ' నిలువరించింది. 2011లో పత్రిక ప్రారంభమైన నెల రోజులకే 'రామప్పకు జలయజ్ఞంతో ముప్పు' శీర్షికన ప్రచురించిన కథనం స్ఫూర్తిగా పాలంపేట నుంచి వరంగల్ మీదుగా హైదరాబాద్ దాకా సుదీర్ఘ ఉద్యమమే కొనసాగింది. తెలంగాణ బుద్ధిజీవులు, సాంస్కృతిక, శిల్పకళాకారులు, చరిత్రకారులు, పురాతత్వవేత్తలు, పర్యావరణ వేత్తలు ఏకమై ఉద్యమించారు. సరిగ్గా అలాంటి ఉపద్రవమే మరోటి ముంచుకొచ్చింది. నాడు జలయజ్ఞం రూపం లో.. నేడు ఓపెన్ కాస్టు రూపంలో రామప్పను ప్ర మాదం వెంటాడుతూనే ఉన్నది. అప్పుడూ.. ఇప్పుడూ తెలంగాణ ఆత్మలేని కాంగ్రెస్ సర్కారే పాలనలో ఉండటం గమనార్హం.

అప్పుడేం జరిగిందంటే?

అది 2011. దేవాదుల ప్రాజెక్టు పనులు ఎనిమిది, తొమ్మిదేండ్లుగా సాగుతున్నా ఒక్క ఎకరానికీ నీళ్లివ్వలేదు. దేవాదుల సొరంగం పనుల్లో భారీ పేలుళ్ల వల్ల రామప్ప గుడికి ముప్పు పొంచి ఉన్నదని 'నమస్తే తెలంగాణ' అధ్యయనంలో తేలింది. 'జలయజ్ఞంతో రామప్పకు ముప్పు' 'చారిత్రక వాకిలి పొక్కిలి' అని జూలై 24, 2011న మెయిన్, టాబ్లాయిడ్ మొదటి పేజీల్లో ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ఉద్యమకారుల చేతిలో పాశుపతాస్త్రమైంది. రామప్ప పరిరక్షణ సమితి అనే సంస్థ పురుడు పోసుకునేలా చేసింది.

వరుస కథనాలతో దిగొచ్చిన సర్కార్


నమస్తే తెలంగాణ వరుస కథనాలకు దిగొచ్చిన నాటి పాలకులు ఎన్జీఆర్ఐతో పూర్తి స్థాయి విచారణ చేయించాలని నిర్ణయించారు. ఎన్జీఆర్ఐ మాత్రమే కాకుండా సెంట్రల్ మైన్స్ అండ్ ఫ్యుయెల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఐఎంఎఫ్ఆర్), రాక్ యాక్సిలరేషన్ అండ్ మైనింగ్ ఇంజినీరింగ్ విభాగం, ఐఐటీ హైదరాబాద్, ఎన్ఐటీ వరంగల్, నాగ్‌పూర్ మైనింగ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎస్ఎంఆర్ఐ) లాంటి జాతీయ, అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక పరిశోధనా సంస్థలన్నీ 'నమస్తే తెలంగాణ' కథనాలన్నీ అక్షరసత్యాలని నిగ్గుతేల్చాయి. 'విచారణ పూర్తయి నివేదిక ఇచ్చేంత వరకు పనులు నిలిపివేయండి' అంటూ విధిలేని పరిస్థితుల్లో సర్కారు నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి నెలకొన్నది. ఎన్జీఆర్ఐ దశలవారీగా అధ్యయనం చేసి 2,500 పేజీల నివేదికను ప్రభుత్వానికి అందించింది. దేవాదుల సొరంగంతో 'రామప్ప గుడికి ముప్పే' అని శాస్త్రీయ అధ్యయనాలు తేల్చడంతో నాటి రాష్ట్ర నీటి పారుదల శాఖ సొరంగ మార్గం అలైన్‌మెంట్ మార్చింది.



2012లో ఓపెన్‌కాస్ట్ ప్రయత్నాలు..

2012లోనూ రామప్ప సమీపంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓపెన్ కాస్ట్ మైనింగ్ కోసం ప్రయత్నాలు చేసింది. అప్పట్లో పెద్ద ఎత్తున చరిత్రకారులు, పురావస్తు పరిశోధకుల నుంచి నిరసన వ్యక్తమవడం, ప్రజలు ఆందోళన చేయడంతో వెనక్కి తగ్గింది. ఇప్పుడు కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాగానే మైనింగ్‌నూ వెంటపెట్టుకొచ్చింది.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
మెదక్	38.0°c	22.7°c
రంగారెడ్డి	35.8°c	21.7°c
ఆదిలాబాద్	34.2°c	24.7°c
కరీంనగర్	31.0°c	25.0°c
ఖమ్మం	31.0°c	24.0°c
హైదరాబాద్	30.0°c	22.0°c
వరంగల్	30.0°c	24.0°c
నల్లగొండ	30.0°c	23.0°c
మహబూబ్‌నగర్	29.2°c	22.1°c
నిజామాబాద్	25.4°c	23.7°c

వర్షపాతంలో అసాధారణ పరిస్థితులు

రుతుపవనాల నిష్క్రమణ ఆలస్యంతో వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంలో అల్పపీడనాల సంఖ్య, వాటి తీవ్రత పెరుగుతున్నది. దీంతో తుపాన్లుగా మారి కుంభవృష్టి కురిపించడాన్ని వాతావరణ నిపుణులు అసాధారణమైనదిగా విశ్లేషిస్తున్నారు. వాతావరణ మార్పులు, భూతాపంతో మహాసముద్రాలు వేడెక్కి బీభత్సమైన వర్షాలు కురుస్తున్నాయని పేర్కొంటున్నారు. అందుకు నిదర్శనమే ఈ సంవత్సరం నైరుతి సీజన్ అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జూన్ 28, జూలై 15,19, ఆగస్టు 3,29, సెప్టెంబర్ 5,13,23 తేదీల్లో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడ్డాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాలకు లానినో ప్రభావం తోడవ్వడంతో ఇటీవల విజయవాడ, ఖమ్మం ప్రాంతాల్లో కుంభవృష్టి కురిసింది. ఈసారి రుతుపవనాల నిష్క్రమణ ఆలస్యం కావడంతో రాష్ట్రంలో మరిన్ని వర్షాలు కురిసే అవకాశమున్నట్టు భారత వాతావరణ శాఖ విశ్రాంత డైరెక్టర్ జనరల్ డాక్టర్ కేజే రమేశ్ తెలిపారు.

మరో మూడు రోజులూ భారీ వర్షాలు

రాష్ట్రంలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. వాయవ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం.. పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తున్నదని పేర్కొన్నది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల,కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కామారెడ్డి, వరంగల్, హన్మకొండ, ఖమ్మం, మహబూబాబాద్, జనగామతోపాటు పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. 24గంటల్లో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో అత్యధికంగా 12.03 సెం.మీ వర్షపాతం నమోదైంది.

29 నుంచి భారతీయ కళా మహోత్సవం

28న ప్రారంభించనున్న రాష్ట్రపతి

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో మొదటి భారతీయ కళా మహోత్సవం నిర్వహించనున్నారు. ఈశాన్య ప్రాంత అభివృద్ధి, సాంస్కృతిక మంత్రిత్వశాఖల సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభిస్తారు. కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతోపాటు ఎనిమిది రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు, కేంద్రమంత్రులు హాజరు కానున్నారు. రాష్ట్రపతి నిలయంలో బుధవారం భారతీయ కళా మహోత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు. రాష్ట్రపతి భవన్ ఓఎస్డీ స్వాతిషాహి, సీఈవో రజినీప్రియ, ఎన్ఈహెచ్‌హెచ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్కే సింగ్ మహోత్సవ వివరాలను వెల్లడించారు. ఈ నెల 29 నుంచి అక్టోబర్ 6 వరకు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల మధ్య ప్రజలు ఈ మహోత్సవాన్ని సందర్శించవచ్చని తెలిపారు. జంటనగరాల్లోని వివిధ ప్రాంతాల నుంచి ఉచిత బస్సు సర్వీసులు ఉంటాయని చెప్పారు. https://visit.rashtrapatibhavan.gov.in ద్వారా ఉచితంగా బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఉత్తమ సేవలకు డీజీపీ ప్రశంసలు

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): సిటిజన్ ఫీడ్ బ్యాక్ సెంటర్ నుంచి వచ్చిన పౌరుల అభిప్రాయాల ఆధారంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బుధవారం డీజీపీ డాక్టర్ జితేందర్ ప్రశంసాపత్రాలను అందించారు. 2,116 మంది పౌరుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా టాప్ 10 పోలీస్‌స్టేషన్లు, ఎస్‌హెచ్‌వోలు, టాప్ 5 రిసెప్షన్ ఆఫీసర్లు, టాప్ 5 ఎంక్వైరీ ఆఫీసర్లను సత్కరించారు. క్యూఆర్ కోడ్, ఎస్ఎంఎస్ ఆధారిత ఫీడ్ బ్యాక్ సిస్టమ్ సహా కొత్త సాంకేతికను త్వరలో ప్రవేశపెడతామని చెప్పారు. ఈ వ్యవస్థలు పిటిషనర్లు, బాధితులు సులభంగా అభిప్రాయాన్ని అందించడానికి సహాయపడతాయని తెలిపారు. సమావేశంలో అదనపు డీజీపీ (శాంతి భద్రతలు) మహేశ్ ఎం భగవత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం గారూ నేతన్నలను ఆదుకోండి

- బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ఇవ్వండి
- చేనేత రుణ మాఫీ చేసి ఆదుకోండి
- సర్కారుకు చేనేత కార్మిక సంఘం వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉపాధి కోల్పోయి విలవిల్లాడుతున్న చేనేత కార్మికులకు ఉపాధి చూపి ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేసినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నేతన్నలను పూర్తిగా మరిచిందని పేర్కొన్నారు. గత 2017 నుంచి 2023 వరకు ఎంతో ఆర్థికంగా ఎదిగిన నేతన్నల పొట్టలుగొట్టి, వారి ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం కారణమైందని తెలిపారు. ఈ ఏడాది నుంచి నేతన్నలకు బతుకమ్మ చీరల తయారీ బాధ్యతలను ఇవ్వకపోవడంతో ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితులు దాపురించాయని తెలిపారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేస్తున్నారు. సీఎంకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్న అంశాలు ఇలా ఉన్నాయి.

- నేతన్నకు చేయూత పథకంలో కొందరు వాయిదాలను మధ్యలోనే నిలిపేశారు. అలాంటి వారికోసం కొంత నగదును బ్యాంకుల్లో ప్రభుత్వం జమచేసి న్యాయం చేయాలి.
- చేనేతమిత్ర కింద 40 శాతంతో నూలు సబ్సిడీ, నేరుగా వీవర్‌కు రూ.2,000, వర్కర్‌కు రూ.500 చొప్పున 2023 అక్టోబర్ వరకు గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడమే లేదు. 2023 నవంబర్ నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద బెనిఫిట్స్ ఇవ్వాలి.
- రూ.2 లక్షల వరకు చేనేతల రుణ మాఫీ చేయాలి.
- 80 ఏండ్ల వయసున్న నేతన్నలకు బీమా పథకాన్ని వర్తింపజేయాలి.
- చేనేత కార్మికుల వద్ద నిల్వ ఉన్న వస్త్రాలను నేరుగా సర్కారు కొనుగోలు చేసి, వారిని ఆదుకోవాలి.
- ఇండ్లు లేని నేతన్నలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలి. స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల సాయం అందచేయాలి.

కంటతడి పెట్టించడమే కాంగ్రెస్ మార్పా ?



రైతుల ఇండ్ల మీదికి బ్యాంకర్లు.. పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు

ఇదేనా కాంగ్రెస్ మార్క్ మార్పు • ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీశ్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): రైతులను, పేదలను కంటతడి పెట్టించడమే కాంగ్రెస్ మార్క్ మార్పు? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదల ఇండ్ల మీదికి బుల్డోజర్లు, రైతుల ఇండ్లపైకి బ్యాంకు అధికారులు.. ఇదేనా? 'మార్పు'? అని ప్రశ్నించారు. రైతు రుణమాఫీపై ముఖ్యమంత్రి నిర్వాకానికి మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో రైతుపై బ్యాంక్ అధికారుల దౌర్జన్యమే నిదర్శనమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. రూ.2 లక్షల రుణ మాఫీ పేరిట రేవంత్‌రెడ్డి చేసిన మోసం రైతులపాలిట శాపంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. బ్యాంకు సిబ్బంది రైతుల ఇండ్లపై బడి తలుపులు పీకుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. రైతుపై బ్యాంక్ అధికారుల దౌర్జన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఇంత దిగజారుడు తనమా? ఇంత దౌర్జన్యమా? సీఎం రేవంత్‌రెడ్డి చేసిన నిర్వాకానికి రైతుల పరువు బజారున పడుతున్నదని తెలిపారు.

బీఆర్ఎస్ నేతల ఇండ్లపై దాడులు.. సీఎం మామ ఇంటికి రక్షణ

- దాడుల నిందితులను ఇప్పటికీ అరెస్ట్ చేయని పోలీసులు
- సీఎం మామ పద్మారెడ్డి ఇంటికి 24 గంటల భద్రత
- నెలకు రూ. 5 లక్షలకు ఖర్చవుతుందని అంచనా

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లపై దాడులకు తెగబడుతున్న కాంగ్రెస్ కార్యకర్తల అరెస్ట్ విషయాన్ని పట్టించుకోని పోలీసులు.. సీఎం బంధుగణానికి మాత్రం 24 గంటల భద్రత కల్పించడంలో తలమునకలయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మామ పద్మారెడ్డి ఇంటికి భద్రత ఏర్పాటు చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. జూబ్లీహిల్స్‌లోని పద్మారెడ్డి ఇంటివద్ద ఏర్పాటు చేయాల్సిన భద్రత, అందుకు అధికారికంగా చేయాల్సిన లాంఛనాలను పూర్తి చేసే పనిలో బిజీగా ఉన్నారు. పైనుంచి ఆదేశాలు రాగానే ఆయన ఇంటి వద్ద 24/7 భద్రత ఉండేలా గార్డ్ విజన్ సహా అన్ని ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి. మెన్ అండ్ మెషీన్ సహా అన్ని వివరాలతో కూడిన ఫైల్ ఇప్పటికే డీజీపీకి చేరిందని సమాచారం. ముఖ్యమంత్రి మామ పద్మారెడ్డి ఇంటి భద్రతకు నెలకు రూ. 5 లక్షలు అవుతుందని అంచనా. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లపై వరుసగా దాడులు జరుగుతున్నా కనీస ఏర్పాట్లు చేయని పోలీసు యంత్రాంగం సీఎం మామ ఇంటి విషయంలో మాత్రం చకచకా ఏర్పాట్లు చేస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



మందమర్రిలో ఎస్‌వోటు జీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

లాభాల్లో 33 శాతం వాటా చెల్లించాలి

సీసీసీ నస్పూర్/మందమర్రి/రెబ్బెన, సెప్టెంబర్ 25 : సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో కార్మికులకు 33 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు బుధవారం ఆందోళనలు చేపట్టారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని జీఎం కార్యాలయం వద్ద టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మందమర్రి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎస్‌వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

వేతనాలు ఇప్పించండి మహాప్రభో..

ప్రభుత్వానికి గురుకుల పార్ట్ టైం ఉద్యోగుల మొర

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): 'కుటుంబాలను పోషించుకోలేకపోతున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ పెద్దలు సత్వరమే స్పందించి 4నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలి. మమ్మల్ని ఆదుకోండి మహాప్రభో' అంటూ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పార్ట్ టైం ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదేండ్లపాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం ప్రతినెలా 10వ తేదీ లోపునే వేతనాలు అందించిందని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల హామీలతో ప్రజలను వంచించినట్టే తమను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నదని వాపోతున్నారు. తమకు వేతనాలు ఇవ్వకపోవడమే కాకుండా, విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు, కాంట్రాక్టర్ల బిల్లులను కూడా చెల్లించడం లేదని, దీంతో కాంట్రాక్టర్లు కూరగాయలు, గుడ్లు, ఫుడ్ ప్రొవిజన్స్ ఇవ్వడం లేదని వెల్లడించారు. పాఠశాలలు మూతపడి పేద విద్యార్థులు నష్టపోయే రోజులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులపై కేసు పెట్టండి

- లక్ష ఖర్చయ్యే దాకా తిరుగుతరు
- రుణమాఫీ కోసం నిరసన చేస్తరా?
- కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి ప్రతాపం



రైతులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి

కోదాడ, సెప్టెంబర్ 25: రుణమాఫీకి అర్హులైనప్పటికీ ప్రభుత్వం మాఫీ చెయ్యలేదన్న ఆవేదనతో రైతులు శాంతియుతంగా నిరసనకు దిగితే.. ఓ పోలీస్ అధికారి తన ప్రతాపం చూపారు. 'రైతులందరినీ కస్టడీలోకి తీసుకుని కేసులు పెట్టండి.. లక్ష రూపాయలు ఖర్చయ్యే తిరుగుతరు' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. సూర్యాపేట జిల్లా చిలుకూరుకు చెందిన 42 మంది రైతులు తమకు అన్ని అర్హతలున్నప్పటికీ రుణమాఫీ కాలేదని బుధవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సంఘం కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. అధికారులు ఆన్‌లైన్‌లో తప్పులు చేయడంతో తమకు రుణమాఫీ కాలేదని తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. రుణమాఫీ కాలేదంటే అధికారులకు చెప్పాలే గానీ ఆఫీసుకు తాళం వేస్తారా అంటూ సీరియస్ అయ్యారు. 'రూ.లక్ష రుణ మాఫీ కోసం ఆందోళన చేస్తారా? ఇది ఏం నిరసన? అందరినీ కస్టడీలోకి తీసుకుని కేసులు పెట్టండి. లక్ష రూపాయలు ఖర్చయ్యే తిరుగతరు' అంటూ ఆక్రోశం వెళ్లగక్కారు. తమకు అన్ని అర్హతలున్నా రుణమాఫీ కాలేదన్న ఆవేదనతో నిరసన తెలిపేందుకు వస్తే.. పోలీసులు కేసుల పేరుతో భయపెట్టడం ఎంతవరకు న్యాయమని రైతులు ప్రశ్నిస్తున్నారు.

పెండ్లైన కూతురుకు ఉద్యోగం ఉందని మాఫీ చేయలే

- ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌఠ గ్రామ రైతు ఆవేదన
- రుణమాఫీ అయ్యేలా చూడాలని మాజీ మంత్రి హరీశ్‌కు లేఖ



రాంరెడ్డి, రైతు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): 'నేను ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.1.60 లక్షల పంట రుణం తీసుకున్నా. నా భార్య సవిత పేరిట సహకార బ్యాంకులో రూ.40 వేల అప్పు ఉంది. మాకు మేఘన, సమీరా కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు మేఘనకు 2019లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చింది. 2002లో వివాహం చేసి భర్త ఇంటికి పంపాను. రేషన్‌కార్డులో కూతురు పేరును తీసేయించా. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులో నా పేరుతోపాటు భార్య సవిత, చిన్నమ్మాయి సమీరా పేర్లు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీకి అన్ని విధాలుగా అర్హునిగా ఉన్న నాకు బ్యాంకు లోన్ మాఫీ కాలేదు. అధికారులను అడిగితే మీ కూతురుకు ప్రభుత్వ ఉద్యోగం ఉన్నందు వల్లే రుణమాఫీ కాలేదని చెప్తున్నరు' అని కౌఠకు చెందిన రైతు అల్లూరి రాంరెడ్డి ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. ఈ మేరకు అల్లూరి రాంరెడ్డి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు లేఖ రాసి తనకు రుణమాఫీ జరిగేలా చూడాలంటూ వేడుకున్నాడు. ప్రస్తుత రేషన్‌కార్డులో వివాహం అయిన తన కూతురు పేరు లేకున్నా.. ఉందంటూ అధికారులు రుణమాఫీ చేయలేదని మంత్రికి విన్నవించాడు. తన వంటి సన్నకారు రైతులు రూ.2 లక్షల రుణమాఫీకి నోచుకోవడం లేదని లేఖలో వివరించాడు. రుణమాఫీపై బీఆర్ఎస్ పోరాటం చేయడం మంచి పరిణామమని పేర్కొన్నాడు. తన వంటి సన్నకారు రైతులకు అన్యాయం చేయడం సరికాదంటూ లేఖలో ఆవేదన వ్యక్తంచేశాడు.

రుణమాఫీ చేయాలని బ్యాంకుకు తాళం

సిద్దిపేట జిల్లా తోటపల్లిలో రైతుల నిరసన

బెజ్జంకి, సెప్టెంబర్ 25 : రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిద్దిపేట జిల్లా తోటపల్లిలో ఇండియన్ బ్యాంకుకు రైతులు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ బ్యాంకు బ్రాంచి పరిధిలో 1,407 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. వీరిలో కేవలం 400 మందికి మాత్రమే రుణమాఫీ వర్తించింది. మిగతా వారికి మాఫీ కాకపోవడంతో గత నెల ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వివరాలు పంపామని బ్యాంకు అధికారులు చెప్పినా, ఇప్పటికీ మాఫీ కాకపోవడంతో బుధవారం బ్యాంకుకు తాళం వేసి నిరసన తెలిపారు. అర్హులైన రైతులందరికీ బేషరతుగా రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు బీజేపీ, బీఆర్ఎస్ తదితర పార్టీల నాయకులు మద్దతు తెలపారు.



సిద్దిపేట జిల్లా తోటపల్లిలో ఇండియన్ బ్యాంకుకు తాళం వేసి నిరసన తెలుపుతున్న రైతులు

లంచానికి దసరా డిస్కౌంట్!

- రైస్ మిల్లర్లకు ధాన్యం బిడ్డర్ల ఆఫర్
- మొన్నటివరకు ప్రతి క్వింటాలుపై అదనంగా రూ.230 వసూలు
- ఇప్పుడు రూ.30 తగ్గింపు
- ధాన్యం ఇస్తామన్నా వద్దంటున్న బిడ్డర్లు
- డబ్బులే ఇవ్వాలని డిమాండ్
- మొత్తం డబ్బులు 15 రోజుల్లో వసూలు చేయాలని టార్గెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): షాపింగ్ మాల్స్‌లో కొనుగోలుదారులకు దసరా డిస్కౌంట్లు ఇచ్చినట్టుగా ఇప్పుడు పౌరసరఫరాల శాఖలో ధాన్యం టెండర్లను దక్కించుకున్న బిడ్డర్లు సైతం రైస్ మిల్లర్లకు ఇదే తరహా ఆఫర్ ఇచ్చినట్టు తెలుస్తున్నది. మొన్నటివరకు ప్రతి క్వింటాలు ధాన్యానికి అదనంగా వసూలు చేసిన రూ.230లో ఇప్పుడు రూ.30 తగ్గించినట్టు మిల్లర్లలో జోరుగా చర్చ జరుగుతున్నది. దీంతో అవినీతికి కూడా డిస్కౌంట్ ఇస్తున్నారంటూ ఓ మిల్లర్ వ్యాఖ్యానించారు. ధాన్యాన్ని ఇచ్చేందుకు మిల్లర్లు సిద్ధంగా ఉన్నప్పటికీ బిడ్డర్లు మాత్రం తమకు ధాన్యం వద్దని, డబ్బులే ఇవ్వాలని పట్టుబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



దసరా డిస్కౌంట్ రూ.30

2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యంలో ప్రభుత్వం 35 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలం వేసింది. ఈ ధాన్యాన్ని దక్కించుకున్న బిడ్డర్లు.. మిల్లర్ల నుంచి ధాన్యం తీసుకెళ్లాలి. కానీ, ఇందుకు విరుద్ధంగా ఆ ధాన్యానికి ఎంత విలువ ఉంటే అంత డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు మిల్లర్లు చెప్తున్నారు. తమ వద్ద ఉన్న ధాన్యాన్ని తీసుకెళ్లాలని చెప్తున్నప్పటికీ బిడ్డర్లు మాత్రం సపేమిరా అంటున్నారని మండిపడుతున్నారు. వేలంలో క్వింటాలు ధాన్యం సగటు ధర రూ.2 వేలు పలకడంతో దానికి అదనంగా రూ.230 కలిపి మొత్తం రూ.2,230 చొప్పున చెల్లించాలని బిడ్డర్లు డిమాండ్ చేసినట్టు తెలుస్తున్నది. దీనికి మిల్లర్లు ససేమిరా అనడంతో దసరా ఆఫర్ కింద క్వింటాలుకు రూ.30 చొప్పున తగ్గించి, మిగిలిన మొత్తాన్ని 15 రోజుల్లోగా చెల్లించాలని బిడ్డర్లు గడువు విధించినట్టు సమాచారం. దీనిపై మిల్లర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం ఇస్తామన్నా తీసుకోకుండా అదనంగా డబ్బులు వసూలు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

వసూళ్లకు 15 రోజుల టార్గెట్

టెండర్ ధాన్యానికి బదులుగా అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న విషయం బహిరంగ రహస్యమే. ఇది ఉన్నతాధికారులు తెలియకుండానే జరుగుతున్నదా? లేక వారికి తెలిసినా తెలియనట్టు వ్యవహరిస్తున్నారా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. టెండర్ ధాన్యాన్ని ఎత్తేందుకు బిడ్డర్లకు ఇచ్చిన గడువు ఈ నెల 23తో ముగిసింది. దీంతో ఈ గడువును పొడగించి 15 రోజుల్లో మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. వీలైనంత ఒత్తిడి తీసుకొచ్చి నయానో భయానో వారి నుంచి వసూలు చేసేందుకు బిడ్డర్లు ప్రణాళికలు రూపొందించుకున్నట్టు తెలుస్తున్నది. దీనికి అధికారులు సహకరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీబీఐ తీరుపై కోర్టు ఆగ్రహం

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు విచారణ 4కు వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించి సీబీఐ దాఖలు చేసిన కేసుపై రౌస్ ఎవెన్యూ కోర్టు బుధవారం విచారణ జరిపింది. ప్రతివాదులను వర్చువల్‌గా విచారించింది. ఆ చార్జిషీట్‌లోని కొన్ని పేజీలను తెలుగు నుంచి ఇంగ్లిష్‌లోకి అనువాదించి ఇవ్వాలని గతంలో కోర్టు ఆదేశించినప్పటికీ సీబీఐ అధికారులు మళ్లీ అవే కాపీలను ప్రతివాదులకు పంపడంపై ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతివాదులకు స్పష్టమైన చార్జిషీట్ ప్రతులను అందజేయాలని సీబీఐని ఆదేశించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను అక్టోబర్ 4కు వాయిదా వేశారు.

ఏపీలో ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో 16 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఐడీ ఐజీగా వినీత్ బ్రిజ్ లాల్‌ను, పీ అండ్ ఎల్ ఐజీగా ఎం రవి ప్రకాశ్‌ను, ఇంటెలిజెన్స్ ఐజీగా పీహెచ్ డీ రామకృష్ణను, ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఫకీరప్పను బదిలీ చేశారు. అమ్మిరెడ్డిని డీజీపీ కార్యాలయంలో డీఐజీ అడ్మిన్‌గా, సీహెచ్ విజయరావుకు రోడ్ సేఫ్టీ అథారిటీగా, సిద్ధార్థ్ కౌశల్‌కు శాంతి భద్రతల ఏఐజీగా, మేరీ ప్రశాంతిని విశాఖ శాంతి భద్రతల డీసీపీ-2గా నియమించారు. తుహిన్ సిన్హాను అనకాపల్లి ఎస్పీగా, ఎం దీపికను ఏపీఎస్పీ-3 బెటాలియన్ కమాండెంట్‌గా, జీ రాధికకు ఒంగోలులోని పోలీసు ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఆరిఫ్ హఫీజ్‌కు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డిని పీటీవో ఎస్పీగా నియమించారు. బాపూజీ అట్టాడ, కేవీ శ్రీనివాసరావును పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కే తిరుమలేశ్వర్‌రెడ్డిని ఎన్టీఆర్ కమిషనరేట్‌లో క్రైమ్ డీసీపీగా నియమించారు.

రేప్ కేసులో నటుడి అరెస్ట్

న్యూఢిల్లీ: మహిళా నటిపై లైంగిక దాడి కేసులో మళయాళ నటుడు, ఎడవెల బాబును సిట్ పోలీసులు అరెస్ట్ చేశారు. 'అమ్మ'లో సభ్యత్వం నిమిత్తం దరఖాస్తు నింపేందుకు బాబు నివాసానికి వెళ్లినప్పుడు అఘాయిత్యానికి పాల్పడినట్టు బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నటుడిని అరెస్ట్ చేశారు.

బలవంతంగా 'డబుల్' ఇండ్లు ఖాళీ

- పెట్రోల్ పోసుకుని లబ్ధిదారుల ఆత్మహత్యాయత్నం
- జనగామ జిల్లా పాలకుర్తి మండలంలో ఘటన



జనగామ జిల్లా పాలకుర్తి మండలం ఎల్లరాయిని తొర్రూరు జే గ్రామంలో డబుల్ బెడ్రూం ఇండ్లను ఖాళీ చేయిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 25: జనగామ జిల్లా పాలకుర్తి మండలం ఎల్లరాయినితొర్రూరు జే గ్రామంలో బుధవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు డబుల్ బెడ్రూం ఇండ్ల నుంచి లబ్ధిదారులను బలవంతంగా ఖాళీ చేయించారు. దీంతో పసులాది ఆంజమ్మ, జోగు ఇందిర, గడ్డం భూలక్ష్మి పెట్రోల్ పోసుకుని తగలబెట్టుకునే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం పేదల కోసం 20 డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరు చేసింది. పూర్తయిన వాటికి రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. పట్టా సర్టిఫికెట్లు మాత్రం ఇవ్వలేదు. అధికారులకు సమాచారమివ్వకుండానే 10 నెలల క్రితం గృహప్రవేశాలు చేశారు. బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సైలు సాయిప్రసన్నకుమార్, సృజన్‌కుమార్, యాకూబ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో గృహాలను ఖాళీ చేయించారు. దీంతో కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతోనే అధికారులు ఇండ్లు ఖాళీ చేయించారని లబ్ధిదారులు మండిపడ్డారు. అక్రమంగా డబుల్ బెడ్రూం ఇండ్లలోకి ప్రవేశిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో డీఎస్ వెంకన్న హెచ్చరించారు. త్వరలో గ్రామ సభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పారు.

కాంగ్రెస్ నాయకుల కుట్రలతోనే..



కాంగ్రెస్ నాయకుల కుట్రలతోనే మా ఇండ్లను ఖాళీ చేయించిన్రు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేదల కోసం కట్టించి ఇచ్చిన ఇండ్లు ఇవి. గ్రామసభలో మమ్మల్ని ఎంపిక చేసిన్రు. అధికారులు కావాలనే మమ్మల్ని ఖాళీ చేయించిన్రు. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, హనుమండ్ల ఝాన్సీరెడ్డిలకు మా పేదల ఉసురుతగులుతది.

-పసులాది అంజమ్మ, లబ్ధిదారురాలు

బస్సు కిందపడి పారిశుద్ధ్య కార్మికురాలి మృతి

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 25: డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడి జీహెచ్ఎంసీలో పారిశుద్ధ్య కార్మికురాలు మృతి చెందింది. ఈ ఘటన బుధవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్టులో చోటుచేసుకున్నది. గుంతపల్లికి చెందిన బరిగల రాములమ్మ (67) జీహెచ్ఎంసీలో కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నది. విధులు పూర్తయిన అనంతరం అబ్దుల్లాపూర్‌మెట్టులో పూలు విక్రయిస్తుంటుంది. బుధవారం మధ్యాహ్నం పూలు విక్రయించి గుంతపల్లికి వెళ్లేందుకు అబ్దుల్లాపూర్‌మెట్టులో బస్సు ఎక్కుతుండగా.. డ్రైవర్ ముందుకు కదిలించాడు. దీంతో రాములమ్మ రెండు కాళ్ల పైనుంచి టైరు వెళ్లింది. తీవ్రంగా గాయపడిన ఆమెను కామినేని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

రెచ్చిపోయిన కుక్కలు

ఆరుగురికి గాయాలు

కామారెడ్డి, సెప్టెంబర్ 25: కామారెడ్డి జిల్లా కేంద్రంలో వీధికుక్కలు బుధవారం నడుచుకుంటూ వెళ్తున్న ఆరుగురిని గాయపరిచాయి. వీరిలో సత్తెవ్వ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. రాజమణి, కళావతితోపాటు మరో ముగ్గురుని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు.



చిరుతపులి చర్మాన్ని చూపిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ, అటవీ శాఖాధికారులు

చిరుతపులి చర్మం స్వాధీనం

- తెలంగాణలో విక్రయించేందుకు ఛత్తీస్‌గఢ్ నుంచి తరలింపు
- మీడియాకు వివరాలు వెల్లడించిన ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం, సెప్టెంబర్ 25: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి చిరుతపులి చర్మాన్ని తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు, అటవీ శాఖ అధికారులు పట్టుకున్నట్టు ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. వెంకటాపురం సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్, వాజేడు ఎఫ్ఆర్‌వో చంద్రమొగిలి సిబ్బందితో కలిసి తాను చంద్రుపట్ల క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై చిరుతపులి చర్మాన్ని తరలిస్తూ పట్టుబడ్డాడు. దానిని పరిశీలించి చిరుతపులి చర్మమేనని ఎఫ్ఆర్‌వో చంద్రమొగిలి ధ్రువీకరించారు. దీంతో నిందితుడిని ప్రశ్నించగా ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణలో విక్రయించేందుకు వస్తున్నట్టు అంగీకరించాడు. నిందితుడు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాకు చెందిన భూపాలపట్నం తాలుకా ఊళ్లురా గ్రామానికి చెందిన జాడి మహేందర్‌గా గుర్తించినట్టు చెప్పారు. మహేందర్ వద్ద పులి చర్మంతోపాటు మొబైల్ ఫోన్, రిజిస్ట్రేషన్ లేని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

మూడు గంటల కరెంట్ కట్

ప్రభుత్వ కార్యాలయాల్లో నిలిచిన సేవలు-ఇబ్బంది పడిన ప్రజలు



కరెంట్ లేక ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న అధికారులు

కమలాపూర్, సెప్టెంబర్ 25: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో సుమారు మూడు గంటలు కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బుధవారం మధ్యాహ్నం 12.30 నుంచి 2.40 గంటల వరకు కరెంటు లేకపోవడంతో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, బ్యాంకుల్లో సేవలు నిలిచిపోవడంతో ప్రజలు, ఖాతాదారులు అసహనం వ్యక్తం చేశారు. తహసీల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తు ఇచ్చేందుకు వచ్చిన లబ్ధిదారులు నిరీక్షించాల్సి వచ్చింది. గంటల తరబడి కరెంట్ సరఫరా నిలిపివేస్తుండటంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పనులు కాక తిరిగి ఇంటిబాట పడుతున్నారు. ఈ విషయమై కమలాపూర్ ట్రాన్స్‌కో ఏఈని వివరణ కోరగా బస్టాండ్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ ఏ-బీ స్విచ్ చెడిపోయినందున విద్యుత్తు సరఫరా నిలిపివేసినట్టు తెలిపారు.

• **కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా**



ప్రమాదబీమా కల్పించాలని, పీఆర్సీ, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల కార్మికులు ధర్నా చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. – సిరిసిల్ల కలెక్టరేట్

• **దొరికినన్ని చేపలు..**



వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం తోమాలపల్లె సమీపంలో జాతీయ రహదారిపై చేపల లోడ్‌తో వెళ్తున్న వాహనం బోల్తాపడింది. దీంతో చేపలన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడగా స్థానికులు దొరికిన కాడికి ఎత్తుకెళ్లారు. దాదాపు 1,100 కిలోల చేపలు ఎత్తుకెళ్లడంతోరూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్టు డ్రైవర్ లీలామోహన్‌రెడ్డి తెలిపారు. – పెబ్బేరు



ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో పసిడి పతకాలు సాధించిన చెస్ ప్లేయర్లను బుధవారం న్యూఢిల్లీలో అభినందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ. ఈ సందర్భంగా అర్జున్, ప్రజ్ఞానంద మధ్య చెస్ పోరును మోదీ ఆస్వాదించారు.

ఒలింపియాడ్ విజేతలకు భారీ నజరానా

రూ.3.2 కోట్లు ప్రకటించిన ఏఐసీఎఫ్

ఢిల్లీ: నాలుగు రోజుల క్రితం బుడాపెస్ట్ (హంగేరి) వేదికగా ముగిసిన ప్రతిష్ఠాత్మక 45వ చెస్ ఒలింపియాడ్ ఓపెన్, మహిళల విభాగాల్లో స్వర్ణాలు గెలిచిన భారత బృందానికి ఆలిండియా చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) రూ.3.2 కోట్ల భారీ నజరానా ప్రకటించింది. 97 ఏండ్ల చెస్ ఒలింపియాడ్ చరిత్రలో చారిత్రక విజయం సాధించిన భారత చదరంగ వీరులకు సన్మానం సందర్భంగా ఏఐసీఎఫ్ అధ్యక్షుడు నితిన్ నారంగ్ నగదు బహుమతి ప్రకటన చేశారు. ఆటగాళ్లకు రూ. 25 లక్షలు, పురుషుల, మహిళల జట్టు కోచ్‌లు అయిన అభిజిత్ కుంటె, శ్రీనాథ్ నారాయణన్‌కు తలా రూ.15 లక్షలు పంచనుండగా భారత బృందానికి చీఫ్‌గా వ్యవహరించిన దివ్యేందు బరువకు రూ.10 లక్షలు, అసిస్టెంట్ కోచ్‌లలో ఒక్కొక్కరికి రూ. 7.5 లక్షలు అందనున్నాయి. ఈ సందర్భంగా నితిన్ నారంగ్ మాట్లాడుతూ.. 'చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణాలు నెగ్గాలన్న మన కోరిక నెరవేరింది. కానీ ఈ విజయయాత్ర మాత్రం కొనసాగుతుంది' అని అన్నారు.

అందరూ అడుగుతున్నారనే..

ట్రోలర్స్‌కు మను భాకర్ స్ట్రాంగ్ కౌంటర్



ఢిల్లీ: ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో భాగంగా షూటింగ్‌లో రెండు కాంస్య పతకాలు సాధించిన యువ షూటర్ మను భాకర్ సోషల్ మీడియాలో తనపై వస్తున్న ట్రోలింగ్‌కు ఘాటుగా స్పందించింది. స్వతంత్ర భారత చరిత్రలో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించిన మను.. ఏదైనా కార్యక్రమాలకు వెళ్లినప్పుడు తనకు వచ్చిన రెండు పతకాలను చూపించడంపై సోషల్ మీడియాలో పలువురు దీనిని తప్పుబడుతున్నారు. దీనిపై మను ఓ జాతీయ చానెల్‌తో మాట్లాడుతూ.. 'నేను తీసుకెళ్తా! ఎందుకు తీసుకెళ్లకూడదు? ఆ పతకాలను చూడాలని అందరికీ ఆసక్తిగా ఉంటుంది. నన్ను కార్యక్రమాలకు ఆహ్వానించే నిర్వాహకులు సైతం వాటిని తీసుకురావాలని అడుగుతున్నారు. నేను వాటిని తీసుకెళ్లినప్పుడు అక్కడ వాళ్లు ఫొటోలు తీసుకుని తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు' అని తెలిపింది. ఇదే విషయమై ఆమె ఎక్స్‌లో స్పందిస్తూ.. 'నేను సాధించిన ఈ పతకాలు దేశానికి చెందినవి. వీటిని ధరిస్తున్నందుకు నేను గర్విస్తున్నా' అని రాసుకొచ్చింది.

మెరిసిన శ్రీకాంత్

మకావు: సుమారు నాలుగు నెలల విరామం తర్వాత రాకెట్ పట్టిన భారత స్టార్ షట్లర్ శ్రీకాంత్ మకావు ఓపెన్‌లో మెరిశాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్.. 21–14, 21–15తో డేనిల్ డుబొవెంకో (ఇజ్రాయెల్)ను వరుస సెట్లలో చిత్తు చేసి రెండో రౌండ్‌కు అర్హత సాధించాడు. రెండో రౌండ్‌లో అతడు భారత్‌కే చెందిన అయూష్‌తో తలపడనున్నాడు.

వినేశ్‌కు నాడా నోటీసులు

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(నాడా) బుధవారం నోటీసులు జారీ చేసింది. తాను ఎక్కడ ఉంటుందన్న విషయంలో సరైన స్పష్టత లేని కారణంగా నోటీసులు ఇచ్చిన నాడా 14రోజుల్లోగా వివరణ ఇవ్వాలని పేర్కొంది. నాడాకు చెందిన ప్రత్యేక టూల్‌లో ప్లేయర్లు తమ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విషయంలో వినేశ్ విఫలం నోటీసులకు దారితీసింది.

వరల్డ్ స్నూకర్ చాంప్ కమల్



ఉలన్‌బాతర్(మంగోలియా): ప్రతిష్ఠాత్మక ఐబీఎస్‌ఎఫ్ ప్రపంచ 6-రెడ్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత వెటరన్ క్యూయిస్టు కమల్ చావ్లా విజేతగా నిలిచాడు. బుధవారం జరిగిన ఫైనల్లో కమల్ 6–2 తేడాతో అస్జద్ ఇక్బాల్(పాకిస్థాన్)పై అద్భుత విజ యం సాధించాడు. 2017లో ఇదే టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన 45 ఏండ్ల చావ్లా తొలిసారి టైటిల్ సొంతం చేసుకున్నాడు. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన తుదిపోరులో కమల్..తొలుత రెండు ఫ్రేములు చేజార్చుకున్నా పుంజుకుని విజయం సాధించాడు. ఇదే టోర్నీలో మల్కీత్ సింగ్ విద్యాపిళ్లై, కీర్తన పాండియాన్ కాంస్య పతకాలు దక్కించుకున్నారు.



ఇంగ్లండ్ సిరీస్ ఆశలు సజీవం

చెస్టర్ లీ స్ట్రీట్: స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా మంగళవారం ముగిసిన మూడో వన్డేలో ఇంగ్లండ్ 46 పరుగుల తేడాతో గెలిచింది. వర్షం కారణంగా డక్‌వర్త్ లూయిస్ విధానంలో ఇంగ్లండ్ విజేతగా నిలిచి సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్.. నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 304 పరుగులు చేసింది. అలెక్స్ కేరీ (77), స్టీవ్ స్మిత్ (60) రాణించారు. అనంతరం ఇంగ్లండ్ 37.4 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. ఇంగ్లండ్ సారథి హ్యారీ బ్రూక్ (110 నాటౌట్), విల్ జాక్స్ (84) అదరగొట్టారు. వర్షం వచ్చే సమయానికి ఇంగ్లండ్ సాధించాల్సిన దానికంటే 46 పరుగులు ఎక్కువగా ఉండటంతో మ్యాచ్ ఆ జట్టు వశమైంది. సిరీస్‌లో నాలుగో వన్డే ఈనెల 27న లండన్ వేదికగా జరుగనుంది.

మౌంట్ గోరిచెన్‌పై యశ్వంత్

సత్తాచాటిన మానుకోట యువకుడు



మరిపెడ, సెప్టెంబర్ 25: తెలంగాణ యువ పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ మరోమారు సత్తాచాటాడు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలమని చేతల్లో చూపెడుతూ మరోమారు పర్వతంపై మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించాడు. తాజాగా అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రతిష్ఠాత్మక మౌంట్ గోరిచెన్ శిఖరాన్ని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన యశ్వంత్ అధిరోహించాడు. ఇప్పటికే యువ పర్వతారోహకుడిగా గుర్తింపు సాధించిన యశ్వంత్.. గోరిచెన్ శిఖరాన్ని అధిరోహించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సాధించాడు. ఈ పర్వతారోహణను ఈనెల 4న ప్రారంభించి 19 తేదీ వరకు పూర్తి చేసాడు. గతంలో ఈ కుర్రాడు.. దక్షిణాఫ్రికాలోని మౌంట్ కిలిమంజారో, యూరప్‌కు చెందిన మౌంట్ ఎల్‌బ్రస్ తదితర పర్వతాలు ఎక్కాడు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా యశ్వంత్ ధీమా వ్యక్తం చేశాడు. ఇదిలా ఉంటే బుధవారం అసోం రాజ్‌భవన్‌లో గవర్నర్ లక్ష్మణప్రసాద్ ఆచార్యను యశ్వంత్ మర్యాదపూర్వకంగా కలిసి పూలబోకే అందించాడు. భవిష్యత్‌లోనూ ఇలానే మరిన్ని పర్వతాలు అధిరోహించాలని గవర్నర్ ఆకాంక్షించినట్లు తెలిపాడు.

బ్యాటర్లకు పండగేనా?

చెన్నై పిచ్‌కు భిన్నంగా కాన్పూర్

ఐదు రోజులు సాగుతుందన్న క్యూరేటర్ • ప్రాక్టీస్‌లో చెమటోడ్చిన భారత క్రికెటర్లు



కాన్పూర్: భారత్, బంగ్లాదేశ్ మధ్య శుక్రవారం నుంచి కాన్పూర్‌లోని గ్రీన్‌పార్క్ స్టేడియం వేదికగా మొదలుకాబోయే టెస్టు తొలి మ్యాచ్‌కు పూర్తి భిన్నంగా సాగనుందా? గతంలో ఎప్పుడూ చూడని విధంగా పేసర్లకు అనుకూలించిన చెపాక్ లాగా కాన్పూర్ పిచ్ ఉండనుందా? అంటే అవుననే అంటున్నాడు పిచ్ క్యూరేటర్ శివ్ కుమార్. కాన్పూర్‌లో సంప్రదాయ నల్లమట్టి పిచ్ బ్యాటర్లతో పాటు స్పిన్నర్లకూ స్వర్గధామంగా ఉంటుందని, ఇక్కడ ఐదు రోజులు మ్యాచ్ జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశాడు. కాన్పూర్‌కు సమీపంలో ఉన్నావో పట్టణానికి ఆనుకుని ఉన్న కాళిమిట్టి చెరువు నుంచి తీసిన మట్టితో పిచ్‌ను రూపొందించినట్టు ఆయన తెలిపాడు. ఆట ఆరంభమయ్యాక రెండు సెషన్ల పాటు బంతి సీమర్లకు అనుకూలిస్తుందని, కానీ ఆ తర్వాత బ్యాటర్లు కుదురుకుంటే భారీ స్కోర్లు చేయొచ్చునని అంచనా వేశాడు. ఇక చివరి మూడు రోజులలో స్పిన్నర్లు ఆధిపత్యం చెలాయించే అవకాశం ఉంటుందని చెప్పాడు.

ప్రాక్టీస్ ప్రాక్టీస్

రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా చెన్నై టెస్టు గెలిచి సిరీస్‌లో 1–0 ఆధిక్యం సంపాదించిన భారత్.. కాన్పూర్‌లోనూ అదే ఫలితాన్ని రిపీట్ చేసేందుకు చెమటోడుస్తోంది. మంగళవారం సాయంత్రమే కాన్పూర్ చేరుకున్న భారత జట్టు.. బుధవారం హెడ్‌కోచ్ గౌతం గంభీర్ ఆధ్వర్యంలో ప్రాక్టీస్ చేసింది. తొలి టెస్టులో దారుణంగా విఫలమైన కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ నెట్స్‌లో శ్రమించారు. బ్యాటింగ్ ప్రాక్టీస్‌తో పాటు క్యాచ్‌లు ప్రాక్టీస్ చేశారు. శుక్రవారం నుంచి మ్యాచ్ మొదలవుతున్న నేపథ్యంలో పిచ్ ఎలా స్పందిస్తునే దానిపై ఉత్కంఠ నెలకొంది.

'గ్రీన్' మ్యాచ్

మ్యాచ్ జరుగనున్న గ్రీన్ పార్క్ స్టేడియంలో పర్యావరణహితంగా నిర్వహించేందుకు ఉత్తరప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (యూపీసీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. స్టేడియంలో ప్లాస్టిక్ ప్లేట్స్, బాటిల్స్ వినియోగం తగ్గించి పేపర్ ప్లేట్స్‌ను ప్రోత్సహించనున్నట్టు యూపీసీఏ తెలిపింది.

టాప్-10లోకి పంత్

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా యువ క్రికెటర్ రిషబ్ పంత్ టాప్–10లోకి దూసుకొచ్చాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో పంత్ 731 పాయింట్లతో ఆరో ర్యాంక్‌కు చేరుకున్నాడు. చెన్నైలో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో సూపర్ సెంచరీతో చెలరేగిన పంత్..తన ర్యాంకింగ్‌ను మెరుగుపర్చుకున్నాడు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (751) ఐదో ర్యాంక్‌లో నిలిచాడు. మరోవైపు కెప్టెన్ రోహిత్‌శర్మ(716) ఐదు ర్యాంక్‌లు చేజార్చుకుని పదో ర్యాంక్‌కు పడిపోయాడు. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ (709)..ఐదు స్థానాలు చేజార్చుకుని 12వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. చెన్నై టెస్టులో అదరగొట్టిన అశ్విన్(871), బుమ్రా(854) వరుసగా టాప్–2లో ఉన్నారు.

ఒకే ఇన్నింగ్స్‌లో 498 పరుగులు

గుజరాత్ కుర్రాడి మారథాన్ ఇన్నింగ్స్



అహ్మదాబాద్: గుజరాత్ యువ క్రికెటర్ ద్రోణ దేశాయ్ ఒక ఇన్నింగ్స్‌లో 498 పరుగులు చేసి రికార్డులు బద్దలుకొట్టాడు. గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ క్రికెట్ అహ్మదాబాద్ నిర్వహించిన 'దివాన్ బల్లుభాయ్ కప్ అండర్–19 టోర్నీ'లో సెయింట్ జేవియర్స్ స్కూల్ తరఫున ప్రాతినిధ్యం వహించిన ద్రోణ మారథాన్ ఇన్నింగ్స్ ఆడాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఏకంగా 86 బౌండరీలు, ఏడు భారీ సిక్సర్లున్నాయి. ద్రోణ రికార్డు స్కోరుతో సెయింట్ జేవియర్స్ ప్రత్యర్థి జేఎల్ ఇంగ్లీష్ స్కూల్‌పై ఏకంగా 712 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. ఇక రికార్డు స్కోరుతో ద్రోణ పేరు రికార్డు పుటల్లోకెక్కింది. అండర్–19 క్రికెటర్ల (భారత్)లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన వారి జాబితాలో అతడు ఆరో స్థానంలో నిలిచాడు. ప్రణవ్ ధనవడె (1009), పృథ్వీ షా (546), హవెవాలా (515), చమన్‌లాల్ (506) అర్మన్ జాఫర్ (498) ద్రోణ కంటే ముందున్నారు.




170 సర్వే నంబర్ అసైన్డ్ భూమిలో నిర్మించిన గదిని ట్రాక్టర్‌తో కూల్చివేస్తున్న అధికారులు

సామాన్యుడికో నీతి.. కాంగ్రెస్ నేతకో రీతి

- సామాన్యులది అక్రమ నిర్మాణమని కూల్చివేత
- అధికార పార్టీ నేత నిర్మాణంపై కన్నెత్తి చూడని అధికారులు?

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 25: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 'సామాన్యుడికో నీతి.. కాంగ్రెస్ నేతకో రీతి' అన్న చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణమని ఒకరిది కూల్చేసిన అధికారులు అధికార పార్టీ నేత నిర్మాణం జోలికి వెళ్లడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. భూపాలపల్లి పట్టణంలోని జాతీయ రహదారికి పక్కనే గల 170 సర్వే నంబర్‌లో కొంతమంది అసైన్డ్ భూమిలో అక్రమంగా రేకుల షెడ్ నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అక్కడికి వచ్చి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని కూల్చివేశారు. 1975లోనే అప్పటి ప్రభుత్వం తమకు పట్టా పాస్ బుక్ ఇచ్చిందని, ఇప్పటి సర్కారు దళితుల భూములను బలవంతంగా గుంజుకునే ప్రయత్నం చేస్తున్నదని షెడ్డు నిర్మించిన వ్యక్తి మోరె వెంకటయ్య వాపోయాడు. అదే 170 సర్వే నంబర్‌లో 20 గుంటల అసైన్డ్ భూమిలో ఓ అధికార పార్టీ నేత పాగావేసి ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అందులో దర్జాగా రేకుల షెడ్లు నిర్మించాడు. దళితుల నిర్మాణాలు అక్రమమైనప్పుడు, అధికార కాంగ్రెస్ నేత వేసిన రేకుల షెడ్లు అక్రమ నిర్మాణం కాదా ? అనే సందేహాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. 170 సర్వే నంబర్‌లో గల అసైన్డ్ భూమిలోని అక్రమ నిర్మాణాన్ని తొలగించామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మరో అక్రమ నిర్మాణంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



అదే సర్వే నంబర్‌లో అధికార కాంగ్రెస్ నేత నిర్మించిన రేకుల షెడ్లు

70 ఇండ్ల కూల్చివేతకు నోటీసులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 25 : మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో చెరువులు, కుంటలు, నాలాలు, ఆయకట్టు ప్రాంతాల్లో ఇండ్లను నిర్మించుకున్న 70మందికి నోటీసులు జారీ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశాల మేరకు మున్సిపాలిటీ, నీటిపారుదలశాఖ అధికారులు సంయుక్తంగా చేపట్టిన సర్వే ఆధారంగా నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండే ఇండ్లకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ఇండ్ల యజమానులు ఇంటి నిర్మాణాలకు సంబంధించి నీటిపారుదల శాఖ ఇచ్చిన ఎన్‌వోసీ, మున్సిపల్ అనుమతుల డాక్యుమెంట్లు వారం రోజుల్లో సమర్పించాలని కోరినట్టు వెల్లడించారు.

బ్రాహ్మణ సంక్షేమం ఉన్నట్టా.. లేనట్టా?

సర్కార్‌కు కేవీ రమణాచారి సూటి ప్రశ్న • పరిషత్తును పునరుద్ధరించాలని సీఎంకు విజ్ఞప్తి



హైదరాబాద్, సెప్టెంబర్ 25(నమస్తే తెలంగాణ): పేద బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటైన తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు కార్యకలాపాలన్నీ స్తంభించిపోయి 'సంక్షోభ పరిషత్తు'గా మారిపోయిందని పరిషత్తు పూర్వ అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి ఆవేదన వ్యక్తంచేశారు. అసలు పరిషత్తు ఉన్నట్టా? లేనట్టా అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం పరిషత్తును పునరుద్ధరించి సంక్షోభాన్ని నివారించాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే కనీసం రూ.30 కోట్లు విడుదల చేస్తే లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు వీలు కలుగుతుందని సూచించారు. సభ్య కార్యదర్శికి నిధులు విడుదల చేసే అధికారం లేనందున ఆ అధికారం తాత్కాలికంగా దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శికి అప్పగించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తిచేశారు. పరిషత్తు సమస్యలపై బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు ఇప్పటికే దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని వాపోయారు. వివేకానంద విదేశీ విద్యాపథకం కింద 300 మంది విద్యార్థులు విదేశీ విద్యాసంస్థల్లో చేరగా, వారికి ఇంతవరకూ నిధులు విడుదల చేయలేదని, దీంతో వారు అక్కడ అవస్థలు పడుతున్నారని వివరించారు. వారి తల్లిదండ్రులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, ప్రభుత్వం వారి ఆవేదనను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు. నిరుద్యోగుల స్వయం ఉపాధికి ఉద్దేశించిన 'బెస్ట్' పథకం, పేద విద్యార్థుల ఉపకార వేతనాలను అందించే శ్రీరామానుజ పథకం, వేద పాఠశాలల అభివృద్ధి, వేదవిద్యను అభ్యసించే విద్యార్థులు, వేద శాస్త్ర పండితులు తదితరులకు అందించే ఆర్థిక సహాయం కూడా పూర్తిగా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. కొత్త దరఖాస్తులు ఆహ్వానించడంలేదని, ఇదివరకే దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూలు నిర్వహించడం లేదని, బ్రాహ్మణ పరిషత్తులో నిధులు లేక చిన్నాచితకా పనులు కూడా జరగడంలేదని తెలిపారు. కార్యాలయంలో నిర్వహణ పనులు చేసే చిన్నచిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో నిర్వహణ పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం బ్రాహ్మణ పరిషత్తు ద్వారా వివిధ పథకాల అమలు కోసం ఏటా రూ.100 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు.

వినాయక చవితి @ 1,360 కోట్లు!

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా బొజ్జ గణపయ్య పండుగ అంబరాన్ని తాకింది. మార్కెట్ కళకళలాడింది. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు వేల మందికి ఉపాధి లభించింది. విగ్రహాల తయారీ, మండపాలు, అలంకరణ ఇలా ప్రతి పనిలోనూ ఉపాధి దొరికింది. ఇదే సమయంలో మార్కెట్‌లో వ్యాపారం కూడా బాగా జరిగింది. ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి కమిటీలు ఖర్చుకు వెనుకాడలేదు. విగ్రహాల కొనుగోలు మొదలు మండపాల అలంకరణ, డీజేలు, బ్యాండ్ మేళాలు, అన్నదానాలు, శోభాయాత్రలో ప్రత్యేకత చాటేందుకు బాగానే ఖర్చు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.36 లక్షల విగ్రహాలను నిమజ్జనం చేసినట్టు డీజీపీ జితేందర్ చెప్పారు. ఈ లెక్కనా సగటున ఒక్కో మండపానికి కనీస ఖర్చు రూ.1 లక్షగా అంచనా వేసినా రూ.1,360 కోట్లు ఖర్చు అయినట్టే.

సామూహిక సెలవుల్లో నల్లగొండ 'పంచాయతీ'లు

- నిధుల లేమి.. పని ఒత్తిడిని వ్యతిరేకిస్తున్న కార్యదర్శులు
- ఇతర విభాగాల పెత్తనాలపై ఎంపీవోల నిరసనలు
- అకారణ సస్పెన్షన్లను తప్పుపడుతున్న ఎంపీడీవోలు



తిప్పర్తి 'ఎంపీడీవో' సూపరింటెండెంట్‌కు సామూహిక సెలవు పత్రాన్ని ఇస్తున్న జీపీఎస్‌లు

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ)/నీలగిరి: నల్లగొండ జిల్లాలో క్షేత్రస్థాయి పాలన వ్యవహారాల్లో కీలకమైన గ్రామ, మండల పరిషత్ విభాగం అధికారులు బుధవారం నుంచి సామూహికంగా సెలవుల్లోకి వెళ్లారు. 9 నెలలుగా నిధులు రాకున్నా.. సొంత ఖర్చులతో విధులు నిర్వర్తిస్తున్నా జిల్లా ఉన్నతాధికారులు తమ పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అందుకు సంబంధించి ఆయా సంఘాల జేఏసీల ఆధ్వర్యంలో వేర్వురుగా జాయింట్ కలెక్టర్‌కు సామూహిక సెలవుల వినతిపత్రాలను అందజేశారు. సమస్యలు పరిష్కరించే వరకు విధులకు వెళ్లబోమని పంచాయతీ కార్యదర్శుల జేఏసీ స్పష్టంచేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రత్యేకాధికారుల పాలన మొదలైనప్పటి నుంచి గ్రామపంచాయతీలకు నిధులు రాలేదని, అయినా.. అప్పులు చేసి తాగునీటితో పాటు పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ చేపడుతున్నామని పేర్కొన్నారు. తమకు రావాల్సిన డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అకారణంగా సస్పెండ్ చేసిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సామూహిక సెలవుల్లో వెళ్తున్నట్టు అన్ని మండలాల్లో ఎంపీడీవోలకు కార్యదర్శుల జేఏసీ లేఖలను అందజేసింది. ఇదే సమయంలో ఉన్నతాధికారులు వివిధ రకాలుగా ఒత్తిళ్లకు గురిచేస్తున్నారంటూ మండల పంచాయతీ అధికారులు సామూహిక సెలవు పెట్టారు. ఎంపీడీవో సంఘం ఆధ్వర్యంలోనూ సామూహిక సెలవు కోరుతూ కలెక్టర్‌కు లేఖ పంపించారు. దాంతో జిల్లా వ్యాప్తంగా పాలన ఆగిపోయినట్టు అయ్యింది. అప్పటికే ప్రభుత్వ ఆదేశాలతో బుధవారం నుంచి కలెక్టర్ నారాయణరెడ్డి మూడు రోజులపాటు మహారాష్ట్ర పర్యటనకు వెళ్లడం గమనార్హం. దీంతో సామూహిక సెలవులు పెట్టిన పంచాయతీ విభాగం అధికారులతో సంప్రదింపులు జరిపేది ఎవరు? పరిష్కారం చూపేది ఎవరనేది సస్పెన్స్‌గా మారింది.

సింగరేణి భాగస్వామ్యాన్ని ఒప్పకోం

- జెన్‌కో ద్వారానే రామగుండం ప్లాంట్ నిర్మించాలి: టీఎస్‌పీఈ జేఏసీ

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యాన్ని తాము అస్సలు ఒప్పుకోబోమని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ప్రకటించింది. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా దశలవారీగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతామని వివరించింది. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 3 వరకు జెన్‌కో సహా అన్ని విద్యుత్తు ఉత్పత్తి సంస్థల్లో గేట్ మీటింగ్స్, అక్టోబర్ 4, 5 తేదీల్లో మధ్యాహ్న భోజన సమయంలో అన్ని విద్యుత్తు కార్యాలయాల ఎదుట నిరసన తెలపాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు మింట్ కంపౌండ్‌లోని 1104 కార్యాలయంలో జేఏసీ నేతలు బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్‌ను సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఈ స్థలం జెన్‌కోకు చెందినదని, కాబట్టి జెన్‌కో ద్వారానే ప్లాంటు నిర్మించాలని, జాయింట్ వెంచర్ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టంచేశారు. అక్టోబర్ 5 వరకు దశలవారీగా ఆందోళనలకు దిగుతామని, అయినా ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే అక్టోబర్ 5 తర్వాత కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

28న లోక్ అదాలత్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): హైకోర్టుతోపాటు రాష్ట్రంలోని అన్ని కోర్టుల్లో ఈ నెల 28న లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ) సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రత్యక్షంగానే కాకుండా ఆన్‌లైన్‌లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కక్షిదారులు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయసేవా సదన్, మండల న్యాయసేవా కమిటీలను సంప్రదించాలని కోరారు.

అక్టోబర్ 21 నుంచి ఎస్‌ఏ -1 ఎగ్జామ్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 1–10వ తరగతి విద్యార్థులకు అక్టోబర్ 21 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్–1(ఎస్‌ఏ) పరీక్షలు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. పరీక్షల షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేసింది. అక్టోబర్ 21 నుంచి 28 వరకు పరీక్షలు నిర్వహించనుండగా, నవంబర్ 5లోగా మార్కులను అప్‌లోడ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఆదేశించారు.

30 వరకు ఎన్‌ఎంఎంఎస్‌కు గడువు

హైదరాబాద్, సెప్టెంబర్ 25(నమస్తే తెలంగాణ): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) దరఖాస్తుల గడువును ఈ నెల 30వరకు పొడిగించినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోనివారు http://bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

28న 'నాన్ గెజిటెడ్' సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): భూగర్భ జల శాఖలో నాన్ గెజిటెడ్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 28న రెండో విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ ప్రకటించింది. ఉదయం 10:30 నుంచి నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయంలో వెరిఫికేషన్‌ను నిర్వహిస్తామని కార్యదర్శి నవీన్ నికోలస్ ప్రకటనలో తెలిపారు. వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థుల జాబితాను https://www.tspsc.gov.in లో పొందుపరిచామని తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

4 నమస్తే తెలంగాణ
హైదరాబాద్
గురువారం 26 సెప్టెంబర్ 2024
www.ntnews.com



'ఈ భూమి నాది, పండించిన పంట నాది, తీసుకెళ్లడానికి దొరెవ్వడు?'
- చాకలి ఐలమ్మ

చాకలి ఐలమ్మ జయంతి నేడు

నమస్తే తెలంగాణ

దళితులపై దాడులు

దేశంలో దళితులపై దాడులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. రాజ్యాంగ రక్షణలు, రాజకీయ ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ అట్టడుగువర్గాల ప్రజలపై కుల వివక్ష, హింస తగ్గకపోగా అంతకంతకు పెరుగుతుండటం గమనార్హం. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్సీఆర్బీ) తాజాగా విడుదల చేసిన 2022 నివేదిక ఈ విషయాన్నే ఎత్తిచూపింది. మొత్తం నమోదైన కేసుల సంఖ్య 51,656కు పెరిగింది. 2021తో పోలిస్తే ఇది 13 శాతం అధికం. ఇందులో సుమారు 98 శాతం కేసులు 13 రాష్ట్రాలకు చెందినవే. ఉత్తరాదికి చెందిన యూపీలో 12,287 (23.78%), రాజస్థాన్‌లో 8,651 (16.75%), మధ్యప్రదేశ్‌లో 7,732 (14.97%) కేసులు నమోదైనట్టు ఆ నివేదిక వెల్లడించింది. బీహార్, ఒడిశా, మహారాష్ట్ర తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మొత్తం కేసుల్లో ఈ ఆరు రాష్ట్రాల వాటా 81 శాతం వరకు ఉంటుంది. గత జూలైలో ఈ అంశంపై సామాజిక న్యాయశాఖ మంత్రి రామ్‌దాస్ అథవాలే పార్లమెంటులో ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు ఒక్కటే పరిష్కారమన్నారు. కానీ, అత్యధిక కేసులున్న 14 రాష్ట్రాల్లో 498 జిల్లాలుంటే 194 జిల్లాల్లోనే ప్రత్యేక న్యాయస్థానాలున్నాయి. అత్యధిక కేసులు నమోదైన యూపీలో ఎస్సీలపై అత్యాచారాలు జరిగే ప్రాంతాల గుర్తింపే జరగలేదు.

దళిత బహుజనుల అభ్యున్నతికి, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని బాకాలూదుకునే పార్టీల పాలనలో ఏండ్ల తరబడి కొనసాగిన రాష్ట్రాల్లో ఎస్సీలపై అత్యాచారాలు అత్యధిక స్థాయిలో నమోదు కావడం గమనార్హం. తూతూమంత్రం చందంగానే దళితుల క్షేమం, సంక్షేమం అక్కడ అమలవుతుండటమే ఇందుకు కారణం. నిచ్చెనమెట్ల కులవ్యవస్థను నడిపించే ఆధిపత్య భావజాలం వెర్రితలలు వేయడంపై అనునిత్యం వార్తలు వెలువడుతూనే ఉంటాయి. దళిత పెండ్లికొడుకు గుర్రం మీద ఊరేగరాదని, దళితులు చెప్పులు వేసుకుని వీధుల్లో తిరగొద్దని, మీసాలు పెంచొద్దని, తలపాగాలు పెట్టుకోవద్దని హుకుం జారీ చేసే సంస్కృతి ఇప్పటికీ కొనసాగుతుండటం సభ్య సమాజానికి తలవంపులు తెస్తున్నది. ఈ ఆధిపత్య భావజాలమే అంతిమంగా దాడులకు దారితీస్తున్నది. ఇలాంటివి జరిగినప్పుడు పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ పనితీరు సందేహాస్పదం అవుతుంటుంది. నమోదయ్యే కేసుల్లో 61 శాతం మాత్రమే చార్జిషీటు దాకా వెళ్లడం ఇందుకు ఉదాహరణ.

దళితులపై అత్యాచారాల నివారణకు బహుముఖ, దీర్ఘకాలిక వ్యూహం అనుసరించాల్సిన అవసరం ఉందని చెప్పకతప్పదు. సామాజిక నిర్మాణాన్ని సమూలంగా మార్చడమూ తప్పనిసరి. సమాజానికి న్యాయం ప్రాముఖ్యతను వివరించేందుకు పటిష్ఠమైన ప్రచారోద్యమం ఏదీ లేకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. కులవివక్షకు వ్యతిరేకంగా బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించేలా ప్రజల్లో చైతన్యం పెంచేందుకు జాతీయ స్థాయిలో కృషి జరగాలి. బడులు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల పాఠ్యాంశాల్లో ఈ అంశానికి ప్రాధాన్యమివ్వాలి. చట్టాలకు ప్రజా చైతన్యం తోడైనప్పుడే దళితులపై అత్యాచారాలు, దాడులను రూపుమాపడం సాధ్యపడుతుంది.

శ్రీలంకను దిస్సనాయకే గట్టెక్కించేనా?

శ్రీలంక అధ్యక్షుడిగా 55 ఏండ్ల అనూరకుమార దిస్సనాయకే ఎన్నిక కావడం ఈ ద్వీపదేశంలో మార్పులకు సంకేతం. 2008 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో 'ఆశమార్పు' అనే మాటలు ఆఫ్రికన్-అమెరికన్ జూనియర్ సెనెటర్ బరాక్ ఒబామాకు ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన పదవిని కట్టబెట్టాయి. అలాగే ఆర్థిక వ్యవస్థ తునాతునకలై దివాలా మార్గంలో పయనిస్తున్న లంకను ఒడ్డున చేర్చే శక్తి అనూరకు ఉందనే ఆశ, పాలనలో పరివర్తన వస్తుందనే అంచనాలు లంక అధ్యక్ష ఎన్నికల్లో చారిత్రక ఫలితానికి నాంది పలికాయి. అనూర నాయకత్వంలో జనతా విముక్తి పెరమునా (జేవీపీ) అధ్యక్ష పీఠం ఎక్కడం ఇదే మొదటిసారి. ఇప్పటి వరకు కొన్ని రాజకీయ పార్టీలు, కొన్ని కులీన కుటుంబాలకు చెందిన నేతలే దేశాధ్యక్ష, ప్రధానమంత్రి తదితర ఉన్నత పదవులను చేపట్టారు. ఈ నేపథ్యంలో గ్రామీణ కుటుంబం నుంచి వచ్చిన తొలితరం నాయకుడు అనూర అధ్యక్ష పీఠమెక్కడం విశేషం.



నాంచారయ్య మెరుగుమాల

లంకలోని సెంట్రల్ ప్రావిన్స్‌లో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవిస్తున్న ఓ కుటుంబంలో అనూర జన్మించారు. అతని తండ్రి ప్రభుత్వ చిరుద్యోగి. అనూర చదువుకున్న పాఠశాల నుంచి యూనివర్సిటీలో అడుగుపెట్టిన తొలి విద్యార్థి కూడా ఆయనే కావడం గమనార్హం. ఈ తరుణంలో విద్యార్థి దశ నుంచే తన రాజకీయ ప్రయాణాన్ని మొదలుపెట్టిన అనూర అంచెలంచెలుగా ఎదిగి దేశంలోని అత్యున్నత పీఠాన్ని అధిరోహించారు.

మార్క్సిజం కరదీపికగా ఆరంభమైన జేవీపీ తన తీవ్రవాద, హింసాత్మక గతం నుంచి, రాడికల్ ఇమేజ్ నుంచి నెమ్మదిగా బయటపడింది. 1994 తర్వాత ప్రధాన స్రవంతి పార్లమెంటరీ పార్టీగా అవతరించింది. 1970ల ఆరంభంలో, 1980ల్లో ప్రభుత్వంతో, రాజకీయ ప్రత్యర్థులతో హింసామార్గంలో తలపడి వేలాది మంది కార్యకర్తలను ఆ పార్టీ కోల్పోయింది. మార్క్సిస్టు సిద్ధాంతాలకు కట్టుబడిన విప్లవ సంస్థగా రాజకీయ పోరాటం ప్రారంభించి, మధ్యలో మెజారిటీ సింహళ జాతీయవాదానికి మరో ప్రతినిధిగా మారి బలపడింది. ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోని తమిళుల ఈలం డిమాండ్ వల్ల వచ్చిన అంతర్యుద్ధం ఫలితంగా జేవీపీ మెజారిటీ సింహళ ప్రయోజనాలు కాపాడే సంస్థగా ఉంటూనే శ్రామికవర్గం తరఫున పోరాడే మార్క్సిస్టు పార్టీగా తన పేరును నిలబెట్టుకోగలిగింది. ఈ క్రమంలో వ్యథాభరిత ప్రయాణంతోనే దాదాపు ఏడున్నర దశాబ్దాల తర్వాత అధ్యక్ష పీఠాన్ని జేవీపీ కైవసం చేసుకోగలిగింది. మార్క్సిస్టులు తమ విశ్లేషణ సామర్థ్యంతో భవిష్యత్తులోకి తొంగిచూడడంలో నిష్ణాతులని పేరు గడించారు. అందుకేనేమో 1960 చివర్లో లంక రాజకీయ క్షేత్రంలోకి అడుగిడిన జేవీపీ హింసామార్గంలో నడిచి నష్టపోయింది. భారీ ప్రాణనష్టంతో పాటు పార్టీ నేతలూ జైలుపాలయ్యారు. 1970ల ఆరంభంలో ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో శ్రీలంక గతాన్ని, భవిష్యత్తునూ జేవీపీ తన విధాన పత్రంలో చక్కగా అంచనా వేసింది.

'1948లో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక ఒకదాని తర్వాత ఒకటిగా అధికారం చేపట్టిన బూర్జువా పార్టీలు పెట్టుబడిదారీ అభివృద్ధి అనే దివాలాకోరు పంథాను క్రమం తప్పకుండా అనుసరించాయి. ప్రజాతంత్ర సామ్యవాదం, సామ్యవాద ప్రజాస్వామ్యం అనే ముసుగులో ఇదంతా సాగింది. ఫలితంగా నేడు శ్రామికవర్గంపై పెరుగుతున్న అణచివేత, దేశవ్యాప్తంగా నిరుద్యోగం, మైనారిటీల హక్కులను కాలరాయడం, మనుషులుగా స్త్రీలకు కనీస హోదా దక్కకపోవడం లాంటి ఎన్నో దారుణాలను చూస్తున్నాం' అని 1970ల ఆరంభంలో జేవీపీ నేతలు నిర్బంధంలో ఉండి రూపొందించిన పార్టీ విధాన ప్రకటనలో విశ్లేషించారు. లంకకు స్వాతంత్ర్యానంతరం పాతికేండ్లలో దిగజారిన నాటి పరిస్థితులు ఐదు దశాబ్దాల తర్వాత 2022 నాటికి మరింత క్షీణించాయి. దేశాధ్యక్షుడు గొటబయా రాజపక్స పదవీచ్యుతుడు కావడానికి అవి దారితీశాయి. అధ్యక్ష భవనంపై దాడికి ప్రజలు ఉవ్వెత్తున కదిలారు. ఈ సంక్షుభిత సమయంలో ప్రజాందోళనకు అనూర దిస్సనాయకే సారథ్యంలోని జేవీపీ నాయకత్వం వహించడమే గాక, అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించడం గొప్ప చారిత్రక పరిణామం. గత అధ్యక్ష ఎన్నికల్లో 3.8 శాతం ఓట్లు సాధించిన



పార్టీని ఐదేండ్లలో విజయపథంలో నడిపించడం అనూర నాయకత్వ సామర్థ్యానికి, రాజకీయ పరిణతికి తార్కాణం.

> **మధ్య ప్రావిన్స్‌లోని గలెవెలా అనే కుగ్రామంలో 1968 నవంబర్ 24న పుట్టిన అనూర.. 1992లో కొలంబో సమీపంలోని కెలానియా యూనివర్సిటీలో తన రాజకీయ భవిష్యత్తుకు పునాది వేసుకున్నారు. ఆ పునాదే నేడు అత్యున్నత పదవిని అధిష్ఠించడానికి తోడ్పడింది. 1997 నుంచి వరుసగా ఆయనకు పార్టీలో దక్కిన పదవులు జేవీపీని సక్రమ మార్గంలో నడిపించడానికి దోహదపడ్డాయి.**

మొదట సెంట్రల్ ప్రావిన్షియల్ ఎన్నికల్లో ఓటమి పాలైన అనూర ఆ తర్వాత రెండేండ్లకే 2000లో పార్లమెంటుకు ఎన్నికయ్యారు. 2004 ఎన్నికల్లో కూడా గెలిచి, శ్రీలంక ఫ్రీడం పార్టీ నేతృత్వంలోని సంకీర్ణ సర్కారులో వ్యవసాయం, పశుసంవర్ధకం, భూములు, సాగునీటిపారుదల శాఖల మంత్రిగా పనిచేసిన ఆయన పరిపాలనా దక్షునిగా నిరూపించుకున్నారు. వ్యవసాయ రంగంలో సంస్కరణలు, గ్రామీణాభివృద్ధిపై విస్తృత చర్చకు కారకుడయ్యారు.

అనూర పాలనపై శ్రీలంకలో ఎన్నో అనుమానాలు, సంశయాలు, భయాలు వ్యక్తమవుతున్నాయి. హింసామార్గంలో దశాబ్దాల పాటు పయనించిన రాజకీయ సంస్థగా జేవీపీకి ఉన్న ఇమేజ్, ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలే ఈ అనుమానాలకు కారణం. అంతేగాక, సింహళ జాతీయవాద పక్షంగా ఎదిగిన దాని నేపథ్యం కూడా లంక తమిళుల సమస్య శాశ్వత పరిష్కారానికి అడ్డంకిగా మారుతుందని, హిందూమహాసముద్ర ప్రాంతంలోని ఇతర చిన్న దేశాల మాదిరిగానే శ్రీలంక కూడా జేవీపీ పాలనలో చైనాకు మరింత దగ్గరవుతుందని, ఇండియాతో గతంలో తలెత్తిన వివాదాలు మరింత ముదిరిపోతాయనే అంచనాలు కూడా ఇప్పుడు ప్రచారంలోకి వస్తున్నాయి. అసలు శ్రీలంక ఆర్థిక వ్యవస్థను ఊహించనలవికాని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసిన అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) షరతుల అమలును కొత్త సర్కారు ఎలా మార్చగలుతుందనే ప్రశ్న అన్నిటికన్నా ముఖ్యమైనది. దేశాధ్యక్షుడిగా ప్రమాణం చేసే సమయంలో చెప్పిన మాటలు, తర్వాత ఎక్స్ ద్వారా ఇచ్చిన పిలుపు దేశ ప్రజలను వ్యాపార, వాణిజ్య వర్గాల భయాలను పోగొట్టేవిగా ఉన్నాయి. ఈ విజయం మనందరిదీ. 'మనమంతా శ్రీలంక చరిత్రను కలిసి తిరగరాయబోతున్నాం. సింహళీయులు, తమిళులు, ముస్లింలు.. ప్రత్యేకించి, శ్రీలంక ప్రజల ఐక్యతే శుభారంభానికి పునాది. మనమంతా చేతులు కలిపి మన భవిష్యత్తును రూపుదిద్దుకుందాం' అని నూతన అధ్యక్షుడు ఇచ్చిన పిలుపు జేవీపీ పాలనపై కొంత వరకు ఆందోళనలను పోగొట్టింది. 'ప్రజలు భిన్నమైన రాజకీయ సంస్కృతిని కోరుకున్నారు. శ్రీలంకలో పరిశుద్ధ రాజకీయాలు నెలకొల్పుతాను' అని అధ్యక్షుడిగా చేసిన మొదటి ప్రసంగంతోనే దిస్సనాయకే ఆకట్టుకున్నారు.

ఐఎంఎఫ్‌తో విక్రమసింఘే కుదుర్చుకున్న 300 కోట్ల డాలర్ల బెయిల్ అవుట్ ఒప్పందాన్ని అనూర మొదటినుంచీ విమర్శించారు. అంతేగాక, తాను అధికారంలోకి వస్తే దాని అమలు తీరును సవరించేలా ఐఎంఎఫ్‌తో మళ్లీ సంప్రదింపులు జరుపుతానని ప్రకటించారు. ఐఎంఎఫ్ సాయం కోసం పాత ప్రభుత్వం తీసుకున్న పొదుపు చర్యల ఫలితంగా జనంపై పన్నుల భారం పడింది. ఐఎంఎఫ్ షరతులు లేదా ఆదేశాలను సవరించి అమలు చేస్తామని జేవీపీ గట్టిగా ప్రకటించిన నేపథ్యంలో కొత్త సర్కారుతో సంప్రదింపులకు సిద్ధమేనని ఐఎంఎఫ్ ప్రకటించింది. ఐఎంఎఫ్‌తో కుదుర్చుకున్న ఒప్పందంలోని అంశాలకు పూర్తిగా స్వస్తి పలకకుండానే, వాటిని సవరించాలని జేవీపీలో మెజారిటీ నేతలు కోరుతున్నారు.

మొత్తం మీద ఐఎంఎఫ్‌తో కీలక సంప్రదింపులు జరపడంతో పాటు శ్రీలంక దేశీయ ఆర్థిక వ్యవస్థను కాపాడే రీతిలో స్థానిక పారిశ్రామిక, వాణిజ్య రంగాలను ముందుకు నడిపించాలని దిస్సనాయకే పార్టీ యోచిస్తున్నది. స్థానికంగా పారిశ్రామికీకరణను ప్రోత్సహిస్తూ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను బలోపేతం చేయడమే అనూర సర్కారు పంథాగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతేగాక కమ్యూనిస్ట్ నేత స్టాలిన్ పూర్వపు సోవియట్ యూనియన్‌లో, ఫిడెల్ క్యాస్ట్రో నేతృత్వంలో క్యూబాలో దశాబ్దాల క్రితం వచ్చిన విప్లవాల రీతిలో శ్రీలంకలోని మార్క్సిస్టు జేవీపీ సర్కారు నడవదనే అవగాహన ప్రజల్లో ఉంది. ఐరోపా దేశాల కమ్యూనిస్టు పార్టీలు పార్లమెంటరీ పంథాలో ప్రవేశించాక ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించినట్టే.. శ్రీలంక మార్క్సిస్టు ప్రభుత్వం కూడా ముందుకు సాగుతుందనడంలో సందేహం లేదు. సామ్యవాదం, ప్రజాస్వామ్యం పేరిట సాగిన పాత సర్కార్ల కుహనా విధానాలు అనూర పాలనలో ఉండవనే ఆశే శ్రీలంక ప్రజలను ఈ ఎన్నికల్లో వినూత్న తీర్పు ఇవ్వడానికి ముందుకు ఉరికించింది.

పునాదుల్లేని 'స్కిల్' విద్య!



నర్సన్ బద్రి
94401 28169

రాష్ట్రానికి ఇంకా విద్యా మంత్రి నియామకం జరగలేదు. బీఏ చదివిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ శాఖను నిర్వహిస్తూ.. రోజుకొకటి అన్న తీరులో విద్యా సంస్కరణల ప్రకటన చేస్తున్నారు. రాష్ట్ర విద్యార్థి, యువత ఉపాధి విషయంలో ఆయన ఆలోచనా విధానం పూర్తిగా లోపభూయిష్టంగా ఉన్నది. విద్యావంతులైన యువత వ్యక్తిగత ప్రజ్ఞ, ఆసక్తుల పట్ల శ్రద్ధ, అవగాహన లేకుండా వారందరిని పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేసే వైట్ కాలర్ కూలీలుగా మార్చడమే గొప్ప కార్యమని ఆయన అనుకుంటున్నారు.



రాష్ట్రంలో ఒకవైపు లక్షల మంది రైతులు రుణమాఫీ, రైతు భరోసా అందక బాధల్లో ఉన్నారు. ఇలాంటి ఎన్నో ప్రాథమ్యాలను పక్కనబెట్టి ముఖ్యమంత్రి కేవలం నగర అభివృద్ధిపై అద్భుతాలను చెప్తూ స్టేట్ సీఈవోలాగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు సైబరాబాద్ నిర్మిస్తే తాను ఫోర్త్ సిటీని నిర్మిస్తున్నానన్నారు. వ్యవసాయం దండగ, చరిత్ర చదివితే ఏం లాభమన్న బాబు పోకడలు రేవంత్‌లో పొడ సూపుతున్నాయి. ఫోర్త్ సిటీ గురించి ఘనంగా చెప్తూ న్యూయార్క్, సింగపూర్, దుబాయ్‌లను మించిన నగరంగా దానిని రూపొందిస్తామన్నారు. కాలుష్య రహిత నెట్ జీరో సిటీగా వృద్ధి పరుస్తామన్నారు. అందులో ప్రముఖ ఫార్మా, ఐటీ కంపెనీలు వెలుస్తాయంటున్నారు. వేల కోట్ల విదేశీ పెట్టుబడులతో ఉపాధి అవకాశాలకు కొదవ ఉండదంటున్నారు. రేవంత్ కలకంటున్న ఫ్యూచర్ సిటీ వల్ల తెలంగాణలోని సామాన్య ప్రజల కష్టాలు తీరే మార్గాలేవీ లేవు. రైతు కుటుంబంలో నలుగురుంటే ఒకరు వ్యవసాయంలో ఉండి మిగతా ముగ్గురు బయట ఉద్యోగాలు వెతుక్కోవాలన్నారు. పరోక్షంగా సాగును నిరుత్సాహపరిచే తీరు ఈ మాటల్లో కనపడుతున్నది. నగరాల్లోని పరిశ్రమలకు నిరంతరంగా కార్మికుల సరఫరా కోసం వ్యవసాయాన్ని నష్టాల్లో ఉంచాలనే చీకటి ఒప్పందాలు జరుగుతున్నాయనే మాటలో నిజమే ఉన్నది. వ్యవసాయం కూడా ఆర్థిక చోదకశక్తిగా ఎదగాలని బ్రెజిల్ లాంటి దేశాలు యువతను ఆ వైపు ప్రోత్సహిస్తుంటే మన ఆలోచన మరోలా ఉన్నది.

ఆ తర్వాత స్కిల్ యూనివర్సిటీ గురించి చెప్పుకోవాలి. 57 ఎకరాల్లో రూ.150 కోట్లతో అది నిర్మించబడుతుంది. ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో నడిచే ఈ సంస్థకు టెక్ మహేంద్ర అనే ప్రైవేట్ సంస్థ యజమాని ఆనంద్ మహీంద్రా ఛాన్సలర్‌గా ఉంటారు. ప్రభుత్వం కోరి మరీ ఆయన్ని ఆ పీఠంపై కూర్చోబెడుతోంది. వచ్చే ఏడాది 2 వేలతో అడ్మిషన్లు మొదలై క్రమంగా పెరుగుతూ ఏటా 20 వేల మంది విద్యార్థులకు నైపుణ్యం అందించే స్థాయికి అది చేరుతుందని ప్రకటించారు. ఆ చదువులకు ఫీజులు ఎంత, విద్యార్థులకు ప్రభుత్వం నుండి లభించే రాయితీలు ఏమిటో తెలియదు. వీరి నైపుణ్యమంతా ప్రైవేటు కంపెనీలకు ధారపోయవలసిందే. ప్రైవే ట్ కంపెనీలు ఇచ్చే జీతభత్యాలు, వాటి విధుల నియమాలు, ఉద్యోగ భద్రతల విషయంలో మాత్రం ప్రభుత్వాలు కల్పించుకోవు. మన కనీ స వేతనాలు, పని గంటలు, కార్మిక చట్టాలు ఏ కంపెనీలు పాటించే అవసరం లేదు.

ప్రస్తుతం రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల ద్వారా ఏడాదికి లక్షకు పైగా యువత సాంకేతిక విద్యను పూర్తిచేసుకుంటున్నారు. వారిలో కేవలం 20 శాతం మందికే సరైన ఉద్యోగాలు లభిస్తున్నాయి. మిగతావారిలో నైపుణ్యాల లేమి ఉందని కంపెనీలు చెప్తున్నాయి. ఇందు కు ఆయా ఇంజినీరింగ్ కాలేజీల్లోని బోధన, మౌలిక సదుపాయాల కొరతనే తప్పు పట్టాలి. వాటిపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. లక్ష మందికి నా లుగేండ్ల పాటు కోర్సుకు తగిన నాణ్యమైన విద్యను కచ్చితంగా అందిస్తే వారికి స్కిల్స్ నే ర్పే మరో సంస్థ అవసరమే లేదు. ఈ రకంగా చూస్తే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కేవలం పారిశ్రామికవేత్తల ప్రయోజనం కోసమే అనుకోవాలి.

> **ముఖ్యమంత్రి ఈ మధ్య మరో విచిత్రమైన నైపుణ్య ఆలోచనను ప్రకటించారు. అదే మినీ డిగ్రీ ప్రోగ్రాం. దాని ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఏడాదికి 10 వేల మంది డిగ్రీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా రంగాల్లో శిక్షణ ఇస్తారు. దీనికోసం ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులను ఐదేసి వేల చొప్పున ఎంపిక చేస్తారు. ఈ శిక్షణ ద్వారా ఆయా విద్యార్థులకు కోర్సు పూర్తికాగానే ఉద్యోగ అవకాశం లభిస్తుందని ప్రభుత్వ తలంపు.**

బీఏ, బీకాం చేసేవారికి ఇది ఉపయోగపడవచ్చు. కానీ, ఒక ప్రత్యేక సాంకేతిక విద్యను అభ్యసించిన వారికి ఈ మినీ డిగ్రీ వల్ల ప్రయోజనం ఉండదు. పని మెళకువలు నేర్చుకున్న యువత ఏదో చేసుకొని బతుకుతారనే ఆలోచన దీర్ఘకాలంలో బెడిసికొడుతుంది. ఒకేరకమైన నైపుణ్యం కలవారి సంఖ్య హద్దు దాటితే వారిలో వారికే పోటీ పెరిగి కంపెనీలు ప్యాకేజీలు తగ్గించే అవకాశం ఉన్నది. కొత్తగా చేరినవారికి కాగ్నిజెంట్ ఏడాదికి రూ.2.5 లక్షల ప్యాకేజీ ఇస్తున్నది. తొందరగా ఉద్యోగం వదిలేస్తే విప్రో రూ.లక్ష జరిమానా వేస్తున్నది. ఇలాంటి వాటిని ప్రభుత్వాలు ప్రశ్నించవు.

ప్రస్తుత కంపెనీలకు, మార్కెట్‌కు అవసరం ఉన్న స్కిల్స్ నేర్పి యువతతో వాటికి చాకిరీ చేయించే కన్నా ఆసక్తి ఉన్నవారిని శాస్త్రపరిశోధనల వైపు మళ్లించాలి. వాటి వల్ల నిత్య జీవితంలోని అనేక సమస్యలు తీరి, మానవాళి అభివృద్ధికి అవి తోడ్పడుతాయి. ముఖ్యమంత్రి నాలుగో నగరాన్ని సింగపూర్‌తో పోల్చారు. సింగపూర్‌లో శాస్త్ర పరిశోధకులు లక్ష జనాభాకు 728 మంది ఉంటే మన దేశంలో 26 మంది ఉన్నారు. ఒక దేశం లేదా నగరం అద్భుత అభివృద్ధిని సాధించాయంటే దాని వెనుక దశాబ్దాల కృషి, శ్రమ ఉంటుంది. దాని దరిదాపులకు వెళ్లాలన్నా ఎంతో అధ్యయనం, సమర్థ మానవశక్తి అవసరం. ఆ అంచనాలేవీ లేకుండానే దాటేస్తాం అనడం ప్రజలను మభ్యపెట్టడమే అనుకోవాలి. విద్య, ఉపాధి రంగాల్లో యువతకు మేలు చేయాలంటే ఒక సమర్థ విద్యామంత్రిని నియమించి, తగిన అధ్యయన కమిటీల ఏర్పాటు జరగాలి. యువత శక్తిని ప్రైవేటురంగానికి బలి చేయకుండా రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా ప్రయోజనానికి పని కొచ్చేలా తీర్చిదిద్దాలి.

మణిపూర్ మండిపోతున్నది. కానీ, అది వార్త కాదు. ఎందుకంటే, వార్త అనేది ఏదో ఒక కొత్తదనాన్ని తీసుకురావాలి. రోజువారీ దినచర్య ముఖ్యాంశం కాదు కదా! ఈశాన్య రాష్ట్రంలో మళ్లీ అల్లర్లు చెలరేగాయి. మరో 10 మందికి పైగా అమాయకులు మరణించారు. వారితో కలిపి మృతుల సంఖ్య 200 దాటింది. మళ్లీ కర్ఫ్యూ కూడా విధించారు. అయినా పరిస్థితులు అదుపులోకి రాలేదు. కాగా, పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని ప్రభుత్వం బుకాయిస్తున్నది.

మణిపూర్‌లో మాత్రమే కాదు!



యోగేంద్ర యాదవ్



రెండు తెగల మధ్య జరుగుతున్న అల్లర్లను భద్రతా దళాలు అదుపు చేయలేవని, రాష్ట్ర పోలీసులు మెయితీ, కుకీ వర్గాలుగా విడిపోయారని అసోం రైఫిల్స్ మాజీ అధిపతి గతం లో పేర్కొన్న విషయం విదితమే. అంతర్జాతీయ సరిహద్దుల్లాగా మణిపూర్‌లోనూ అంతర్గతంగా రెండు వర్గాల మధ్య అదృశ్య సరిహద్దు ఏర్పడింది. ఈ సరిహద్దును భద్రతా దళాల అనుమతితో కాదు, మిలిటెంట్ల అనుమతి తీసుకొని దాటాలి. అది కూడా సరిహద్దును దాటేవారు ఏ వర్గానికి చెందినవారనేది నిర్ధారించాకే మిలిటెంట్లు అనుమతిస్తారు. ఎవరైనా అనుకోకుండా అవతలివైపు వెళ్తే మాత్రం వారు తమ ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందే.

కుకీల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ప్రవేశించలేని పరిస్థితి. అంతేకాదు, కుకీ ఎమ్మెల్యేలు సైతం అసెంబ్లీ పరిసరాల్లోకి వెళ్లలేని నిస్సహాయ స్థితి. అసలు రాష్ట్రాన్ని పాలిస్తున్నదెవరో ఎవరికీ తెలియడం లేదు. ముఖ్యమంత్రి ఉన్నా లేనట్టే! మణిపూర్‌లో అల్లర్లు చెలరేగిన నాటినుంచీ ప్రధాని మోదీ జపాన్, పపువా న్యూగినీయా, ఆస్ట్రేలియా, అమెరికా, ఈజిప్టు, ఫ్రాన్స్, యూఏఈ, దక్షిణాఫ్రికా, గ్రీస్, ఇండోనేషియా, ఖతార్, భూటాన్, ఇటలీ, రష్యా, ఆస్ట్రియా, పోలండ్, ఉక్రెయిన్, బ్రూనె, సింగపూర్ తదితర దేశాలను సందర్శించారు. కానీ, మణిపూర్‌ను ఎప్పుడు సందర్శిస్తారనే దానిపై ఎలాంటి సమాచారం లేదు.


> **'ఓ..! అది మణిపూర్ మాత్రమే. దానితో మనకేంటి సంబంధం? అది ముంబై కాదు కదా, కారు ప్రమాదం కూడా వార్తల్లోకి ఎక్కడానికి? ఒకవేళ మణిపూర్‌లో హిందూ-ముస్లిం కోణం ఉండి ఉంటే, ప్రతిపక్షాల పాలనలోని రాష్ట్రమై ఉంటే 'జంగిల్ రాజ్' పేరిట హెడ్‌లైన్లకు ఎక్కేది.'**

మణిపూర్‌లో మెయితీ, కుకీ వర్గాలు ఇప్పుడు ఒకరిపై ఒకరు రైఫిళ్లతో మాత్రమే కాల్పులు జరుపుకోవడం లేదు. వాళ్లు అప్‌గ్రేడ య్యారు. ఇటీవల అక్కడ డ్రోన్లు, రాకెట్ లాంచర్లు కూడా వాడినట్టు వార్తలు వచ్చాయి. ఇది వదంతు కాదు, మణిపూర్ పోలీసులు దీన్ని నిర్ధారించారు కూడా. అత్యధికులు హిందువులుగా ఉన్న మెయితీ వర్గంలోని చాలామంది సీఎం బీరేన్‌సింగ్‌పై విశ్వాసాన్ని కోల్పోయారు. మెయితీలకు బీరేన్‌సింగ్ మద్దతిస్తున్నాడని కుకీలు ఆరోపించారు. అంతేకాదు, ఆయనను నిషేధించారు కూడా. మెయితీల హీరోగా మారేందుకు దాన్ని బీరేన్‌సింగ్ వాడుకున్నారు.


కనీస సమాచారం లేకుండానే ఇప్పుడు మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన కొనసాగుతున్నది. శాంతిభద్రతలను తిరిగి తనకు అప్పగించాలని కోరుతూ గవర్నర్‌కు స్వయంగా సీఎం బీరేన్‌సింగ్ లేఖ రాశారు. అవును..! ఆయన రాజ్యాంగం తనకు ఇచ్చిన అధికారాలను తిరిగివ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం కేంద్రం నియమించిన భద్రతా సలహాదారు చేతుల్లో శాంతిభద్రతలున్నాయి. ఈ కాల్పులు, అల్లర్లు విపక్ష పార్టీ పాలిత రాష్ట్రంలో జరిగినట్టు ఒక్కసారి ఊహించుకోండి! ఇది భారీ కుంభకోణం కాదా? జాతీయ భద్రతకు సంబంధించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా వైఫల్యంపై మనం మాట్లాడగలమా? అది వార్త అవుతుందా?

మొత్తానికి మణిపూర్ మాట్లాడటం ప్రారంభించడం శుభపరిణామం. మణిపూర్ లోయ ఎంపీ బిమోల్ అకోయిజమ్ పార్లమెంట్‌లో చారిత్రాత్మక ప్రసంగం చేశారు. నేను మరో కథనం చెప్పనా? ఇది మణిపూర్ గురించి కాదు.. ఢిల్లీ కఠినమైన హృదయం గురించి, దేశంలో ఆవరించిన నిశ్శబ్దం గురించి, మన హృదయాలను కమ్మేసిన చీకట్ల గురించి. మండిపోతున్నది మణిపూర్ మాత్రమే కాదు.. మన కలల భారతం, చిన్నప్పటినుంచి మనం వింటూ పెరిగిన 'సారే జహాసే అచ్ఛా హిందుస్థాన్ హమారా...'

('నేషనల్ హెరాల్డ్' సౌజన్యంతో..)



శాండ్‌విచ్‌లా నలిగిపోవాలనుకోవట్లేదు!



మల్టీపోలార్ వ్యవస్థలో చాలా పవర్ క్యాంపులున్నాయి. ఆ భౌగోళిక రాజకీయ పోరులో మేం భాగం కాము. మాకు ఎవరితోనూ సంబంధం లేదు. అంతేకాదు, మేం (శ్రీలంక) శాండ్‌విచ్‌లా నగిలిపోవాలని అనుకోవట్లేదు, ప్రత్యేకించి చైనా, భారత్‌ల మధ్య. ఆ రెండూ మాకు మిత్రదేశాలే. వారి నుంచి మేం మైత్రినే ఆశిస్తున్నాం.

- అనూరకుమార దిస్సనాయకే, శ్రీలంక అధ్యక్షుడు

తులం రూ.77,850

ఆల్‌టైమ్ హైకి బంగారం ధరలు

లక్షకు చేరువలో వెండి రేటు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: బంగారం ధరలు ఆల్‌టైమ్ హైకి చేరాయి. బుధవారం మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాములు దేశ రాజధాని నగరం ఢిల్లీలో రూ.77,850 పలికింది. మంగళవారం ముగింపుతో చూస్తే ఒక్కరోజే రూ.900 ఎగిసింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం రేటూ రూ.900 ఎగబాకి రూ.77,500గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధరల్లో కొనసాగుతున్న ర్యాలీనే ఇందుకు కారణమని అఖిల భారత సరఫా అసోసియేషన్ వెల్లడించింది. హైదరాబాద్‌లోనూ 24 క్యారెట్ పుత్తడి 10 గ్రాములు రూ.660 పుంజుకొని రూ.77,020గా ఉన్నది.

వెండి రేట్లూ పైపైకే

బంగారానికితోడు వెండి ధరలూ పరుగులు పెడుతున్నాయి. ఢిల్లీలో ఒక్కరోజే కిలో రేటు రూ.3,000 ఎగిసి రూ.93,000ను తాకింది. పారిశ్రామిక రంగం, నాణేల తయారీదారులు, సాధారణ కొనుగోలుదారుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వ్యక్తమవుతున్నట్టు మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. ఇక హైదరాబాద్‌లోనూ కిలో వెండి ధర బుధవారం రూ.3,000 పెరిగింది. దీంతో రూ.97,000 నుంచి లక్ష రూపాయలపైనే పలుకుతున్నట్టు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఫ్యూచర్ మార్కెట్‌లో కూడా గోల్డ్ బుల్ రన్ సాగుతున్నది. గతంలో ఎప్పుడూ లేనంతగా ఎంసీఎక్స్‌పై అక్టోబర్ గోల్డ్ కాంట్రాక్ట్స్ 10 గ్రాములు రూ.76,000 పలికింది. ఇక డిసెంబర్ నెలకుగాను సిల్వర్ కాంట్రాక్ట్స్ కిలో రూ.91,974గా ఉన్నది.

గ్లోబల్ మార్కెట్‌లో..

గోల్డ్, సిల్వర్ రేట్లు గ్లోబల్ మార్కెట్‌లో దూసుకుపోతున్నాయి. ఔన్స్ గోల్డ్ ధర 2,681.10 డాలర్లకు చేరింది. ఒకానొక దశలో రికార్డు స్థాయిలో 2,694.89 డాలర్లు పలకడం విశేషం. వెండి రేటు ఔన్స్ 32.15 డాలర్లుగా ఉన్నది. కాగా, బంగారం ధరలు అంతర్జాతీయ విపణిలో ఔన్స్ 3,200 డాలర్లను తాకే వీలున్నట్టు భారతీయ బులియన్, జ్యుయెల్లర్ల సంఘం (ఐబీజేఏ) కార్యదర్శి సురేంద్ర మెహెతా అంటున్నారు. ఈ అంచనాతో దేశీయ మార్కెట్‌లో పసిడి ధరల పరుగు ఇకపైనా కొనసాగుతుందని స్పష్టమవుతున్నది.

ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలు

- ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ బలహీనత
- సెంట్రల్ బ్యాంకుల్లో వడ్డీరేట్ల కోతల అంచనాలు
- మదుపరుల్లో సురక్షిత పెట్టుబడి సాధనంగా పసిడికి ఉన్న పేరు
- ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి పెరిగిన నిధుల ప్రవాహం
- భౌతిక మార్కెట్‌లో పుత్తడికి ఎక్కువైన ఆదరణ

పండుగ సీజన్ జోష్

రాబోయేది పండుగ సీజన్ కావడంతో బంగారం, వెండి ధరలు ఇంకా పెరుగుతాయన్న అంచనాలు మార్కెట్‌లో బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా దీపావళికి కొత్త రికార్డులు నమోదవడం ఖాయమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు స్టాక్ మార్కెట్లు ఆల్‌టైమ్ హైల్లో ఉండటంతో మదుపరులు తమ పెట్టుబడుల రక్షణార్థం పసిడి వైపునకు కొంతమేర ఇన్వెస్ట్‌మెంట్లు తరలిస్తున్నారని, దీంతో ఒకవేళ మార్కెట్ క్రాష్ అయితే పుత్తడి రేట్లు మరింత పెరుగవచ్చన్న అంచనాలూ ఉన్నాయి. ఇక నగల వర్తకులు నిరంతరం బంగారం కొనుగోళ్లకు దిగుతుండటం కూడా డిమాండ్‌ను పెంచి మార్కెట్‌లో ధరల్ని పెంచుతున్నాయని ట్రేడర్లు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు.

మా హయాంలోనే మహిళాభ్యున్నతి

నీతి ఆయోగ్ లెక్కలే సాక్ష్యం • పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాం

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ సర్కార్ మహిళా పారిశ్రామికవేత్తల చోదక శక్తిగా పనిచేసిందని, అందుకు నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదికే నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం పారిశ్రామిక రంగానికి ఇచ్చిన ప్రాధాన్యం ఫలితంగా దేశంలో తెలంగాణ టాప్-3 రాష్ట్రంగా నిలిచిందని ఎక్స్ ద్వారా తెలిపారు. 2020-21లో నీతి ఆయోగ్ నివేదిక విశ్లేషణను పరిశీలిస్తే గర్వంగా ఉందని చెప్పారు. ప్రగతిశీల చర్యల ద్వారా ఉదయం పోర్టల్‌లో 58 వేలకు పైగా మహిళలు పారిశ్రామిక ఔత్సాహికతను చాటారని పేర్కొన్నారు. అది నాటి తమ సర్కార్ చేసిన గొప్ప ప్రయత్నమని గుర్తుచేశారు. ఎంఎస్ఎంఈ రంగంలో మహిళాభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో ప్రత్యేక పథకాలను రూపొందించిందని పేర్కొన్నారు.

నీతి ఆయోగ్ చెప్పింది ఇదే

- దేశంలో 12.39 (20.37 శాతం) మిలియన్ల మంది మహిళలు ఎంఎస్ఎంఈలో వివిధ రంగాల్లో ఉన్నారు. తెలంగాణలో ఎంఎస్ఎంఈలో ఎస్సీలు 14.94 శాతం, ఎస్టీలు 8.75 శాతం, ఓబీసీలు 27.69 శాతం, జనరల్ కేటగిరిలో 48.62 శాతం ఉన్నారు.
- రాష్ట్రంలో మహిళా జనాభా: 1,88,42000. ఇందులో మహిళా పారిశ్రామికవేత్తలు: 58,644 మంది (3.1శాతం)

నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఎంఎస్ఎంఈల్లో దేశంలోని టాప్-10 రాష్ట్రాలు, వాటి శాతాలు ఇలా

రాష్ట్రం	శాతం
పశ్చిమ బెంగాల్	23.42
తమిళనాడు	10.37
తెలంగాణ	7.85
కర్ణాటక	7.56
ఉత్తరప్రదేశ్	6.96
ఆంధ్రప్రదేశ్	6.76
గుజరాత్	6.67
మహారాష్ట్ర	6.47
కేరళ	4.00
రాజస్థాన్	3.07

స్పామ్ కాల్స్, మెసేజ్‌లకు చెక్

ప్రారంభించిన ఎయిర్‌టెల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: స్పామ్ కాల్స్, మెసేజ్‌లతో విసిగిపోయిన వారికి శుభవార్తను అందించింది ప్రముఖ టెలికం సంస్థ భారతీ ఎయిర్‌టెల్. వీటికి చెక్ పెట్టడానికి ప్రత్యేకంగా ఏఐ సాయంతో కొత్త టెక్నాలజీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ ఎండీ, సీఈవో గోపాల్ విఠల్ తెలిపారు. ఈ సదుపాయం గురువారం అర్ధరాత్రి నుంచి అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. స్పామ్ కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు యూజర్లకు కేవలం 2 మిల్లీసెకండ్లలో సమాచారం ఇవ్వనున్నదని, దీంతో యూజర్ వెంటనే అలర్ట్ అయ్యేందుకు వీలుంటుందన్నారు. ఎయిర్‌టెల్ స్మార్ట్‌ఫోన్ యూజర్లు ఈ సేవలను ఉచితంగా పొందవచ్చునని చెప్పారు.ఈ నూతన టెక్నాలజీ సేవలు కేవలం 2 మిల్లీ సెకన్లలోనే 150 కోట్ల మెసేజ్‌లు, 250 కోట్ల కాల్స్‌ను ప్రాసెస్ చేయగలదని ఆయన చెప్పారు.

85 వేలపైన ముగిసిన సెన్సెక్స్

26 వేల మార్కును అధిగమించిన నిఫ్టీ



ముంబై, సెప్టెంబర్ 25: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల పరంపర కొనసాగుతున్నది. రోజుకొక గరిష్ఠ స్థాయిని తాకుతున్న సూచీలు మరో మైలురాయిని అధిగమించాయి. బ్యాంకింగ్, పవర్ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో ప్రారంభ నష్టాలను అధిగమించి సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. నష్టాల్లో ప్రారంభమైన సూచీలకు మధ్యాహ్నం తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి లభించిన మద్దతుతో తిరిగి కోలుకున్నాయి. ఇంట్రాడేలో 333 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 255.83 పాయింట్లు పెరిగి 85,169.87 వద్ద ముగిసింది. 85 వేల పైన ముగియడం స్టాక్ మార్కెట్ చరిత్రలో ఇదే తొలిసారి. 30 షేర్ల ఇండెక్స్‌లో 20 షేర్లు లాభాల్లో ముగియగా, 10 షేర్లు నష్టపోయాయి. మరో సూచీ నిఫ్టీ తొలిసారిగా 26 వేల పాయింట్లను అధిగమించింది. ఇంట్రాడేలో 26,033 పాయింట్లకు చేరుకున్న సూచీ చివరకు 63.75 పాయింట్లు అందుకొని 26,004.15 వద్ద స్థిరపడింది.

- పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా, ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, మారుతి, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఎల్‌అండ్‌టీ, టీసీఎస్ షేర్లు నాలుగు శాతం వరకు బలపడ్డాయి.
- టెక్ మహీంద్రా, టాటా మోటర్స్, టైటాన్, కొటక్‌బ్యాంక్, ఎస్బీఐ, జేఎస్ డబ్ల్యూ స్టీల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్ షేర్లు రెండు శాతం వరకు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే యుటిలిటీ, పవర్, రియల్టీ, మెటల్, టెలికం, కమోడిటీ రంగ షేర్లు లాభపడగా.. కన్జ్యూమర్ డ్యూరబుల్, ఐటీ, సర్వీసులు, టెక్, వాహన రంగ షేర్లు నష్టపోయాయి.

రూపాయి జోరు..

రూపాయి జోరందుకున్నది. దేశీయ ఈక్విటీలు భారీగా పుంజుకోవడంతో కరెన్సీ మరింత బలోపేతం అయింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 5 పైసలు ఎగబాకి 83.58కి చేరుకున్నది. 83.59 వద్ద ప్రారంభమైన డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు ఒక దశలో 12 పైసలు లాభపడింది. చివరకు 5 పైసలు అధికమై 83.58 వద్ద స్థిరపడింది. మంగళవారం 83.63 వద్ద ముగిసిన విషయం తెలిసిందే.

యమహా పండుగ ఆఫర్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ యమహా ..ప్రస్తుత పండుగ సీజన్‌లో కొనుగోలుదారులను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎఫ్‌జెడ్ సిరీస్, ఫ్యాసినో, రేజెడ్‌ఆర్ మాడల్స్‌పై రూ.7 వేల వరకు క్యాష్‌బ్యాక్‌ను అందిస్తున్నది. దీంతోపాటు హైబ్రిడ్ స్కూటర్లను డౌన్‌పేమెంట్ కింద రూ.2,999, అలాగే ఎఫ్‌జెడ్ సిరీస్ బైకులను రూ.7,999 చెల్లించి కొనుగోలు చేయవచ్చునని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

స్విగ్గీ ఐపీవోకు గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: ఫుడ్ అండ్ గ్రాసరీ డెలివరీ సంస్థ స్విగ్గీ ఐపీవోకు స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏప్రిల్ 30న స్విగ్గీ..సెబీకి దరఖాస్తు చేసుకోగా, ఐదు నెలల తర్వాత నియంత్రణ మండలి అనుమతినిచ్చింది. 2014లో ప్రారంభమైన స్విగ్గీ ప్రస్తుతం కంపెనీ విలువ 13 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నది. మార్చి 31, 2023 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ వార్షిక టర్నోవర్ 1.09 బిలియన్ డాలర్లుగా ఉన్నది. అలాగే 4,700 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో షేర్లను విక్రయించడం ద్వారా రూ.10,414 కోట్ల నిధుల సేకరణకు ఇప్పటికే వాటాదారులు అనుమతినిచ్చారు.

లక్ష కోట్ల లాభం లక్ష్యం

- **వచ్చే 3-5 ఏండ్లలో సాధిస్తాం**
- **ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి ధీమా**



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: లక్ష కోట్ల రూపాయల లాభాన్ని సాధించిన తొలి భారతీయ ఆర్థిక సంస్థగా ఎదగాలన్నదే ఎస్బీఐ లక్ష్యమని, ఆ దిశగా వెళ్తున్నామని ఆ బ్యాంక్ నూతన చైర్మన్ సీఎస్ శెట్టి పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. వచ్చే 3 నుంచి 5 ఏండ్లలో దీన్ని సాధిస్తామన్న విశ్వాసాన్ని ఆయన కనబర్చారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఈ ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టాండలోన్ నికర లాభం రూ.61,077 కోట్లుగా ఉన్నది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోల్చితే 21.59 శాతం ఎగిసింది. ఈ క్రమంలోనే 2028-29కల్లా లక్ష కోట్ల రూపాయల మైలురాయిని అధిగమిస్తామన్న ధీమాను వెలిబుచ్చారు. 'మాకు ఆ సామర్థ్యం ఉన్నది. తప్పకుండా దాన్ని సాధించి దేశంలో ఈ ఘనతను అందుకున్న తొలి ఆర్థిక సంస్థగా ఎస్బీఐని నిలబెడతాం' అని వచ్చే 3-5 ఏండ్లలో లక్ష కోట్ల రూపాయల లాభాన్ని సాధిస్తారా? అన్న ప్రశ్నకు శెట్టి బదులిచ్చారు. లాభాలు, మార్కెట్ క్యాపిటలైజేషన్ మొదలగునవి ఎస్బీఐకి చాలాచాలా ప్రధానమైనవని స్పష్టం చేశారు. కార్పొరేట్ రుణాల డిమాండ్‌పై మాట్లాడుతూ.. ఇప్పటికే బ్యాంక్ రుణాలు రూ.4 లక్షల కోట్లపైనే ఉంటాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో ఇవి మరింత పెరుగుతాయన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు.

మిగతా 65 ఎకరాల స్థలం ఇప్పించండి

- **తుమ్మలను కోరిన గోద్రెజ్ ప్రతినిధులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. మొత్తం 180 ఎకరాలు అవసరం కాగా ఇప్పటికే టీజీఐఐసీ 114 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని, మిగతా 65 ఎకరాల స్థలానికి నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. ఈ స్థలాన్ని త్వరితగతిని పూర్తి చేయాలని మంత్రిని కోరారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో కంపెనీ ప్రతినిధులు మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఆయిల్ పాం ప్రాసెసింగ్ మిల్లు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అదేవిధంగా ఈ ఏడాది 15 వేల ఎకరాల పైన ఆయిల్ పాం సాగు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని లక్ష్యాన్ని సాధించాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ప్రభుత్వం తరపున ఎలాంటి సహకారం కావలన్నా అందిస్తామని తెలియజేశారు.




రా మచ్చా మచ్చా..

రామ్‌చరణ్ తాజా చిత్రం 'గేమ్ చేంజర్' క్రిస్మస్ సందర్భంగా విడుదలకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. సినిమా విడుదలకు ఇంకా మూడు నెలల సమయం ఉన్నా.. పాన్ ఇండియా ఫిల్మ్ కాబట్టి ఇప్పటి నుంచే ప్రచారపర్వాన్ని వేగవంతం చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలిసింది. ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'జరగండి జరగండి' మంచి ఆదరణ దక్కించుకుంది. ఈ నేపథ్యంలో 'రా మచ్చా మచ్చా..' అంటూ సాగే రెండో పాట ప్రోమోను ఈ నెల 28న విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం పేర్కొంది. ఈ సందర్భంగా బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. తమన్ స్వరపరచిన చేసిన ఈ గీతాన్ని అనంత్ శ్రీరామ్ రచించారు. హుషారైన బీట్‌తో సాగే మాస్ పాట ఇదని చిత్ర బృందం పేర్కొంది. రాజకీయ, సామాజికాంశాలను చర్చిస్తూ తనదైన శైలి సందేశంతో దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కియారా అద్వాణీ, అంజలి, సముద్రఖని, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, దర్శకత్వం: శంకర్.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రోడ్



తన మధురగానంతో దశాబ్దాల పాటు సంగీతప్రియులను అలరించారు గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. అజరామరమైన గీతాలతో దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు. 2020 సెప్టెంబర్ 25న ఆయన స్వర్గస్తులయ్యారు. బుధవారం ఆయన నాలుగో వర్ధంతిని పురస్కరించుకొని తమిళనాడు ప్రభుత్వం అరుదైన గౌరవాన్ని ఇచ్చింది. చెన్నై నుంగంబాక్కంలోని కాందార్ నగర్ మెయిన్ రోడ్డుకు 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం' పేరు పెడుతున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆయన ఓ పోస్ట్ చేశారు. సీఎం స్టాలిన్ నిర్ణయంతో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మరపురాని మధుర ఘట్టం


సినీ తారలు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల గత నెలలో నిశ్చితార్థం జరుపుకున్న విషయం తెలిసిందే. ఇరు కుటుంబాలకు చెందిన సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో నిరాడంబరంగా వీరిద్దరి ఎంగేజ్‌మెంట్ జరిగింది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన నిశ్చితార్థ వేడుక గురించి శోభితా ధూళిపాళ్ల ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. తెలుగు సంప్రదాయాలకు అనుగుణంగా ఆ వేడుకను ఘనంగా నిర్వహించామని తెలిపింది. ఆమె మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరికి నిశ్చితార్థ వేడుకు చాలా ప్రత్యేకమైనది. జీవితంలోని విలువైన క్షణాలవి. మన తెలుగు సంప్రదాయాలు ప్రతిబింబించేలా వేడుక చేసుకోవాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. నా కుటుంబం తెలుగు సంస్కృతికి ఎంతో విలువనిస్తుంది. వారి కోరిక మేరకు నా శ్రేయోభిలాషుల సమక్షంలో ఎంతో సంప్రదాయబద్ధంగా వేడుక జరగడం సంతోషాన్నిచ్చింది. ఇక ఎంగేజ్‌మెంట్ గురించి ముందస్తుగా ఎలాంటి ప్రణాళికలు వేసుకోలేదు. జీవితంలోని మధుర క్షణాలను ఆస్వాదించాలనే ఆలోచనలతో నా మనసు నిండిపోయింది. కొద్ది మందిని మాత్రమే ఆహ్వానించినా నా దృష్టిలో ఆ వేడుక ఘనంగా జరిగిందనుకుంటున్నా' అని చెప్పుకొచ్చింది. గత రెండేళ్లుగా ప్రేమలో ఉన్న చై-శోభితా ధూళిపాళ్ల త్వరలో పెళ్లిపీటలెక్కేందుకు సిద్ధమవుతున్నారు.



వేట్టయాన్.. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'వేట్టయాన్-ది హంటర్'. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ రాజా దర్శకుడు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. దసరా సందర్భంగా అక్టోబర్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ప్రివ్యూ పేరుతో చిత్ర యూనిట్ ఓ వీడియోను విడుదల చేసింది. ఇందులో రజనీకాంత్‌ను పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోనే పేరుపొందిన ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా చూపించారు. 'మనకు ఎస్పీ పేరు మీద ఒక యముడొచ్చి దిగినాడు..' అంటూ నేరస్థులంతా వేట్టయాన్‌ను చూసి హడలిపోతుంటారు. అసాంఘిక శక్తుల ఆటకట్టించే పవర్‌ఫుల్ పోలీస్‌గా రజనీకాంత్ నటన ఆకట్టుకుంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా పేరు తెచ్చుకున్న వేట్టయాన్ జీవితంలో తెలియని కోణాలేమిటి? అతను ఏ లక్ష్యం కోసం బయలుదేరాడు? అనే అంశాలు ఆసక్తికరంగా ఉంటాయని చిత్ర బృందం పేర్కొంది. అమితాబ్ బచ్చన్, ఫహాద్ ఫాజిల్, రానా, రితికా సింగ్, దుషరా విజయన్, రోహిణి, అభిరామి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ మ్యూజిక్ అందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

కేరళలో నవ్వుల హంగామా



శర్వానంద్ హీరోగా 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఆద్యంతం హాస్యప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కేరళలో పదిరోజుల పాటు జరిగిన షెడ్యూల్‌లో కీలక సన్నివేశాల తెరకెక్కించారు. 'నాయకానాయికలు శర్వానంద్, సాక్షి వైద్యలపై ఓ పాటను చిత్రీకరించాం. అలాగే ఓ ఫైట్ సీక్వెన్స్‌ను కూడా తెరకెక్కించాం. ప్రేక్షకులకు వినోదాన్ని పంచడమే లక్ష్యంగా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను త్వరలో విడుదల చేస్తాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కథ: భాను భోగవరపు, నిర్మాతలు: అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రామ్ అబ్బరాజు.

అనూహ్య మలుపులతో 'క'

యువ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'క'. పీరియాడిక్ కథాంశంతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సుజీత్, సందీప్ దర్శకత్వం వహిస్తున్నారు శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకద్వయం సుజీత్, సందీప్ సోషల్‌మీడియా ద్వారా సినిమా విశేషాలను పంచుకున్నారు. తమ కెరీర్‌లో ఇదొక మెమొరబుల్ మూవీ అని పేర్కొన్నారు. 'గ్రామీణ నేపథ్యంలో జరిగే యాక్షన్ థ్రిల్లర్ ఇది. కథలోని మలుపులు ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తాయి. పీరియాడిక్ ఇతివృత్తంతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచే చిత్రమవుతుంది. ఈ చిత్ర మలయాళ థియేట్రికల్ హక్కులను అగ్ర హీరో దుల్కర్ సల్మాన్ సొంతం చేసుకున్నారు' అని తెలిపారు. నయన్‌సారిక, తన్వీరామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విశ్వాస్ డానియేల్, సంగీతం: సామ్ సీఎస్, దర్శకత్వం: సుజీత్, సందీప్.





జీవితమనే శత్రువుని గెలవాలి

యువ హీరోలు ప్రిన్స్, ఆగస్త్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కలి'. శివ శేషు దర్శకుడు. రుద్ర క్రియేషన్స్ పతాకంపై లీలా గౌతమ్ వర్మ నిర్మిస్తున్నారు. సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబర్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ఈ సినిమా ట్రైలర్‌ను 'హనుమాన్' ఫేమ్ దర్శకుడు ప్రశాంత్‌వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..ట్రైలర్ చాలా థ్రిల్లింగ్ ఉందని, గ్రిప్పింగ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా అనిపిస్తున్నదని అన్నారు. కుటుంబ కష్టాలతో శివరామ్ అనే యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నిస్తాడు. అదే సమయంలో ఓ అపరిచిత వ్యక్తి అతని ఇంటికి వస్తాడు. ఆ తర్వాత ఏం జరిగిందనే అంశాలతో ట్రైలర్ ఉత్కంఠను పంచింది. 'మనిషి పుట్టడంతోనే జీవితం అనే శత్రువుని వెంటేసుకొని మరీ పుడతాడు. దాని మీద గెలిచినోడే గొప్పోడవుతాడు. ఓడినోడు మధ్యలోనే..' అంటూ ప్రియదర్శి అందించిన వాయిస్ ఓవర్ కథలోని సోల్‌ని తెలియజెపుతున్నది. ఈ చిత్రానికి కెమెరా: నిషాంత్ కటారి, రమణ జాగర్లమూడి, సంగీతం: జీవన్‌బాబు, సమర్పణ: కె.రాఘవేంద్రరెడ్డి, రచన-దర్శకత్వం: శివ శేషు.

రైతులకు క్షమాపణ



రైతు సాగు చట్టాల అమలు గురించి సినీ నటి , బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ప్రతిపక్ష పార్టీలన్నీ కంగనా రనౌత్ తీరుని తప్పుబట్టాయి. ఆమె వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని రైతులకు క్షమాపణలు చెబుతున్నట్లు కంగనా రనౌత్ బుధవారం ఎక్స్ (ట్విట్టర్) ద్వారా తెలిపింది. 'నేను బీజేపీ కార్యకర్తను. నా మాటలను పార్టీకి సంబంధించిన స్టాండ్‌గానే చూడాలి. నా వ్యక్తిగత అభిప్రాయంగా పరిగణించవొద్దు. ఒకవేళ నా మాటలు మిమ్మల్ని బాధపెట్టి ఉంటే క్షమాపణ కోరుతున్నా. నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా' అని ట్విట్టర్‌లో విడుదల చేసిన వీడియోలో కంగనా రనౌత్ పేర్కొంది. కొద్ది రోజుల క్రితం హిమాచల్‌ప్రదేశ్‌లోని సొంత నియోజకవర్గం మండీలో జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్న కంగనా రనౌత్ సాగు చట్టాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే సాగు చట్టాలపై వ్యతిరేకత వస్తున్నది కాబట్టి వాటిని అమలు చేసే విషయంలో కేంద్రం పునరాలోచన చేయాలని కోరింది. ఆమె వ్యాఖ్యలపై అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో తాజాగా వాటిని వెనక్కి తీసుకుంటున్నట్లు కంగనా రనౌత్ ట్విట్టర్ ద్వారా తెలిపింది.

ఒక్కరాత్రి జరిగే కథ

కార్తీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన 'సత్యం సుందరం' చిత్రం ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకరానుంది. '96' ఫేమ్ ప్రేమ్‌కుమార్ దర్శకత్వం వహించారు. సూర్య, జ్యోతిక నిర్మాతలు. తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా దర్శకుడు ప్రేమ్‌కుమార్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇదొక అందమైన ఫ్యామిలీ డ్రామా. ఒక్క రాత్రిలో కథ జరుగుతుంది. కార్తీ, అరవింద్ స్వామి మధ్య ఉన్న అనుబంధం ఏమిటి? వారి మధ్య ఎలాంటి మానసిక సంఘర్షణ చోటుచేసుకుంది అనే అంశాలు ఆసక్తికరంగా అనిపిస్తాయి' అన్నారు. ఈ కథను తొలుత నవలగా రాశానని, ఆ తర్వాత సినిమా ఫార్మాట్‌లో స్క్రిప్ట్‌గా తీర్చిదిద్దానని ప్రేమ్‌కుమార్ తెలిపారు. 'కార్తీ, అరవింద్ స్వామి నవలను చదివారు. వారికి ఎంతగానో నచ్చింది. ఆ తర్వాత స్క్రిప్ట్ విని కూడా హ్యాపీగా ఫీలయ్యారు. ఇద్దరూ అద్భుతమైన పర్ఫార్మెన్స్ కనబరిచారు. గోవింద వసంత మ్యూజిక్ సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తుంది. సినిమాటోగ్రఫీ, విజువల్స్ మరో స్థాయిలో ఉంటాయి. తెలుగు వెర్షన్ డబ్బింగ్ బాగా వచ్చింది. స్ట్రెయిట్ తెలుగు సినిమా చూస్తున్న అనుభూతినిస్తుంది' అన్నారు.

